BHARATHEEYA KATHALU

Dr. Nalimela Bhaskar



పద్నాలుగు భారతీయ భాషలు
తెలిసిన డా॥ నలిమెల భాస్కర్
ఆయా సందర్భాల్లో ఆయా భాషల్లోంచి
అనువదించిన కథలు. ఇవి
పత్రికల్లో ప్రచురించబడినవి.
ప్రస్తుతం కొన్ని కథల్ని " భారతీయ కథలు"
పేర"రామయ్య విద్యా పీఠం"
పక్షాన వెలువరిస్తున్నాం.
ఇవన్నీ చదువదగిన కథలు
ఆలోచనలు రేకెత్తించే సందర్భాలు.

\- జూలూరు గౌరీశంకర్

రామయ్య విద్యాపీఠం

భారతీయ కథలు

డా॥ నలిమెల భాస్కర్



భారతీయ కథలు

డా॥ నలిమెల భాస్కర్

సంపాదకుడు

జూలూరు గౌరీశంకర్

రామయ్య విద్యాపీఠం

భారతీయ కథలు

డా॥ నలిమెల భాస్కర్

ప్రచురణ కాలం : 2010

ప్రతులకు : రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో

జూలూరు గౌరీశంకర్
జర్నలిస్ట్, సంపాదకుడు,
1-8-702/33/20ఎ
పద్మాకాలనీ, నల్లకుంట,
హైదరాబాద్-500 044

వెల : **రు. 60/-**

కవర్ డిజైన్ : ఏలె లక్ష్మణ్

కంపోజింగ్ & పేజి లే అవుట్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-44
ఫోన్ : 27660000

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
(మల్టీకలర్ ప్రింటర్స్ & డిజైనర్స్)
విద్యానగర్, హైదరాబాద్-44 ఫోన్ : 27618261

పొరుగింటి తియ్యకూర

పద్నాలుగు భారతీయ భాషలు తెలిసిన డా॥ నలిమెల భాస్కర్ ఆయా సందర్భాల్లో ఆయా భాషల్లోంచి అనువదించి అంతకు ముందే పత్రికల్లో ప్రచురించబడిన కొన్ని కథల్ని "భారతీయ కథలు" పేర ప్రస్తుతం "రామయ్య విద్యా పీఠం" పక్షాన వెలువరిస్తున్నాము. ఇవన్నీ చదువతగిన కథలు, ఆలోచనలు రేకిత్తించే సందర్భాలు.

ఇందులో "ఎల్లలు లేని లోకం" వికలాంగుల, కురూపుల ప్రేమ కథ. మనం నాగరికులమనుకుంటాం. మనమే అందచందాల స్వరూపులమూ, అన్ని అవయవాల సకలాంగులమూ అనుకుంటాం. అయితే నాగరిక ప్రపంచంలో డొల్లతనానికి ప్రతీక ఈ కథ.

దారిపొడుగునా గుండె నెత్తురులు దానం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల కథ "తపస్సు". "నవగ్రహాల పార్లమెంటు" బెంగాలీ భాషలోని అద్భుతమైన కథ. నిజంగా కథకి ఇలాంటి వస్తువూ, శిల్పమూ అవసరమేమో అనిపించే కథ.

కుహనా రాజకీయ నాయకుల, మంత్రుల, ముఖ్యమంత్రుల ప్రధానమంత్రుల పట్ల చెంప పెట్టూ, చపేటంలాంటి కథ "అమర వీరుడు."

మత సామరస్యానికి మచ్చుతునక "బురఖా" కన్నడ కథ. ఓ.వి. విజయన్ రాసిన మలయాళ కథ "పువ్వు", చలం గారి "ఓ పువ్వు పూసింది"కి చాలా దగ్గర.

ఉన్నవాళ్ళ పుట్టినరోజూ లేనివాళ్ళ చావూ..... ఈ రెండింటి తారతమ్యాన్ని చక్కగా ఎత్తి చూపుతోంది బెంగాలీ "జననం-మరణం". ఇది పథేర్ పాంచాలి రచయిత విభూతి భూషణ బందోపాధ్యాయ రచన.

కన్నడ రచయిత్రి సంధ్యారెడ్డి "తల్లి చీర" గుండె కరిగే నీరు నీరయ్యే కథ. కన్నడ కథే "ఇల్లు" అన్నాచెల్లెళ్ల రక్త సంబంధానికి గొప్ప వ్యక్తీకరణ. బెంగాల్ కథ ఫోనుకు అవతల వైపు వ్యక్తి ఆద్యంతమూ ఉత్కంఠతతో సాగే రచన. ఈనాటి దేశమే వృద్ధాశ్రమమై పోయిన వైనానికి ఉదాహరణ. దేశబాంధవుడు, గోదావరి కథల్లోని వస్తువుకూ తెలుగు వాతావరణానికీ సంబంధమూ వుంది.

"ఎర్రనికథ" భావేద్వాగానికీ, కవిత్వానికీ, కుక్క విశ్వాసానికీ నిలువెత్తు ప్రతీక.

ఇట్లాంటి అనేకానేక కథల రుచుల్ని చూశాక పొరుగింటిది పుల్లకూర కాదనీ అదీ మనలాంటి తియ్యకూరేననీ అనుకోకుండా ఎలా ఉండగలం?

- జూలూరు గౌరీశంకర్

విషయ సూచిక

ఎల్లలు లేని లోకం

తమిళ మూలం : ఎస్. అరుణ్ మొళినంగై

సముద్రం ఆమె కాళ్ళకేసి చూశాడు. ఆడవాళ్ళెవరినీ చూసే సాహసం లేదు ఆయనకి. కానీ తనని చూసే ఆడవాళ్ళంతా తననే మళ్ళీ మళ్ళీ చూస్తున్నట్టు తన అనుమానం. అందులోనూ అందగత్తెలు తనని చూసి ముఖాలు చిట్లిస్తున్నట్టు మనసు మారు మూలల్లో వెలితి. మామూలైన ముఖాల్ని చూసీ చూడనట్టు వెళ్ళి పోతారు జనం. విపరీత అందమైనా, అందవికారమైనా అందరి దృష్టిని మళ్ళిస్తుంది. ఆడవాళ్ళ కళ్ళలో తన ముఖం ఏర్పరిచే కదలికల్ని తను పసికట్టగలడు. ఈ అవమానాలన్నీ నత్తగుల్లల్లో నత్తలా తను దాచుకుంటున్నాడు.

రైలు బయల్దేరింది. సముద్రం ఐదారు అరటి తొక్కలు చెల్లా చెదరుగా పడివున్న కంపార్టుమెంటుని గమనిస్తున్నాడు. తర్వాత అతని చూపులు క్రమంగా ఆమె చీరకుచ్చిళ్ళ చివరి కదలికల్ని గమనిస్తున్నాయి. అతనికి ఆడవాళ్ళంటే వాళ్ళ కాళ్ళే! పదిహేనేళ్ళ నుంచీ రోజూ వాళ్ళ కాళ్ళనే చూస్తున్నాడు. ముఖాల్ని చూసి గుర్తుపట్టినట్టుగానే ఆయన కాళ్ళని చూసి ఫలానావాళ్ళని చెప్పగలడు.

ఆమె కాళ్ళు తెల్లగా వున్నాయి లేదా తెల్లని ఒర ఏదో పైన కప్పినట్టున్నాయి. కానీ...వేళ్ళూ, గోళ్ళూ కన్పిస్తున్నాయి. ఒకవేళ ఆంగ్లేయ స్త్రీ కావచ్చునేమో! పోనీ ముఖం చూద్దామా? వద్దా?

చాలాసేపయ్యాక సముద్రం కళ్ళని మెల్లిగా ఎత్తి ఆమెకేసి లీలగా చూశాడు. గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఆమె ముఖం పూసి వుంది. చామనఛాయ మీద అన్ని తెల్ల మచ్చలే. పరమ వికారంగా వుంది. ఓ క్షణం తికమకపడ్డాడు. తర్వాత మనసు సమాధానపరచుకొని ఆమెని పరిశీలనగా చూశాడు. శరీరమంతా తెల్లని కుష్ఠువ్యాధి మచ్చలే. బక్కపలుచని శరీరం. ఇరవైఐదేళ్ళు వుండవచ్చు. సముద్రం ఆమెని నిదానంగా చూస్తున్నాడు.

హఠాత్తుగా ఆశ్చర్యపోయాడు. తనలో తనే నవ్వుకున్నాడు. అతనికి వూహ తెలిసాక యింత సావకాశంగా ఎవరినీ చూళ్లేదు మరి! అతని మనస్సు పొంగిపోయింది.

మనస్సు చిరునవ్వులా మారి ముఖంలో కన్పించింది. ఆమె అతణ్ని చూసింది. వెంటనే ఆమె కళ్ళలో ఏదో కదలిక. ఆమె కళ్ళలోని కదలికనీ, తిరస్కారభావాన్నీ అతడు కనుక్కోగలిగాడు. 'నీకు ఇలా కావల్సిందే'! అని తనని తానే తిట్టుకున్నాడు. 'ఏ ధైర్యంతో ఆమెని అలా చూశావు? ఆమెకు రోగం నయమయ్యే అవకాశముంది. నీవు పుట్టు వికారివి...' అని అనుకున్నాడు.

ఆ తర్వాత అతడు ఆమెని తలెత్తి చూడలేదు. ఆమె చూపులు మాత్రం తన మీద పడుతూ పడుతూ తొలగిపోతున్నట్లు పసిగట్టగలిగాడు.

"సేలంలో ఈ రైలు ఆగుతుందా?"

ఆమె ఎవరినో అడుగుతున్నట్లుంది

"మిమ్మల్నే......................" అంది ఆమె.

సముద్ర శరీరం కంపిస్తోంది. 'నన్నేనా'? సందేహంగా ఆమెకేసి చూశాడు. ఆమె మెల్లిగా నవ్వింది. ఆమె పెదాలూ, పళ్ళూ ఆకర్షణీయంగా ఉన్నై. ఒక్క క్షణంలో ఆమెని అందగత్తెలా మార్చేసింది ఆ చిరునవ్వు. "ఏమడిగారు?" తన గొంతేనా అని అనుమానం ఏర్పడింది అతనికి. "ఈ రైలు సేలంలో ఆగుతుందా అని?" "రైలా?" అంటూ "సేలంలో రైళ్ళన్నీ ఆగుతాయి?" అన్నాడు. "మీరెక్కడికి వెళ్ళాలి"?

సముద్రం అన్నాడు.

ఆమె తికమక చెంది "ఏమిటది?" అంది.

సముద్రానికి తనేం చెప్పాడో తెలియలేదు. 'ఓ స్త్రీతో తను కూడా మాట్లాడ్డామా?' అన్న విస్మయంలోంచి యింకా తేరుకోలేదు.

"ఆఫీస్ పనిమీద పోతున్నాను. మూడురోజుల ట్రెయినింగ్" అన్నాడు.

ఆమె నవ్వుతూనే "సముద్రమనేది మీ పేరా?" అంది.

సముద్రం "మద్రాస్" అన్నాడు. "టెలిఫోన్స్‌లో పనిచేస్తున్నాను" అన్నాడు.

ఆమె ఆపుకోలేక నవ్వేసింది. సముద్రానికి ఒళ్ళు చెమటతో నానిపోయిందని తెలిసింది. దిగ్భ్రమ చెంది ఆమె నవ్వునే గమనిస్తున్నాడు.

ఆమె "నాపేరు కనకం" అంది. "నేనూ మద్రాసే పోతున్నాను" అంది.

"సేలంలో దిగాలా?" అన్నాడు.

"లేదే............ మద్రాసే వెళ్ళాలి"

"మరి సేలంల్లో దిగాలన్నారే?"

మళ్ళీ ఆమె కంగారుచెంది పిదప తమాయించుకొంటూ–

"సేలంలో ఆగుతుందా అనే అడిగాను" అంది.

"ఎందుకు?"

"ఆకలేస్తుంది. పళ్ళు తీసుకోవచ్చు..."

'నేను కొని యిస్తాను లెండి' అన మనసులోనే అనుకున్నాడు. కొంపదీసి ఆ మాటలు బయటికి అనలేదు కదా అనుకున్నాడు.

"టెలిఫోన్సులో పనా?"

"అవును. ఆపరేటర్"

"హలో హలో?"

సముద్రం గట్టిగా నవ్వాడు. అతని మనస్సు ఆగడం లేదు. తన నవ్వు తనకి విన్పిస్తోంది. కంగారుపడి ఆపేశాడు కారణం. ఇంత వరకలా అతను నవ్వలా. అంతగా నవ్వేలా ఏం సంభవించిందో అతనికి తెలియలా.

"మద్రాసులో ఎవరున్నారు?" అన్నాడు సముద్రం.

"అక్క ఆమెకీ, బావకీ పనివుంది. పిల్లల్ని నేనే చూసుకోవడం"

"ఇప్పుడు ఎక్కడికి వెళ్ళి వస్తున్నారు?"

"కోయంబత్తూర్‌లో మా అమ్మ ఉంటుంది. అన్నయ్య కూడాను. అప్పుడప్పుడు వెళ్ళి చూసొస్తాను."

"ఒంటరిగానా?"

ఆమె నవ్వింది. "నాకు భయమా? రౌడీలెవరైనా నన్ను చూస్తేనే ముఖాలు చిట్లిస్తారు".

సముద్రానికి ఆమెమీద ఉన్నపళంగా జాలి కలిగింది. ఏమైనా ఆమె దుఃఖం సహించరానిది. ఆమె కూడా స్త్రీయే కదా!

"ఎప్పుడు ప్రారంభమైంది యిది?" అన్నాడు.

"ఏంటి? ఈ రోగమా?"

"అవును"

"పదో తరగతి చదువుతున్నప్పుడు దాంతో చదువూ ఆగిపోయింది. మందులూ, మంత్రాలూ అని తిరిగిన లోపే చదువైనా పూర్తిచేసేదాన్ని! ఎక్కడైనా పనిదొరికతే కూటికోసం యింత బాధపడాల్సివచ్చేది కాదు".

సముద్రం సంశయిస్తూనే "మీ అక్క..." అన్నాడు.

ఆమె కిటికీలోంచి చూస్తూనే "కొన్ని రోజులు అలవాటయితే సరి...ప్రేమా, జాలీ అన్నీ పోతాయి" అంది.

ఎంతోసేపు మౌనం నెలకొంది.

అకస్మాత్తుగా నవ్వుతూ "నన్ను మా అక్క ఎలా పిలుస్తుందో తెలుసా?" అంటూ, గొంతు మార్చి "ఏయ్ రోగిష్టిముండా!" అంది.

అతని ముఖం నల్లబడింది. "మా ఆఫీస్‌లో నాకూ పేర్లు పెడతారు".

"ఆఫీస్‌లో ఆటపట్టిస్తారా?"

"నేనే మా ఆఫీస్ సర్కస్‌లో బఫూన్. అయినా జీవకారుణ్యం వున్నవాళ్ళే!"

"ఈ జీవకారుణ్యమే పెద్ద సమస్య" అంది ఆమె. "అది లేకపోతే మనం యిలా జీవించి ఉండేవాళ్ళం కాము. అడపాదడపా మనల్ని సఫా చేసి ఉండేవాళ్ళు."

"నిజమే!" అన్నాడు నిర్లిప్తంగా.

"నేను కొన్నిసార్లు యిలా ఆలోచిస్తుంటాను. ఈ ప్రపంచమే అందంగా వున్నవాళ్ళ సొంతం కావచ్చు. మనల్ని చూస్తోన్న ప్రతి ఒక్కడూ 'ఈ శనిగాడు ఎందుకు బతుకుతున్నాడు?' అని అనుకొని ఉంటాడు. చట్టం అనుమతిస్తే ఈపాటికి మన అంతుచేసి ఉండేవాళ్ళే!"

ఆమె నిట్టూర్చింది.

"ఇలాగే నేనూ చాలాసార్లు అనుకుంటాను. అంతా ఓ పెద్ద తమాషాలా వుంటుంది. పెద్ద గ్యాలరీలో ఏకాకిగా వేడుక చూస్తున్నట్లుంటుంది. నన్ను ఎవరూ దగ్గరికి రానివ్వరు."

"ఇప్పుడు...గ్యాలరీలో ఇంకొకరు కూడా....అవునా?" అంది.

అతని మనసులో చెప్పరాని ఆహ్లాదం. ఆమె కళ్ళతో కళ్ళు కలిపాడు. తర్వాత ఏం మాట్లాడాలో అతనికి తోచలా. ఆమె కాస్త తీక్షణమైన ధ్వనితోనే-" అంగవికలుల్నీ, అనాకారుల్నీ, యిలాంటి శాల్తీల్నీ, అప్పుడప్పుడు చంపేసెయ్యాలి. ఏమంటారు?" అంది.

అతడు ఆమెను తదేకంగా చూశాడు.

'నిజమే చెబుతున్నాను...ఏదో పెద్దగా జాలి చూపిస్తున్నట్టు మనని బతకనివ్వడమనేది క్రూరమైన విషయం. దినదినమూ చంపడం కన్నా, పుట్టినప్పుడే కథ ముగిసిపోవడం హాయిగా ఉంటుంది."

ఆమె ముఖంలోకి వంట్లోని రక్తమంతా చేరి ఎర్రబడింది. అతడు ఆమెనే చూస్తున్నాడు. తర్వాత "నిజమే!" అన్నాడు. ఆమె మనసులో పొగ పెట్టినట్లయింది. కాసేపు యిద్దరూ ముభావంగా వుండిపోయారు.

సేలం వచ్చేసింది. అతడు దిగిపోయి పళ్ళు తీసికొచ్చాడు.

"తినండి"

"వద్దు"

"తినండి! అడిగారు కదా అప్పుడు.."

"మీరూ తినండి" అంది.

ఒక్కపండు మాత్రం తిని "చాలు" అంది.

"ఏం? ఆకలవుతోంది అన్నారే?"

"ఊరికే అన్నాను"

"ఊరికేనా?"

"అవును. మీతో మాట్లాడాలనిపించి సేలం గురించి అడిగాను".

సముద్రం తనలో తాను చిన్నగా నవ్వుకున్నాడు. ఆమె కూడా నవ్వింది.

"ఏమిటో...నేను మిమ్మల్ని చూసి ముఖం తిప్పుకున్నాను కదా అప్పుడు మీరు గాయపడి వుంటారు. అవునా?"

"అదేం కాదు"

"అబద్ధం"

"నాకు అలవాటే"

ఆమె ముఖం కళావిహీనమైంది. "నాకు కూడాను..." అంది.

"నేనిలా మగవాళ్ళతో మాట్లాడ్డం ఇదే మొదలు"

సముద్రం మనసు ద్రవించింది. గొంతు ఎండుకుపోయింది.

"ఆడవాళ్ళతో మాట్లాడ్డం నాకూ తొలిస్సారి".

ఆమె బయటకు చూస్తుంది. తాటిచెట్లున్న బయలు పరుగుతీస్తోంది.

"మద్రాసులో ఎక్కడ?" అన్నాడు సముద్రం.

"సేత్తుప్పట్టు"

"మా ట్రైనింగ్ పెరంబూర్‌లో"

"మూడురోజులే కదా?"

"అవును"

"తర్వాత...వెళ్ళిపోతారా?"

"ఊ..."

మళ్ళీ మౌనం. ఆమె కిటికీలోంచి చూస్తూనే నిట్టూర్చింది. చీకటి కమ్ముతోంది. పెట్టెలో లైట్లు వెలిగాయి. మగతలోకి జార్చే పలుచని పచ్చని వెలుతురు.

"జాలార్‌పేటలో భోజనం వస్తుంది" అన్నాడు.

ఆమె "అలాగా?" అంది.

"నేను వెజిటేరియన్. తిండి బావుండదు."

"ఊ..."

"అల్యూమినియం పాకెట్లలో యిస్తున్నారు. ఎంత అన్యాయం?"

"నన్ను చూడగానే మీరు ఏమనుకున్నారు?" అంది హఠాత్తుగా.

"ఏంటి?"

"నన్ను మొట్టమొదట చూసి ఏమనుకున్నారు?"

"అది ముఖ్యమైన విషయం కాదు. ఇప్పుడేం అనుకుంటున్నాను అనేదే ముఖ్యం".

ఆమె చిరునవ్వుతో "ఏమనుకుంటున్నారు?" అంది.

"అజంతా వెళ్ళారా ఎప్పుడైనా?"

"లేదు"

స్వప్నలోకాల్లో విహరిస్తూ "అజంతాలో ఓ దేవకన్య చిత్రం వుంది. అలా వున్నారు" అన్నాడు.

"ఎగతాళి చేస్తున్నారు కదూ!"

"నిజంగా. ఆ చిత్రం చాలా శిథిలమై వుంది. దాన్ని చూడగానే మొదట బాగనిపించదు. తర్వాత పెచ్చులు పెచ్చులుగా వూడిపోయిన భాగాల్ని తొలగించుకొని, మెల్లగా చిత్రాన్నే గమనిస్తుంటే అద్భుతమైన అందగత్తె కనిపిస్తుంది."

ఆమె సిగ్గిల్లింది.

అతడిలో ఏదో ఉత్సాహం. నిండు జాబిల్లి పండు వెన్నెలలో పంటచేలు కిటికీ నించి పరుగు తీస్తున్నాయి.

"వెన్నెల ఎంత బాగుంది" అన్నాడు.

"నాకు వెన్నెలంటే నచ్చదు"

"ఎందుకు?"

"ఎందుకో...చీకటంటేనే యిష్టం"

"నాకు వెన్నెలంటే ఎంతో ఉల్లాసం. వెన్నెల రోజుల్లో బోలెడు బొమ్మలు గీస్తాను."

"బొమ్మలు గీస్తారా?"

"చాలా గీసాను."

"ఏం గీస్తారు?"

"ఆయిల్ పెయింటింగ్...వాష్ డ్రాయింగ్.."

"ఏదేదో చెబుతున్నారు. వేటిని దించుతారు? మనుష్యులనా?"

"మనుష్యుల్నీ గీస్తాను. ఎక్కువగా మృగాలనే!"

"ఎందుకని?"

"ఎందుకంటే...మృగాల్లో అందంలేని జంతువేదీ లేదు. అన్ని జంతువులూ ప్రకృతి సిద్ధంగా వున్నప్పుడు అందంగా ఉంటాయి."

"పంది?"

"పంది వురుకుతుంటే చూశారా? దాని తోక వూగడమూ, శరీర కదలికలూ!

ఎంత అందం? మీరు దాన్నెప్పుడూ మురికి కాల్వలతో కలిపి చూడ్డం తప్పు. దానికి మురికి కూపమేంటి? చందనమేంటి?"

"ఏమో! తమాషాగా మాట్లాడుతున్నారు"

"నేనిలా ఎవరితోనూ మాట్లాడలేదు-తెలుసా?"

అతడు చిత్రాల గురించి మాట్లాడనారంభించాడు. తనకూ యిన్ని విషయాలు తెలుసునా అనుకొని విస్మితుడయ్యాడు. ఆమె కళ్ళలో కొత్త కాంతులీనుతున్నాయి. అతణ్ణే గమనిస్తోంది. కాసేపు మళ్ళీ నిశ్శబ్దం. ఒకింత నిద్ర. తర్వాత మళ్ళీ కొంతసేపు సంభాషణ. ఆమె తనింటి గురించి చెప్పింది. సంగీతం నేర్చుకొంటున్నానని తెలిపింది.

తెల్లవారుతుంటే "పెరంబూర్ వస్తోంది" అంది.

అతణ్ణి ఎవరో చరిచినట్లనిపించింది. మనస్సు శూన్యమైంది.

"అంతే!" అనుకున్నాడు తనలో తనే! మళ్ళీ "అంతేనా?" అని ప్రశ్నించుకున్నాడు. అతనిలో అకస్మాత్తుగా ఓ అభిప్రాయం ఏర్పడింది. ఆమెని అడుగుదామా అనుకున్నాడు ఏమో.... భయం వేసింది. ఏమనుకుంటుందో? ఉన్నపళంగా పాత సముద్రంలా మారిపోయాడు.

ఆమెతో విషయం ఎలా కదపడం? ఆమే కాదు లోకంలో ఏ అనాకారి స్త్రీ కూడా తనలాంటి మగణ్ణి కోరుకోదు. ఒకవేళ తనప్రేమ అంగీకరించబడితే? కానీ...తిరస్కరించబడితే మాత్రం అతడు బ్రతకలేడు.

కనకం ఏం చేస్తుంది? ఒప్పుకోవచ్చు అనిపించింది. మనస్సుకి నమ్మకం కలిగింది. అతికష్టంగా మనసులోని మాట చెప్పాలని ప్రయత్నించాడు. నాభి దగ్గర్నుంచి మాటలు తీసుకురావాలనుకున్నాడు. తక్షణమే అతని నమ్మకం చెదిరిపోయింది. రైలు ధడ ధడ మంటూ సాగిపోతోంది. పెరంబూర్ సమీపిస్తుంటే మనస్సు శాంతించి నట్లనిపించింది. రైలు కేకేస్తూ నిలిచిపోయింది. ఆమె కళ్ళలోకి చూడాలనుకున్నాడు. ఆమె తనకేసే చూస్తుందని గమనించాడు.

సెలవు పుచ్చుకునే ధోరణితో ఆమెను చూశాడు. ఆమె నవ్వుతూనే "మరి...కలుద్దాం!" అంది.

అతని ఆవేదన దూరమైంది. ఏదో విసుగ్గా వుంది. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో "రాత్రి చక్కగా పొద్దుపోయింది కదూ!"అన్నాడు.

అతడు దిగిపోయాడు. మనస్సు మండిపోతోంది. 'ఎంత సులువుగా వీడ్కోలు చెప్పింది! తన అభిప్రాయాన్ని బయట పెట్టకపోవడమే మంచిదైంది. కానీ...భగవాన్! కళ్ళు సజలాలయ్యాయి. నడవలేకపోయాడు.

రైలు కేకేసింది. తన ప్రాణాలు తోడేస్తున్నట్లున్న కూత. రైలు చక్రాలు తన గుండెల మీద నడుస్తున్నట్లనిపించింది. ససేమిరా వీల్లేదు. ఈ కథ యిలా ముగియడం నచ్చలేదు. ఆమెతో చెప్పేసేయాలి. ఆమె నిరాకరించినా ఫరవాలేదు. చెప్పాలి. ఈ సందిగ్ధావస్థలో చచ్చిపోకూడదు. ఆమె తిరస్కరించనీ..అపేక్షించనీ. కానీ! ఆమెతో చెప్పనే చెప్పాలి. లేకుంటే హృదయం బద్దలైపోతుందేమో!

అతడు పరుగెత్తే రైల్లోకి దూకాడు. కిటికీకి ఓరగా అరచేతుల్లో ముఖం దాచుకొని ఆమె. ఆమె భుజాలు కదులుతున్నాయి. ఏడుస్తోందా?

అవును. ఆమె మౌనంగా కుమిలి కుమిలి రోదిస్తుంది. తనెంత మూర్ఖుడు? తనెందుకు తెలుసుకోలేక పోయాడు?

మెల్లిగా ఆమె దగ్గర కూర్చున్నాడు. ఆమె గమనించనే లేదు. తర్వాత ఏడుపు ఆగిపోయింది. అతడు మాట్లాడకుండానే కూర్చుని పోయాడు.

ఆమె చీరతో ముఖం తుడుచుకొంది. తర్వాత ఓరకంట అతణ్ణి చూసింది. అతడి ముఖంలో ఏవో భావాలు. ఆమె తన కళ్ళని దించుతూ నవ్వింది. అతడూ నవ్వాడు.

చెప్పాల్సింది ఏదీ లేదని అతనికి తెలిసిపోయింది. అతడి చెయ్యి మెల్లిగా ఆమె చేతిని స్పృశించింది. వేళ్ళు పరస్పరం అల్లుకు పోయినై. అతనికి మాటలు కరువయ్యాయి. ఒక్క స్పర్శతో ఉభయుల శరీరాల్లో చైతన్య ప్రవాహాలు. రైలు పరుగిడుతూనే వుంది.

ఏదో కలలోంచి దిగ్గున మెలకువ వచ్చినట్లు ఈ లోకంలోకి వచ్చాడతడు. ఆమె కళ్ళు సగం మూసుకొని ఉన్నాయి. పెదాలు అస్పష్టంగా, అందంగా కదులుతున్నాయి. ముఖంలో కలలు కన్పిస్తున్నాయి.

"ఏమిటాలోచిస్తున్నారు?" అన్నాడు.

ఆమె అతణ్ణి కన్నెత్తి చూసింది. ఆమె ముఖం సిగ్గుతో ఎరుపెక్కింది. చిరునవ్వుతో తల వంచుకుంది.

"ఏమిటి"

"ఊహూ"

"ఏమిటి? చెప్పనా?"

"ఓ విషయం ఆలోచించాను"

"దేని గురించి"

"మనకి పుట్టబోయే బిడ్డ గురించి"

సముద్రంకి నవ్వు ఆగలేదు. "మనబిడ్డా? అప్పుడేనా?" అన్నాడు.

ఆమెకూ నవ్వు వచ్చింది.

"అవునూ...వాడు నాలాగే వుంటే?"

"మీలాగే ఉండాలి"

"నీవు నిన్ననే చెప్పావు కదా...చంపేసేయాలని"

"అది...అప్పుడు"

"ఇప్పుడు మనసు మారిపోయిందా?"

"ఉమ్" అంది. "నిన్న చెప్పారు కదా...అందంలేని జంతువే లేదని"

"అవునూ..."

"అందంలేని మనుషులు కూడా లేరు"

ఆమె అతణ్ణి తన బాహులతలతో చుట్టేసింది.

"మూసీ" ద్వైవార్షిక ప్రత్యేక సంచిక, నవంబరు, డిసెంబరు 1999.

తపస్సు

హిందీ మూలం : హిమాంశు

"మీరు మా కోసం ఏం చేశారు?"

చావడానికి ముందు మృత్యుశయ్య మీద వున్న నా భార్య తన సహజమైన ఆవేశంతో అడిగినప్పుడు నేను ఆమెనే చూస్తూ ఉండిపోయాను.

"నువ్వు కూడా యిలాగే ఆలోచిస్తున్నావా?" నేను ఓపిగ్గా ప్రశ్నించాను.

"హూం...అవును. నేనూ యిలాగే ఆలోచిస్తున్నాను. ఖచ్చితంగా యిలాగే ఆలోచిస్తున్నాను. జీవితమంతా ఓ పిడికెడు అన్నం కోసం వెంపరలాడాము. పుట్టింటినుంచి తీసికొస్తే తప్ప పూట గడవని రోజులవి. పిల్లల్ని చదివించలేకపోయాం. ఫీజులు ఎక్కణ్ణించి తేగలం? పండుగలూ, పబ్బాల దినాల్లో ఇల్లుదాటి బయటకు వెళ్లడానికే సంకోచం. ఒళ్ళు దాచుకోవడానికి చాలినన్ని గుడ్డలు లేక పోయేవి. నేను యితరుల పొలాల్లో కూలి పనికి వెళ్ళేదాన్ని! మీ గౌరవానికి లోపం కలగకూడదని నోరు మూసుకున్నాను యిన్నాళ్ళూ. మీరేమో గాంధీ గారికీ జై' అంటూ నిశ్చింతగా మీదైన ప్రత్యేక ప్రపంచంలో సంచరించేవారు. ఎప్పుడైనా మేం బతికే వున్నామా, చచ్చామా అని వెనుదిరిగి చూశారా? ఎప్పుడో ఓసారి భరించలేక నేను మీ వాలకం బాగోలేదని గట్టిగా అడిగితే, మీరు ఎలా జవాబు చెప్పి వూరుకుండేవారు? 'దేశ సేవ పుణ్యకార్యం, దేశం స్వతంత్రమైనప్పుడు మన కష్టాలన్నీ దూరమైపోతాయి'...నా ప్రశ్నకు యిదీ మీ సమాధానం. కానీ..కానీ..నేనిప్పుడు ఇన్నాళ్ళ తరువాత అడుగుతున్నాను.

చెప్పండి...రెండు పూటల తిండి మన అదృష్టంలో రాసి ఉందా? పిల్లలు పెద్దవాళ్ళై కష్టపడకుండా వుంటే మనం బిచ్చమెత్తుకోవాల్సి వచ్చేది..." ఓ క్షణం ఆగింది.

"యశవంతీ! నువ్వు సరిగానే చెబుతున్నావు. నాకు తెలుసు. ప్రవాలి పై చదువులు ఎందుకు చదవలేదనీ తెలుసు. సుమితకు మంచి సంబంధం చూసి యివ్వలేకపోయామనీ తెలుసు. పెద్దబ్బాయి రంగనాథ్ చిన్న జ్వరానికే ఎందుకు చనిపోయిందీ గుర్తుంది. అన్నీ తెలుసు. కాని నేనో వ్రతం ఆచరిస్తున్నాను కదా! అది దేశసేవ. పరాధీనతా శృంఖలాల నుంచి దేశాన్ని విముక్తం చేయడం. మాతృభూమి ఋణాన్ని మనమంతా తీర్చాల్సిందే కదా! ఎవరో ఒకరు బలిదానం చేయాల్సిందే. మన అదృష్టం బావుంది. మనం బతికే వున్నాం. ఉరికొయ్యలూ, బలిదానాలు లేక మనం యింకా బతికే వున్నాం" - సుదీర్ఘంగా నిట్టూర్చి బాధగా అన్నారు రథీన్‌బాబు. అతని కంఠం పూడుకుపోయింది

యశవంతి మనస్సులో స్వాతంత్ర్యం వచ్చి యిన్నాళ్ళైనప్పటికీ జీవితంలోని చేదుపోలేదు. ఆ నిష్ఠుర నిజాన్ని రథీన్‌బాబు గ్రహించలేకపోతున్నాడు.

"యశవంతీ! ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గుర్తులన్నాడు ఓ మహాకవి. పోయినవాళ్ళు ఏనాడైనా తిరిగొచ్చారా? మన రమాశంకర్ పరారీ అయ్యాడు, నీకు గుర్తుందా? రైలు కిందపడి చచ్చాడు తప్ప ఆంగ్లేయుల చేతికి చిక్కలేదు. దామో నిజంగానే పిచ్చిదైపోయింది. తన గుడ్డలకు నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకొని అసువులు బాసింది. నిజామ్ సాహెబ్ గుండెని జల్లెడలా అతని సంతానం ముందే చిల్లులు పొడిచారు. ఆ ఆవేశం నీకు తెలియనిది కాదు కదా! నీ అదృష్టం అక్కడికీ బావుంది. నేను జైలు శిక్షతోనే, కరినీరు జైలు శిక్షతోనే బతికి బయటపడ్డాను. మిగిలిన వాళ్ళు దారిపొడుగునా గుండె నెత్తురులు తర్పణ చెయ్యలేదూ? వాళ్ళ పిల్లల గతి ఆలోచించావా? నువ్వు నీ కష్టనష్టాల గురించే చెబుతున్నావే! వాళ్ళకీ దుఃఖం కొండంత వుంది".

యశవంతి మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత కొన్నాళ్ళకే ఆమె కన్ను మూసింది. కానీ...ఆమె హృదయం..ఆమె మాటలు రథీన్‌బాబుని అనునిత్యం దహించివేస్తున్నాయి. ఏ సమస్యల్ని అతను యిన్నాళ్ళు క్షుద్రమైనవని భావించాడో, అవే సమస్యలు ప్రస్తుతం పాము పడగలా విప్పారి కనిపిస్తున్నాయి.

ప్రవాలిను పై చదువులు చదివించినట్లయితే...జీవితాంతం గుమాస్తాగా వుండి

పోవాల్సి వచ్చేది కాదు. సుమితా వాడిపోయిన ముఖం....తన కళ్ళ ముందు తిరుగుతోంది...బుజొ...కేశు....శాంత...వీళ్ళంతా ఒక్కచోట చేరి ప్రశ్నార్థకాలై నించున్నారు.

"మన రథీన్ కరినీరు జైలు నించి యింకా ఎప్పుడొస్తాడు?" అని ముసలి తల్లి కుమిలి కుమిలి ఏడుస్తూ గుడ్డిదైపోయింది.

ఫ్రెంచివాళ్ళు ఇంటిని వేలం వేశారు. అనాథ కుటుంబం మరొకరి ఆశ్రయంలో వుండిపోవాల్సి వచ్చింది.

జైలు నరక యాతనలోంచి విడుదలై ఓ రోజు తిరిగొచ్చేసరికి అంతా నాశనమై పోయింది. ఆ రోజే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అయినప్పటికీ యిల్లు పోయి...కుటుంబం మరోచోట నివసిస్తూ...అంతా ధ్వంసమైపోయింది. రథీన్ బాబు కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి.

"రథీన్! మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది. కాస్త లైసెన్సులూ గియసెన్సులూ చేయించు. అలా డబ్బులు సంపాదించవచ్చు". ఆ మాటలు వినిపించడం తరువాయి రథీన్‌బాబు అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు. తెల్లని ఖాదీ గుడ్డలు ధరించి బరేలి జైలులో తమతో పాటు నిరర్గళంగా దేశభక్తి గురించి మాట్లాడుతోన్న అదే వ్యక్తి! దేశసేవ చేసినందుకు బదులుగా ఏమైనా తీసుకోవాలా?... ఈ రకమైన క్షుద్ర అవగాహన నుంచి రథీన్‌బాబు సహజంగానే దూరంగా వున్నాడు. ఆ రోజు ఎంతో దుఃఖంతో "నువ్వు చెప్పేది నిజమే కావచ్చును. దివాకర్ భాయీ! తల్లి సేవకి ప్రతిఫలంగా ఏదైనా కోరుకోవడం మహాపాపం. 'మాతృభూమి సేవ కోసం నూరు జన్మలు ఎత్తినా, నూరుసార్లు ప్రాణత్యాగం చేసినా, ఆ తల్లి త్యాగఋణం తీరదు గాక తీరదు' అని బారీంద్రబాబు చెప్పేవాడు గుర్తుందా? నేను మాతృదేశం కోసం నా సగం జీవితాన్నే యిచ్చాను దివాకర్ భాయీ!"

దివాకర్ "హో..హో" అంటూ చాలా సేపు నవ్వాడు. "పిల్లల్ని మనం బాగా చదివించుకోవచ్చు. వృద్ధాప్యాన్ని హాయిగా గడపొచ్చు. పూర్తిగా ఆదర్శాల కోసమే బతకొద్దు రథీన్‌బాబూ! తర్వాత పశ్చాత్తాపపడవలసి వస్తుంది" అని దివాకర్ చాలాసార్లు చెప్పి చూశాడు.

దేవలాలి క్యాంపులో ఆమరణ నిరాహారదీక్ష చేసి, బాపూజీ జయంతి రోజున తన

రక్తంతో ఉత్తరం రాసి, బ్రిటిష్ ముష్కరులను ముప్పుతిప్పలు పెట్టిన ఆ దివాకర్‌దాసేనా యితను అని నమ్మశక్యం కావడం లేదు రథీన్‌బాబుకు.

ఓరోజు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రథీన్‌బాబుకు తామ్రపత్రం అందించాలని అనుకున్నారు. కానీ అతను ఆ సభకు వెళ్ళలేదు.

'నేను దేశసేవ చేశాను. నిజమే! స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నాను. కానీ.... తామ్రపత్రం, ప్రశంసాపత్రాలు తీసుకొని నేనేం చేయాలి? తల్లిదండ్రుల సేవకు గుర్తింపుగా ఈ పత్రాలు స్వీకరించాలా? భగవదారాధన, మానవ సేవల గురించి మిగిలినవాళ్ళు ఎలా ఆలోచిస్తారో ఆ దేవునికే తెలుసు. నాకు మాత్రం ప్రతిఫలం మీద ఆశ లేదు".

అతనికి ఇష్టంలేని ఏ పని కూడా అతని జీవితంలో ఏనాడూ చేయలేదు. ఇవాళ జీవితం చరమాంకంలో ఎలా చేయగలడు?

అతనికి ఎనభై ఏళ్ళు నిండిన సందర్భంలో ఆ వీధి వాళ్ళు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద, పెద్ద నాయకులు వచ్చారు. సుదీర్ఘమైన ఉపన్యాసాలు ఇచ్చారు. రథీన్‌బాబు కేవలం మౌన ప్రేక్షకుడిలా మిగిలిపోయాడు. అతణ్ణి కూడా రెండు మాటలు చెప్పమని అడిగినప్పుడు అతనికి మొదట గొంతే పెగలలేదు. తర్వాత అతను కాస్త తమాయించుకొని, "కాకోరీ తర్వాత ఎందరో దేశభక్తులు తుపాకీ గుళ్ళకు గురయ్యారు. బలిదానం చేశారు. మీరేనాడైనా ఆలోచించారా? కరినీరు జైల్లో మేము అల్లరి చేశాము. 13వ డిసెంబర్ రాత్రి పదిహేడు మందిని కాల్చి చంపారు. రక్తసిక్తమైన శవాల్ని చూసి నేను చాలారోజుల వరకు పిచ్చివాణ్ణయ్యాను. ఇప్పటికీ రాత్రి చిమ్మచీకట్లో ఆ శవాలు నా కళ్ళ ముందు కదలాడుతున్నాయి. నేను పిచ్చివాణ్ణవుతున్నాను. ఆ శవాలు అరుస్తున్నాయి. ఆ హిందుస్థాన్ ఎక్కడికి వెళ్ళింది? అందుకోసమే కదా మేం బలి అయ్యాము..."

రంగు రంగుల దండలు. అయినా రథీన్‌బాబు ముట్టనే లేదు. మెడలో వేసుకోనూ లేదు. మౌనంగానే కూచుని వేదిక మీంచి దిగి తన గదికి వెళ్ళిపోయారు. తర్వాత చాలా రోజుల్దాకా మళ్ళీ ఎవరితోనూ మాట్లాడలేదు.

అప్పుడప్పుడు ఒంటరిగా పేటకు వెళతాడు. ఇంటికి తిరిగొచ్చి, "ఇవాళ చంద్రశేఖర్ అజాద్ కన్పించారు. రేషన్ క్యూలో నించుని ఉండడం చూశాను. చాలామంది వున్నారు. నేను అతనితో మాట్లాడలేకపోయాను" అని ఏవేవో మాట్లాడుతాడు.

పక్కమీంచి లేవగానే ఉన్నట్లుండి, "నిన్న రాత్రి భగత్‌సింగ్‌తో మాట్లాడాను. 'ఇంగ్లీషు వాళ్ళతో పోరాడతాను' అంటున్నాడు. నేనెంత సముదాయించినప్పటికీ వినక యుద్ధం చేయడానికి వెళుతున్నాడు. అతను నా మాటల్ని విన్పించుకునే స్థితిలోనే లేదు" అన్నాడు.

అన్నం తినేటప్పుడు చేతిలోకి ముద్ద తీసుకుని, "యశవంతి సరిగానే చెబుతుండేది! జీవితమంతా కూటికీ గుడ్డకీ ముఖం వాచి గడిపింది. పాపం! చనిపోయేటప్పుడు ఎముకల పోగులా తయారైంది. ప్రవాలీ! నువ్వు ఆమె ఎండిపోయిన చేతుల్ని చూశావా?" అంటున్నాడు.

పిల్లలతో రానూరాను మాటలు తగ్గించాడు. పేపర్ ముందుసుకుని గంటల కొద్ది చదువుతున్నాడు. రాత్రంతా చీకట్లో గడుపుతున్నాడు. పిల్లలు అతని గదికి వెళ్ళడానికే సంకోచిస్తున్నారు. ఇంటిల్లిపాదికీ భయంగా వుంది.

* * *

ఒక రోజు దీపు దినపత్రికంతా చదివేసి ఎంతో ఉత్సాహంగా, "తాతా! ప్రభుత్వం స్వాతంత్ర్యయోధులు ఉచితంగా 'కరినీరు'కు వెళ్ళడానికి అనుమతిచ్చిందట! మీరు కరినీరులో అప్పట్లో శిక్ష అనుభవించారు కదా! మీరే చాలా ఏళ్ళు అక్కడ గడిపారు. ఓసారి వెళ్ళిరండి. నేనూ మీ వెంట వస్తాను" నవ్వుతూ అన్నాడు.

రథీన్‌బాబు ఏమీ మాట్లాడలేదు. అతను వూరకే పేపర్ చూస్తూ ఉండిపోయాడు.

రోజు రోజంతా కడలి అలలు రాళ్ళకు తాకి బద్దలవుతున్నాయి. నీటి బిందువులు దూరతీరాలకు పాకుతున్నాయి. రాత్రంతా కంటిరెప్పలు మూతపడనేలేదు. ఒక్కక్షణం నిద్రపోలేదు. సెల్యులర్ జైల్లోని పెద్ద పెద్ద గోడలు...అంధకార బంధురమైన చిన్న చిన్న జైలు గదులు...బాబా ఖాన్‌సింగ్ బొంగురు గొంతు పాటలు...దినమంతా వీరసావర్కార్ హడావుడి....సముద్ర తీరంలో ఓ యువకుని శవం...

వీటినన్నింటిని ఇలాంటి రోజుల్ని చూడ్డానికే అనుభవించామా? చిరిగిపోయిన భారతదేశం పటం...చీలికలు పేలికలైన బంగారు స్వప్నాలు.

బిచ్చమెత్తుకునే పిల్లలు! దొమ్మీలూ, దోపిడీలతో కాలిబూడిదైన ఇళ్ళు... ఈ వీధుల్లో శవాలు...నలువైపులా చెత్తాచెదారం...పశువులూ, మనుష్యులూ ఒకే తొట్టెలో నీళ్ళు తాగుతోన్న దృశ్యాలు..ఇవి ఈనాటి రోజులు. నాటి కలలన్నీ కనుమరుగైపోయాయి.

మనం చేసిన తపస్సులోనే తప్పులుండి వుండాలి. అందువల్లే ఈ ప్రయాణం అసంపూర్ణమయిందేమో!

* * *

ఓ రోజు ఉదయాన తాత పెట్టే బేడా సర్దుకోవడం చూసి 'ఎక్కడికి'? అన్నాడు బుజ్జౌ బెదురుతూనే.

"తీర్థయాత్రకు"

"బనారస్, కాశి...?"

"కాదు.... 'కరినీరు'కు?"

"....కరినీరుకా?"

"అవును...మొదటిసారి చేసిన తపస్సు...అసంపూర్ణంగా వుండిపోయింది. ఈసారి పూర్తిచేయాలి" అతను తనకు తానే చెప్పుకుంటున్నట్లుగా అన్నాడు.

లేవడానికి ప్రయత్నించి పడిపోయాడు. పిల్లలు పట్టుకునేలోపు అతని కంటి పాపలు రంగు కోల్పోయాయి. మళ్ళీ అతను కదలనే లేదు. అతని శరీరం అలాగే నిశ్చలంగా పడి ఉంది.

రచన-మార్చి 2002

నవగ్రహాల పార్లమెంటు

బెంగాలీ మూలం : రథీంద్రకుమార్ ఆచార్య

సుమారు ముప్పై రెండు సంవత్సరాల క్రితం ఓసారి ఎనిమిది గ్రహాల సమావేశం జరిగింది. ఆ సంఘటన మనలో చాలా మందికి ఇంకా గుర్తుండే వుంటుంది. ఆ సమావేశానికి శ్రీవ 1ంతి భూమి, అంటే సాక్షాత్తూ మనం నివసించే గ్రహమే కాకుండా యురేనస్, నెప్ట్యూన్, ఫ్లూటోలు కూడా హాజరయ్యారు. మిగిలిన గ్రహాలు సైతం తమ శిష్యులైన ఉపగ్రహాలతో సహా హాజరయ్యారు. అయితే ఉపస్థితులైన మొత్తం గ్రహసభ్యుల సంఖ్య భూమి తప్ప ఎనిమిది.ఆనాటి సభలో నానా రభస జరిగింది. సమావేశంలో చర్చనీయాంశం. సూర్యుడికి అతి దగ్గరగా వున్న బుధుని ఫిర్యాదు. బుధుడు సూర్యభగవానుడికి ఇలా నివేదించుకున్నాడు.

"మహాప్రభూ! మీరు మీ ఉష్ణోగ్రతని తగ్గించుకోవాలి. మీ ప్రచండ ప్రతాపానికి నా శరీరమంతా సందులేకుండా బొబ్బలెక్కుతోంది."

పాపం! బుధుడు ఆ దుర్భరమైన బాధ వల్ల చాన్నాళ్ళనుండి నిద్రకూ దూరమయ్యాడు. బుధుని ఈ ఫిర్యాదు సూర్యునికి మాత్రం ఓ పెద్ద సమస్యే కూర్చుంది. బుధగ్రహం విజ్ఞప్తిమేరకు సూర్యుడు తన వేడిమిని తగ్గిస్తే, మరి సూర్యుడికి సుదూరంగా ఉండి వేడిమిని దాదాపు పొందకుండా వున్న యురేనస్, నెప్ట్యూన్, ఫ్లూటోల గతి ఏమవుతుంది? ఇదీ సూర్యుడి విచారం.

అయితే...సౌరకుటుంబానికి మూలాధారమూ, యజమానీ అయిన సూర్యదేవుడు ప్రజాస్వామ్య దృక్పథంపట్ల ప్రబలమైన విశ్వాసం కలిగిన వాడు. అందుకని బుధుని

విన్నపం గురించి అతను వెంటనే ఓ నిర్ణయానికి రాకముందే, తన కుటుంబ సభ్యులందరితో అంటే గ్రహాలు, ఉపగ్రహాలతో ఈ విషయం చర్చించాలని ఈ మహాసభని ఏర్పాటు చేశాడు.

ఆ రకంగా ఈ సమావేశం మొదలైంది.

గ్రహాలు, ఉపగ్రహాల వివిధ రకాల మేనివర్ణాలతో, వేషధారణలతో సభ ధగ ధగ లాడుతోంది. రక్తవర్ణ సూర్యదేవుడు సభాపతి స్థానాన్ని అలంకరించాడు. సభలో పసుపుపచ్చని రంగు కలిగిన బృహస్పతీ, వెండిలా స్వచ్ఛంగా వెలిగిపోతోన్న తెల్లని శుక్రుడూ ఉన్నారు. చక్కగా సింగారించుకున్న శుక్రుని తలవెంట్రుకల్ని చూస్తే అతను ప్రేమికుని పాత్రకు బాగా సరిపోతాడనిపిస్తోంది. శనిది జీడిగింజల నలుపు. అంగారకుడు అచ్చం అంగారమే! ఎర్రగా వున్నాడు. బుధునిది పచ్చని రంగు. కేతువు పొగలా తెల్లగా వున్నాడు. వీళ్ళంతా సూర్యునికి చేరువగా వున్నవాళ్ళు కావడాన ధోవతులు, పంజాబీ డ్రెస్సులతో వదులైన దుస్తుల్లో ముస్తాబై వున్నారు. యురేనస్, నెప్ట్యూన్‌లు మాత్రం సూటు, బూటు, హ్యాట్లతో చూపరులకు ఠీవీ దర్పం కలిగివున్నట్టు ఠీకుఠాకుగా వున్నారు. వాళ్ళందరిలో ఏకైక మహిళా సభ్యురాలు మాత్రం మన భూమిగారే! ఆమె తెలుపు, ఆకుపచ్చ రంగుల చెక్స్ చీర కట్టుకుని భారీకాయుడైన బృహస్పతికి కుడివైపు కూచుని వుంది. మొదలు తలమీద కొంగువేసుకోలేదు. కాని శుక్రుడు అదేపనిగా ఆమె వైపు చూడ్డంతో అది గమనించిన భూమి సిగ్గుపడి తలనిండా కొంగుకప్పుకుని ఒద్దికగా కూచుంది.

సభాపతి సూర్యుడు ఈసారి శుక్రుడితో 'ముందు మీరు మాట్లాడండి' అన్నాడు.

శుక్రుడు లేచి 'బుధుడు మా అందరికన్నా చిన్న. పైగా పిల్లోడు. మా కళ్ళముందే చురచుర కాలిపోతున్న అతణ్ణి చూస్తుంటే మా గుండెలు అవిసిపోతున్నాయి. మీరు కూడా ఈ విషయంలో సానుభూతిని చూపగలరని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకని మీరు ఉష్ణోగ్రతని కొంత తగ్గించుకుని శాంతిస్తే ఆ అబ్బాయి బతికి బట్టకట్టగలడు. మీరు మీ వేడిని తగ్గించుకోవడంలో మాకెలాంటి అభ్యంతరమూ వుండబోదు. పైగా నేనైతే ఎంతో సంతోషిస్తాను' అని ముగించాడు. శుక్రుడి మాటలు పూర్తి కావడంతోటే వెనుక వరుసలో కూచున్న కేతువు గట్టిగా గట్టిగా చప్పట్లు చరుస్తూ తన మద్దతు తెలిపాడు. కాని మిస్టర్ యురేనస్ మాత్రం దిగ్గునలేచి ఈ సభలో

కేతువుకు చప్పట్లు కొట్టే ఎలాంటి హక్కూ లేదు. అతను మిథ్యా గ్రహం. వట్టి ప్రేతాత్మగాడు. వానికి వాస్తవమైన అస్థిత్వమే లేదు. అందుకని... అతనికి శీతోష్ణస్థితుల గురించి ఏం తెలుస్తుందని? శుక్రుడు ప్రస్తావించిన అంశంతో నేను తీవ్రంగా విభేదిస్తున్నాను. విపరీతమైన చలితో మా వెన్నెముకలు ఇప్పటికే మంచుబద్దల్లా మారిపోయాయి. పక్షవాతంతో చచ్చిపోతున్నాం. ఇప్పుడున్న ఉష్ణోగ్రతని ఇంకా తగ్గించినట్టయితే, నేను పైలోకానికి ఏకంగా బిస్తర్ కట్టుకోవాల్సిందే. నేకొక్కణ్ణే కాదు, నెప్ట్యూన్ ప్లూటోలు కూడా చలితో చస్తున్నారు. ప్లూటోకు గుండె దిగువనంతా ఎకాయెకి అచేతనంగా మారిపోయింది. ఏతావాతా అందుచేతా... వేడిమిని ఎట్టిపరిస్థితుల్లోనూ తగ్గించరాదు. పైగా మరింత పెంచాల్సిన అవసరముంది' అన్నాడు ఉద్వేగంతో. అలా వూగిపోతూ మాట్లాడిన యురేనస్ అకస్మాత్తుగా ఛెయిర్‌లో చతికిలపడి, పాకెట్లోంచి సిగరెట్టు బయటకు తీసి ముట్టించుకోబోయాడు. చంద్రుడు కలగజేసుకుంటూ 'అయ్యా! ఇది సభాస్థలం. సూర్యుడే స్వయంగా సభాపతి స్థానంలో వున్నారు. భయ్యా! నో స్మోకింగ్ ప్లీజ్' అని చిన్నగా అన్నాడు. అత్తమీది కోపం దుత్తమీద తీసినట్టు యురేనస్ చంద్రుని వైపు గుర్రుగా చూసి సిగరెట్టుని బూటుకాలితో బర్రున నలిపాడు.

యురేనస్ తీవ్ర వ్యతిరేకత వల్ల, వేడిమిని మరింతగా పెంచాల్సిన అవసరముందన్న అతని ఉల్టాడిమాండు చేత.... సమస్య ఇంకా జటిలమై పోయింది. సూర్యుడు ఈ మారు బృహస్పతిని చూస్తూ 'మీ అభిప్రాయం చెప్పండి' అనడిగాడు. బృహస్పతి బొడ్డు దాకా వేలాడుతోన్న తన గడ్డాన్ని నిమురుకుంటూ 'పిల్లవాడైన బుధుని అవస్థ చూసి నేను బాధపడుతున్నాను. నిజానికి నేనూ వేడిమి చాలక చలితో వణుకు తున్నప్పటికీ, ఈ అబ్బాయితోనే ఏకీభవిస్తున్నాను. అతను శాంతించే మార్గం చూడండి. నా కెంత కష్టంగా వున్నా ఫరవాలేదు. బుధునికి మంచి జరగాలి' అని బుద్ధులు చెప్పాడు. ఇంకా ఏదో మాట్లాడబోయాడు. విపరీతమైన జలుబు వల్ల అప్పటికే మూడుసార్లు కస్స కస్స తుమ్మిన నెప్ట్యూన్ దేవగురువైన బృహస్పతి మాటలకు అడ్డుపడి 'హారి ముసలిపీనుగా! నీ పక్షపాత బుద్ధి పోనిచ్చుకున్నావు కాదూ! నీతో మాకెలాంటి ప్రయోజనమూ లేదు. నోర్మూసుక్కూచుంటావా, లేదా?' అని బిగ్గరగా అన్నాడు. ఈ సారి అంగారకుడు తన ఎర్రని కళ్ళని మరింత ఎరుపు చేసుకుని గుడ్లురుముతూ 'మిస్టర్ నెప్ట్యూన్! మాటలు చక్కగా రానీ! నీకు కనీస పార్లమెంటరీ పద్ధతులు తెలుసా?

సభ్యతా, సభా మర్యాదలు కూడా తెలియవా ఏం? బృహస్పతి మహాశయుణ్ణి నోర్మూసుకోమనే అధికారం నీకెక్కడిది? అన్నాడు.

'వాట్? నువ్వు నాకు పార్లమెంటరీ పద్ధతులు నేర్పిస్తావా?' నెప్ట్యూన్ అరిచినంత పనిచేశాడు. సూర్యుడి ఆదేశం మేరకు ఉభయులూ శాంతించారు. వీరావేశంలో అంగారకుడు తన చొక్కా బొత్తాముల్ని విప్పిపారేశాడు. అతగాడి అసలు ఆవేశాన్నీ, ఆ వేషాన్నీ చూసిన శిష్యులు కిమ్మనకుండా కూచున్నారు. కాని వెనుక వరుసలో వున్న అంగారకుని శిష్యులిద్దరు...డాయింస్, ఫిబాస్‌లు మాత్రం, నెప్ట్యూన్ శిష్యులైన డ్రైడాన్, మేరేజ్‌లతో మళ్ళా యుద్ధానికి, మల్లయుద్ధానికి సిద్ధమయ్యారు. ఈ బీభత్స వాతావరణాన్ని చూసి భయవిహ్వలురాలైన శ్రీమతి భూమి 'బ్రతికియుండిన సుఖములు బడయవచ్చు'ననుకొని ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులంకించుకోవడానికి కుర్చీలోంచి లేచింది. అయితే సభాపతి కనుసైగతో ఆమె మరలా తన కుర్చీలో కూలబడింది.

తర్వాత అంగారకునితో సూర్యుడు 'నాకో సందేహం. మీరు నిజానికి తక్కువ వేడిమిని పొందుతున్నారు. అయినప్పటికీ బుధునిలాగే మీరు ఉష్ణోగ్రతని తగ్గించ మంటున్నారు. ఎందుచేత?' అన్నాడు. అప్పటికీ అంగారకుని కోపం చల్లారలేదు. అతను 'నేను చలికి చచ్చిపోయినా ఫరవాలేదు. బాలుడైన బుధునికీ మేలు జరిగితే చాలు. నాకు అదే పదివేలు. నిజమైన ఆనందం భోగంలో కాదు....త్యాగంలోనే అని నాకు బాగా తెలుసు. పరోపకారంలోనూ, స్వీయ ప్రత్యయత్యాగంలోనూ ఎంతో సంతోషం వుంది. యురేనస్‌లాంటి మూర్ఖులకి ఈ విషయం ముమ్మాటికి తెలియదు' అన్నాడు.

సభని శాంతింపచేసేందుకు ఈసారి శని ఓ సరికొత్త ప్రతిపాదన చేశాడు. అదేమంటే సౌరకుటుంబంలో కొన్ని రోజులు కోసమైనా బుధుడు, ఫ్లూటోలు ఈ ఇద్దరూ తమ తమ స్థానాలను పరస్పరం మార్చుకోవడం, తద్వారా సమస్యకి కొంతమేరకి పరిష్కారం లభిస్తుంది అన్నాడు. అంతే కాదు. కొన్నాళ్ళ తర్వాత గ్రహాలందరి మధ్య పరస్పరం ఇలాంటి స్థానమార్పిళ్ళకు అవకాశం వున్నట్లయితే....శీతోష్ణస్థితుల మార్పు జరిగి కొంతలో కంత ఉపశమనంగా వుంటుందన్నది అతని ఉద్దేశ్యం. శనిగారి ప్రియతమ శిష్యుడు మిథూస్ గురుదేవుల ప్రస్తావనని బలంగా సమర్థిస్తూ' బాగా చెప్పారు. చలినీ,

వేడిమినీ సమానంగా పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ లభిస్తుంది. ఇది అసలు సిసలు ప్రజాస్వామ్య లక్షణం కూడాను' అన్నాడు.

కాని శని చేసిన ఈ స్థానమార్పిడి సూచన ఎందుచేతోగాని వాళ్ళల్లో ఏ ఒక్కరికీ నచ్చలేదు. పైగా చంద్రుడు 'విపరీతమైన చలిలోంచి తక్షణం తీక్షణమైన వేడిమిలోకి వెళ్ళినా, తిరిగి మలమలమాడే ఎండలోంచి ఎముకలు కొరికే చలిలోకి వెళ్ళినా...జలుబూ దగ్గులే కాకుండా న్యూమోనియా రావడం గ్యారంటీ భయ్యా!" అన్నాడు. ఆ తర్వాత అంగారకుడు లేచి వేడిమిని మరింత పెంచాలన్న యురేనస్ ప్రతిపాదన గానీ, శనిగారి ఆశనిపాతంలాంటి కొత్త ప్రస్తావనగానీ ఇవాల్టి మన ఎజెండాలో లేవు. వీటిమీద చర్చకు అనుమతించరాదు. కనుక చర్చని మరింత కొనసాగించక బుధుని విన్నపం గురించి తక్షణం రహస్య ఓటింగ్ జరపాలన్నది నా అభిప్రాయం' అన్నాడు.

అంగారకుణ్ణి శుక్రుడు దగ్గరకు పిలుచుకుని 'నీకు జబ్బువుష్టి తప్ప పొలిటికల్ బ్రెయిన్ అసలు లేదు. బృహస్పతి ఓట్లు, అతని డజన్ మంది శిష్యుల ఓట్లు ఎటూ మనకి వస్తాయి. కాని తన మాటలవల్ల ఏ విషయమూ సరిగా విశదం కాలేదు. వాడు తన తొమ్మండుగురి శిష్యులతో సీక్రెట్ ఓటింగ్ అంటూ జరిపితే ఎవరిని సమర్థిస్తాడో తెలియదు. కారణం ఆ శనిగాడు ఇప్పటికే విపరీతమైన చలిని అనుభవిస్తున్నాడు. ఒకవేళ అతను యురేనస్ వైపు ఓటు వేశాడనుకో...మనం గెలిచే అవకాశాలు సున్న....పైగా.... ఈ రోజుల్లో మనం మన శిష్యుల ఓట్లు ఖచ్చితంగా మనకే పడతాయని ఎలా నమ్మగలం? ఇహపోతే...పాము లక్షణం గల కేతువు ఎప్పుడు ఎవణ్ణి కాటువేసి హతమార్చుతాడో ఎవరికీ తెలీదు' అని గుసగుసగా చెప్పాడు.

చర్చ ఎటూ తేలకపోవడంతో సూర్యుడు తన గొంతు సవరించుకుంటూ 'ప్రజాస్వామ్య పద్ధతిలో మీ అందరితో చర్చించాకే నేను ఈ విషయమై ఓ నిర్ణయానికి రావాలనుకున్నాను. కాని జరిగిందేమిటి? మీరంతా గుర్తుంచుకోవాల్సిన కొన్ని విషయాలున్నాయి. ప్రజాస్వామ్యం అనగానే సభల్లో బసచేసి రభస చేయడం, సమావేశాల్లో ఆవేశకావేశాలు ప్రదర్శించడం, కండకావరాన్ని చూపడం, గంటల తరబడి మైకుల్లో ప్రసంగిస్తూ మైకాసురులు కావడం, మైకుల్ని విరగ్గొట్టడం, పోడియం వైపు దూసుకురావడం...ఇవేనా? ఇవాళ కొందరు మగరాయుళ్ళైన గ్రహరాయుళ్ళు

మా ముందేసిగరెట్లకూ, సిగపట్లకూ సిద్ధమయ్యారు. ఈనాటి సంఘటవలపట్ల నేనెంతో కలత చెందుతున్నాను. భవిష్యత్తులో ఇంక ఏది జరిగినా నేను బాధ్యుణ్ణి కాను. బాగా ఆలోచించండి. మీ అందరి మధ్య ఏకాభిప్రాయం కుదిరిందా సరి. లేదంటే వెంటనే వేడిమిని విపరీతంగా పెంచనైనా పెంచుతాను. లేక తగ్గించి పారేస్తాను. అది నా ఇష్టం. నేనెంతగా తాపాన్ని పెంచి నా ప్రతాపాన్ని చూపగలనంటే...సుదూరంగా వున్న యురేనస్ లాంటి గ్రహాలు సైతం నా ఆగ్రహానికి మాడిమసైపోవాల్సిందే! మళ్ళీ ఎంతగా తగ్గించగలనంటే...ఇందాకా బొబ్బలెక్కివున్న బుధుడు ఎకాయెకి చలికి గడ్డకట్టి బిర్రబిగిసి చావాల్సిందే. మీ ఇష్టం. నిర్ణయించుకోండి మరి!' అన్నాడు. సభాధ్యక్షుడైన సూర్యుడిచ్చిన ఈ 'ధమ్కీ' వల్ల గ్రహాలందరూ గజగజలాడిపోయారు. ఈ ఒక్క బెదిరింపు అస్త్రం గ్రహాల ప్రవర్తనల్లో చెప్పుకోదగ్గ పరివర్తన కలిగించింది. అందాకా బద్ధవిరోధులైన బృహస్పతీ, నెప్ట్యూన్‌లిద్దరూ మాటలు కలుపుకోవడం శ్రీమతి భూమి గమనించింది. తమలో తాము తగాదాలు పెట్టుకుని నష్టపోవడం కన్న హాయిగా కలిసిమెలిసి సహజీవనం చేయడం మంచిది కదా! అటు యురేనస్‌గారు అంగారకుణ్ణి సమీపించి 'అచ్ఛా! నువ్వింత ఎర్రగా బుర్రగా వుంటానికి ఏం కారణం భాయిసాబ్? వదినగారి బొట్టంతా ఒంటికి దట్టంగా పట్టించుకున్నావా ఏం?' అంటూ తమాషా చేశాడు. అతి సీరియస్‌గా వున్న వాతావరణం క్షణాల్లో నవ్వుతూ కేరింతలమయమైంది. సూర్యుడి విన్నపం మేరకు శ్రీమతి భూమి నాలుగు మాటలు మాట్లాడ్డానికి లేచింది. అంతే సభాసదుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

'నాది మాతృహృదయం. అది కోమలత్వానికీ, మమకారాలకూ ఆలయం. అందుచేతే నేను బుధుడు మొదలు కొని ఫ్లూటో దాకా అందరి బాధలూ అర్థం చేసికోగలను. సూర్యుడి హితోక్తులు, హుంకరింపులూ మీరంతా వినే వున్నారు. అతని మాటల్లో సృష్టి వినాశనానికి సంబంధించిన చురకలాంటి హెచ్చరిక వుంది. అయినా చావు గురించి నేనేనాడూ భయపడలేదు. కాని నేను తల్లిని కదా! నాగుండెలమీద కోట్లాది ప్రాణులు నివసిస్తున్నాయి. వాళ్లంతా నా సంతానం. మీరు వాళ్ళకి మేనమామలు. మీరెలాగూ గొడ్డుపోతులు. అయినప్పటికీ నా పిల్లలకి మీరే మేనమామలు కనుక వాళ్ళ బాగోగులు మావి. నా పిల్లలు అంతరిక్షయానం ఆరంభించి చాన్నాళ్ళైంది. మానవులు మహాద్భుతాలు సాధిస్తున్నారు. రేపో మాపో ఫ్లూటో మామగారి దగ్గరికి

కూడా వెళ్ళి వస్తారేమో! మీరు అసువులు బాస్తే అంత్యక్రియల భారం వాళ్ళదే. కనుక కేవలం నా పిల్లల బతుకుల కోసమే కాదు. మీ క్షేమం కోసం కూడా వాళ్ళు సజీవంగా వుండాల్సిందే మరి. బుధుడు చెప్పినట్టుగా సూర్యుడు తన ప్రతాపాన్ని తగ్గించినా, యురేనస్ కోరినట్టుగా పెంచినా నా పిల్లలు తల్లడిల్లి తల్లడం మల్లడం అవుతారు. భూతలం అతలాకుతలమవుతుంది. అందుకని ఈ విషయాలన్నింటిని దృష్టిలో వుంచుకుని నేను సూర్యదేవుణ్ణి కోరేదేమంటే మునుపటిలానే 'యథాతథ పరిస్థితుల్ని కొనసాగించమని' అంది.

శ్రీమతి భూమిగారి ఈ ప్రతిపాదనను గ్రహాలంతా చప్పట్ల మోతతోనూ, సంతోషాతిరేకంతోనూ సమర్థించారు. సమస్య ఓ కొలిక్కి వచ్చి సూర్యుడు సైతం హాయిగా గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు.

భూమి మళ్ళీ ఇలా కొనసాగించింది. 'అధ్యక్షా! బొబ్బలెక్కిపోతోన్న బుధుడి కోసం నేను నా పిల్లలైనా మానవులు తయారుచేసిన ఓ దివ్యమైన ఆయింటుమెంటునిస్తాను. యురేనస్, ఫ్లూటో మొదలైన అన్నయ్యల కోసం ఒక తైలం పంపిస్తాను. దాన్ని చక్కగా మసాజ్ చేసుకుంటే రెండ్రోజుల్లో వాళ్ళ పెరాల్సిస్ మటుమాయమైపోతుంది. అంతేకాకుండా...బుధన్నయ్యకి నా ఫోల్డింగ్ గొడుగు ప్రెజెంట్‌చేస్తాను. అది చాలా వరకు సూర్యప్రతాపాన్ని అడ్డుకుంటుంది.'

ఈ ఊరడింపు మాటలు విన్న బుధుని ఆనందానికి, ఫ్లూటో సంతోషానికి హద్దులు లేవు. ఫోల్డింగ్ గొడుగు ముచ్చట విన్న బుధుడు ఆనందాతిశయంతో చెంగడ బింగడ దుంకసాగాడు. ఇంకా పిల్లవాడే కదా!

చివరికి శ్రీమతి భూమి 'నేను మీ అందరినీ కోరేదేమంటే...మీరు మీ దేహాల్ని కాదు చూసుకోవాల్సింది, ఆత్మల్ని చూడమని...అప్పుడు...ఎలాంటి కష్టమైనా ఈ దేహం భరించగలుగుతుంది. శరీరం ఎలాగూ నశిస్తుంది. అయితే గీతలో చెప్పినట్టు..ఆత్మకు హానిలేదు కదా! అందుకే...మరందుకే...కోట్లాది ప్రాణుల సంక్షేమం కోసం మీరు ఈ వినశ్వరమైన శరీర సుఖాల్ని విసర్జించి అమరత్వం పొందండి' అంది.

–ఆంధ్రజ్యోతి వారపత్రిక 17-4-1998

అమరవీరుడు

—హిందీ మూలం : దిబేన్

అక్కడ చాలామంది గుమికూడారు. ప్రభుత్వాధికారులు సఫారీ డ్రెస్సుల్లో వున్నారు. గంజితోనూ, ఇస్త్రీతోనూ 'కడక్'మంటున్న తెల్లని దుస్తుల్లో రాజకీయ నాయకులు వెలిగిపోతున్నారు. అతని ఇంటి ముందు ఎర్రని లైట్లతో తెలుపు రంగు కార్లు బారులు తీరివున్నాయి.

జనసందోహం అతణ్ణి చుట్టుముట్టింది. అతనికి అంతా వింతగా వుంది. జనం అతనితో "మీ కొడుకు దేవుని దగ్గరకు వెళ్ళాడు. అమరవీరుడు నక్షత్రాల్లో నక్షత్రంగా మారిపోయాడు. అతనికతనే సాటి. వీరుడు దైవంతో సమానం...వీరునికి మరణంలేదు" అంటున్నారు. అలా మాట్లాడేవాళ్ళతో ఎలా సమాధానం చెప్పాలో, ఏ రకంగా మాట్లాడాలో అతనికేమీ తోచడంలేదు. తన కొడుకు శవపేటికలో బంధించబడి ఇంటి ముంగిట్లో పడివున్నాడు. సైనికులు ఆ స్థలాన్ని దిగ్బంధనం చేశారు. శవంతోపాటు వచ్చిన ఓ సైనికాధికారి పత్రికల వాళ్ళతో 'హి వాజ్ రియల్లీ ఎ బ్రేవ్ బాయ్' అంటున్నాడు.

ఆ మాటలు విని అతని రొమ్ము గర్వంతో మరింత విశాలమైంది. తన కొడుకు అతి సాహసవీరుడు. కదనరంగంలో కొదమసింగం. వాడికి సాహసం ఉన్న మాట నిజమే.

చిన్నప్పటినుంచీ తన కొడుకు ప్రతి పనిలోనూ తెగువ చూపించాలని మహా ఉబలాటపడేవాడు. ఓ రోజు...వీధిలో ఎదురుపడ్డ వాళ్ళనల్లా కొమ్ములతో కుమ్ముతూ నానా యాగీ చేస్తోన్న పోట్లగిత్త తోకను దొరకబుచ్చుకుని పరుగులు తీయించాడు. ఆ తర్వాత దాని మూపుమీద ఎక్కి చెవులు మెలేశాడు. అది రొప్పుతూ రోజుతూ నేల మీద కూలబడిపోయింది. ఈ విషయం అతనికి తెలిసి 'ఒకవేళ నీకేమైనా అవుతే ఎలా వుండేదిరా?" అంటూ కొడుకుని మందలించాడు.

ఈ సంఘటన జరిగాక అతను లోపల్లోపల వాడు ఏ సాహసకృత్యం చేసి ప్రాణమ్మీదికి తెచ్చుకుంటాడో అని భయపడుతున్నాడు. వాడు తన ఏకైక సంతానం. ఆ వీధిలోని వాళ్ళు "మనవాడు మాంఛి బహద్దూర్. పోట్లగిత్త ఆటపట్టించాడు చూశారుకదా!" అన్నారు.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు. ఆ రోజు కూడా వీధి జనాలు ఇంటి దగ్గర ఇలాగే పోగయ్యారు. తన కొడుకు సహపాఠి అయిన అమ్మాయి అల్కా" అంకుల్! భలే తమాషా జరిగిపోయింది. మీరేమీ అడక్కండి. మీ అబ్బాయి దాని పొగరు అణిచిపారేశాడు" అంది.

అతడు అప్పుడేమి అనలేదుగాని రాత్రి భోజనాలవేళ "నువ్వు ఆ ఎద్దుతో తలపడ్డావు. ఒకవేళ నీకేమైనా అవుతే ఎలా వుండేదిరా?" అన్నాడు.

"అయితే ఏంనాన్నా? ఏమీ కాదులే. నేను మీ కొడుకుని కదా నాన్నా! పులిబిడ్డ పులిబిడ్డే! నిజమేకదూ?"

అతనికి వాడు మాటలతో 'మస్కా' కొడుతున్నాడని తెలుసు. కొడుకు ముఖ కవళికల్ని మౌనంగా పరిశీలించసాగాడు.

కొడుకు సీనియర్ సెకండరీ పరీక్షల కోసం చదువుతున్నాడు. చదువులో చాలా చురుకైనవాడు.

"నాన్నా! ఇవాళ మీరు విస్కీ తీసుకోనట్లుంది. భోజనాలకేం తొందర్లేదు. మరో ఇరవై నిముషాల తర్వాత చేద్దాం. ముందు కాస్త ముందు తీసుకోండి. అరే కాస్త ఎంజాయ్ చేయండి నాన్నా!"

• • •

ఇదంతా గుర్తుకొచ్చి అతని కళ్ళు సజలాలయ్యాయి. అందరి కళ్ళూ అతనిపైనే వున్నాయి. అతడు కాస్త తేరుకుని లేచి బాత్రూములోకి వెళ్ళాడు. అరచేతుల్లో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. నవ యువకుడైన తన కొడుకు శవపేటికలో బంధించబడి

వాకిట్లో పడివున్నాడు. చచ్చిన తన కొడుకు గురించి ఆత్మీయంగా రెండు కన్నీటిబొట్లు రాల్చలేక పోతున్నాడు. శవపేటికలోని మృతశరీరాన్ని హృదయానికి హత్తుకొని గుండె తేలికపడేదాకా ఏడవాలనుకున్నాడు. అంతమందిలో అది సాధ్యంకావడం లేదు. వాళ్ళంతా "మీ కొడుకు దేవుని దగ్గరకు వెళ్ళాడు. వీరుడు దైవంతో సమానం. నక్షత్రాల్లో నక్షత్రంగా మారాడు" అంటున్నారు. మోకాళ్ళ మధ్య తల దూర్చి మళ్ళీమళ్ళీ రోదించాడు. ఎవరో తలుపు తట్టినట్లనిపించింది. అతను తక్షణం లేచి వాష్‌బేసిన్‌ను సమీపించి ముఖం కడుక్కున్నాడు. కళ్ళమీద నీళ్ళు చల్లుకున్నాడు. తన్నుతాను సంభాళించుకుంటూ కళ్ళు తుడుచుకుని బయటికొచ్చాడు.

ఓ పొరుగింటి పిల్లవాడు తలుపు తడుతున్నాడు. వాడు "అంకుల్! అందరూ మీ గురించి ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా వచ్చారు" అన్నాడు.

అతడు మళ్ళీ వాకిట్లోకి వచ్చాడు. తళతళా మెరిసిపోతున్న తెల్లని దుస్తుల్లో వున్న ముఖ్యమంత్రిగారికి శర్మగారొచ్చారని ఎవరో చెప్పారు. ముఖ్యమంత్రి చుట్టూ నల్లని దుస్తుల్లో కమెండోలు నించుని వున్నారు. అతడు ముఖ్యమంత్రికి చేతులు జోడించి నమస్కరించాడు.

"శర్మాజీ! ఇవాళ దేశం యావత్తూ మిమ్మల్ని చూసి గర్వపడుతోంది. ప్రాణాలను పణంగా పెట్టి కడదాకా వీరోచితంగా పోరాడిన మీ అబ్బాయి వెనక దేశమంతా నిలబడి వుంది. శత్రువు తోక జాడిస్తున్నాడు. మీ కొడుకంటే నాకు గర్వంగానూ, గౌరవంగానూ వుంది".

అతడు మౌనంగా నిలబడి ముఖ్యమంత్రి ముఖాన్ని పరిశీలించసాగాడు. అతడు ఇప్పటిదాకా తన భార్య సంగతే మరచిపోయాడు. ఆమె ఎక్కడుంది, ఎలా వుందని కూడా ఆలోచించలేదు. వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళి "ఎలా రాసిపెట్టివుంటే, అలా జరుగుతుంది. అంతా దైవేచ్ఛ" అని ఓదార్చాలనుకున్నాడు. ఏది ఏమైనా తమ కొడుకు స్వార్థపరుడు. తన సాహసోపేత కార్యాలతో యావద్దేశాన్ని పులకింపచేసి తల్లిదండ్రుల్ని మాత్రం అర్థాంతరంగా వదిలి వెళ్ళాడు. ఇదీ దైవేచ్ఛేనేమో! నిజానికి వాడు ఆ పొట్లగిత్త వ్యవహారం రోజునే అయిపోయాడనుకున్నాం.

* * *

"ఏం ఆలోచిస్తున్నారు? తీసుకోండి! టీ తాగండి" భార్య అతని భుజాలు కదుపుతూ

కప్పు అతని ముందు పెట్టింది. వాస్తవానికి అతడిప్పటిదాకా ఒకనెల కిందట జరిగిన సంఘటనల్లో కూరుకొని వున్నాడు. భార్య కళ్ళల్లోకి చాలాదూరం చూశాడు. అవి ఖాళీగా వున్నాయి. శూన్యంగా, నిర్వికారంగా వున్నాయి. అతడు టీకప్పు చేతిలోకి తీసుకున్నాడు. ఆమె "ఏమాలోచిస్తున్నారు? నాకేమీ అర్థం కావడంలేదు" అంది. అతడు దీర్ఘంగా నిట్టూర్చి టీ కప్పును బల్లమీద వుంచాడు.

* * *

"ఏమాలోచిస్తున్నారు నాన్నా? మీరెక్కువగా ఆలోచించకండి. సంతోషంగా వుండండి. మిమ్మల్ని ఎప్పుడో ఓరోజు ఆఫీసర్స్ మెస్‌కు తీసికెళ్ళి విస్కీ తాగిస్తాను" అన్న కొడుకు మాటలు గుర్తుకొచ్చాయి.

"నాన్నా! నాకు ఎన్.డి.ఏ.లో సెలెక్షన్ వచ్చింది. ఇదుగో ఎంప్లాయిమెంట్ న్యూస్. రిజల్ట్స్ వచ్చాయి" అన్నాడు అతని మెడలకు వేలాడుతూ.

అతడు ఈ విషయం విని భయకంపితుడయ్యాడు. ఆ తర్వాత మూడేళ్ళకి భార్యతో కలిసి డెహ్రాడూన్ వెళ్ళి తన కొడుకు పాసింగ్ అవుట్ పేరేడ్‌లో పాల్గొనడం చూశాడు. ఎంతగానో సంతోషించాడు. తల్లిదండ్రులకు అంతకన్న కావల్సిందేముందని ఆనంద డోలికల్లో వూగిపోయాడు. ఇప్పుడతను ఓ సైనికాధికారికి తండ్రి.

అతడలా డెహ్రాడూన్ నుండి ఇంటికి తిరిగొచ్చాడో లేదో సరిహద్దుల్లో యుద్ధం మొదలైంది. మరికొన్నాళ్ళకు..వీరుడైన తన కుమారుడు కున్వర్ కోమలేంద్ర సింగ్ రక్తసిక్త శరీరాన్ని కొంతమంది సైనికులు మోసుకొని ఇంటికి తీసుకొచ్చారు.

ఆఫీసర్స్ మెస్‌కు తీసుకెళ్ళి తనకు విస్కీ తాగిస్తానని వాగ్దానం చేసిన తన కొడుకు ఇలా ఏకాయెకి తమను నట్టనడి ఏటి పట్టులో వదిలిపోతాడని కలలో కూడా అనుకోలేదు.

అతడు సొరుగులోంచి యుద్ధరంగం నుండి కొడుకు రాసిన వుత్తరం తీసి చదవసాగాడు.

రాజ్‌పుతానా రైఫిల్స్-రెండు

పన్నెండు జులై తొంభైతొమ్మిది

"మైడియర్ నాన్నా!

బావున్నారా? నాగురించి బెంగపెట్టుకోలేదుకదా! ప్లీజ్ నాన్నా! పులిబిడ్డ పులి బిడ్డే!

లక్ష్యాన్ని ఛేదించే దిశలో ముందుకు సాగుతున్నాం. మా యూనిట్‌ను పొగడుతూ చీఫ్ ఆఫ్ ఆర్మీ యూనిట్ ఓ అప్రిసియేషన్ లెటర్ పంపింది. ఇట్స్ ఎ గ్రేట్ హానర్ నాన్నా! మీక్కూడా కృతజ్ఞతలు. మీరు నన్నాశీర్వదించాలి. మా యూనిట్‌కు లభించిన ప్రశంస చాలా అరుదైంది. దేశంకోసం యుద్ధరంగంలోకి వురకడం, సన్మానాలు పొందడం గర్వించదగ్గవి. మీకూ గర్వకారణం".

కొడుకు రాసిన మొదటి వుత్తరం తీశాడు. అందులో "నాన్నా! ఈ పాలక వర్గాలు దేశాన్ని యుద్ధంవైపు నెట్టుతున్నాయనిపిస్తోంది. విచారించకండి. యుద్ధమంటూ జరిగితే మేమే గెలుస్తాం. వీడు పులి బిడ్డ" అని రాసి వుంది.

"నేను మీకు టీ ఇచ్చి వెళ్ళాను. తాగారా, లేదా?" అన్న భార్య పిలుపు మళ్ళీ విన్పించింది.

"టీ చల్లబడిపోయింది" సిప్ చేస్తూ అన్యమనస్కంగా అన్నాడు. ఆమె కాసేపు అతనివద్ద నుంచుని "రోజంతా అలా ఫోటో ముందు కూచుని ఆలోచిస్తే వాడు తిరిగొస్తాడా?" అనబోయిందిగాని ఆమె కంఠం రుద్ధమై మాటలు రాలేదు.

అతడు భార్యవైపు తలెత్తి చూసే సాహసం చేయలేకపోయాడు. గొణిగినట్లుగా "కాదు, అదేంకాదు. కానీ వాడు ఆ మిలిటరీ యూనిఫామ్‌లో దిగిన ఫోటోను చూస్తుంటే వాడెక్కడికీ వెళ్లలేదనిపిస్తోంది. వాడిక్కడే తచ్చాడుతూ మనతో ముచ్చటిస్తున్నటుగా వుంది..."ఇంక మాట్లాడలేకపోయాడు. దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. భార్య కూడా ఏమీ మాట్లాడలేదు. ఆమె చల్లారిపోయిన టీ కప్పును తీసుకొని వేడిచేసేందుకు వెళ్ళిపోయింది.

ఇంతకుముందెప్పుడూ ఆమె చల్లబడిపోయిన టీని వేడిచేసి ఎరగదు. ఆ టీని వాష్‌బేసిన్‌లో పారబోసి మళ్ళీ తాజాగా టీ పెట్టి ఇచ్చేది! ఈసారి ఎందుకో అలా చేయలేకపోయింది. మాటిమాటికీ టీ కాచి ఇచ్చే శక్తి తనలో లోపిస్తున్నట్లు అన్పించిందామెకు.

అతడేమో తన చదువులో లీనమవుతాడు. ఆమె టేబుల్ మీద టీ పెట్టి వంటింట్లోకి వెళ్ళిపోతుంది. అతడు చదువులో పడిపోయి టీ తాగడం మరిచి పోతాడు.

అతడు కొడుకు రాసిన మరో ఉత్తరం తీశాడు. అది వాడు ట్రైయినింగ్ చేస్తున్నప్పటి వుత్తరం.

"......ఇట్స్ ఎ గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ నాన్నా! అరబ్బు జాతి మేలు గుర్రాన్ని "సూపర్‌ఫాస్ట్" వేగంతో దౌడు తీయిస్తున్నట్లు ఇక్కడ ఒక్కక్షణం కూడా తీరికుండదు. తెల్లారి లేవడం తరువాయి పరుగు. ఐదున్నరకు బెడ్ టీ. మరో పావుగంటకు డ్రిల్. పీటీ. తర్వాత రోజు రోజంతా ఒకదాని తర్వాత మరొక పని. రాత్రి పదింటికి లైట్లు ఆర్పుతారు. మీకు ఉత్తరాలు కూడా చాలాసార్లు వెన్నెల్లో కూచుని రాయాల్సి వచ్చేది. గత శుక్రవారం నాడు క్రాస్ కంట్రీరేస్ జరిగింది. నేనందరి కన్నముందు పరుగెత్తాను. చాలా హాయిగా పరుగెత్తాను. చివరి నిముషంలో మాధవన్ అనేవాడు వేగం పెంచి నన్ను దాటిపోయాడు. ఆఖరు పాయింటు చేరుకుని స్పృహతప్పి పడి పోయాడు. ఆ క్రితం రోజు అతనికి జ్వరమట! రాత్రంతా జ్వరంతో తల్లడిల్లుతూనే పొద్దుట పరుగుకు సిద్ధమయ్యాడు. గెలిచాడు. నేను కాస్త వేగం పెంచి వున్నట్లయితే ఫస్ట్ వచ్చేవాణ్ణి! మాధవన్ అమీతుమీ తేల్చుకోవాలని పరుగెత్తినట్లున్నాడు. నేనెందుకు 'కిల్లింగ్ ఇన్‌స్టింక్ట్' చూపి గెలవలేకపోయానా అని బాధగా వుంది. అయామ్ సారీ! ఇక ముందు అలా జరగదు. మీ బిడ్డ ఇకముందు రెండోస్థానంలో వుండడుగాక వుండడు".

❀ ❀ ❀

మళ్ళీ అతని ఆలోచనలు నెలకిందట, తన ఇంటి ముందు గుమికూడిన జనమ్మీదికి మరలాయి.

"మా సాహెబ్ చాలా సాహసవంతుడు సార్" కొడుకు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన ఇటాలియన్‌లోని జూనియర్ ఆఫీసర్ అంటున్నాడు.

"మా అందరికన్నా ముందుండేవాడు. అందరికన్న ముందు దాడిచేసేవాడు. శత్రుపటాలం మా ప్లటూన్ ఎల్.ఎమ్.జీ.ని టార్గెట్‌గా పెట్టుకునేలోపు మీవాడు అది గమనించి కొదమసింగంలా లంఘించాడు. వాళ్ళని మట్టి కరిపించాడు. అంతేకాదు మమ్మల్నందరినీ కాపాడాడు. కానీ చనిపోయాడు. విజయం మనదైంది. మేమతని స్వప్నాన్ని నిజం చేశాం. అతను కడశ్వాస వదలేదాకా పర్వతాగ్రం మీద త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించి ఉంచాం. అతడు మన జెండా రెపరెపలాడ్డం చూసి హాయిగా కళ్ళుమూశాడు".

❀ ❀ ❀

భార్య మళ్ళీ బల్లమీద టీ పెట్టింది. అతనికి కొడుకుతోపాటు చదివిన అమ్మాయి

అల్కా గుర్తుకొచ్చింది. ఆమె తన కొడుక్కి సహపాఠి మాత్రమేకాదు. మంచి స్నేహితురాలు. అంతేకాదు తన కొడుకు లెఫ్టినెంటు కున్వర్ కోమలేంద్ర సింగ్‌తో వివాహ నిశ్చితార్థం జరిగిపోయిస పిల్ల. అవును... అతను స్వయానా తన కొడుక్కోసం పిల్లల్ని చూస్తున్నాననే వాడు. కొడుకు పెళ్ళి అల్కాతోనే జరపాలనుకున్నాడు. ఈసారి సెలవులకని రాగానే వాణ్ణి ఓ యింటివాణ్ణి చేయాలనుకున్నాడు.

అల్కా శవపేటికను తన బాహువుల్లోకి తీసుకోవాలని చూస్తోంది. వలవలా దుఃఖిస్తోంది. కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. సైనికులు ఆమెకు ఊరట చెబుతున్నారు. శవపేటిక నుండి ఆమెను దూరం తీసుకుపోవడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు.

అతడు దూరంగా నించుని ఈ తతంగమంతా చూస్తున్నాడు. బొటబొట కన్నీరు విడుస్తున్నాడు.

ముఖ్యమంత్రి అల్కా తలమీద చేతులువేసి "బిడ్డా! నువ్వు సౌభాగ్యవతివి. దేశరక్షణ కోసం పోరాడి అసువుల బాసిన వీరుడు నీకు వరుడు" అన్నాడు.

"మరి... మీరెందుకు మీ బిడ్డల్ని దేశం కోసం సరిహద్దుల మీదికి పంపించరు? మీ కొడుకులెందుకు గుండెనెత్తురులు తర్పణ చేయరు? మీ సంతానం దేశరక్షణ కోసం ఆత్మబలిదానం చెయ్యవలసిన అవసరంలేదా? మీ పిల్లలు అమరవీరులు కానక్కరలేదూ.." అంటున్న అల్కా ముఖ్యమంత్రి కాలర్‌ను వీరకాళిలాగా పట్టుకుని గట్టిగా అరుస్తూ స్పృహతప్పి పడిపోయింది.

అతని కళ్ళల్లోంచి జలజలా అశ్రువులు రాలాయి. బల్లమీద పెట్టిన టీ మళ్ళీ చల్లబడుతోంది.

-వార్త (ఆదివారం) 5 మార్చి 2000

బురఖా

కన్నడ మూలం : ఫకీర్ ముహమ్మద్ కట్పాడి

కూతురి యింటికి వచ్చి అప్పటికే నాల్గు రోజులు గడిచాయి. చేయడానికి పని ఏమీ లేక చేతులు తిమ్మిరెక్కినట్టు అనిపిస్తోంది. ఊళ్ళో అయితే కొబ్బరి చెట్ల మట్టల్ని కొట్టి బుట్టలు అల్లాల్సిన పని వుండేది. పశువుల పాకలో పని. మేకలకి ఆకులు వేసే పని. ఒకటా, రెండా? ఎంత చేసినా పూర్తికాని పనులు. కానీ యిక్కడ ఏ పని చేయబోయినా కూతురు సల్మా అంగీకరించదు.

"వద్దు. విడిచిపెట్టమ్మా! ఊళ్ళో అదీ యిదీ అంటూ చేస్తావ్! ఇక్కడైనా కొన్ని రోజులు విశ్రాంతిగా కూచోరాదు?" అంటుంది. వంటింటిలోనైనా సాయం చేద్దామంటే యిక్కడ పొయ్యి కానే కాదాయె! అన్నింటికి స్టావ్వే గతి. ఊళ్ళో అప్పి "ఈ స్టౌ వుంది చూశారూ! అది పగిలిపోయి, మొన్న యిద్దరు కలాస్ అయ్యారట. హోటల్ భట్టర్ చెప్పారు. పేపర్లోనూ వచ్చిందట!" అంది. అప్పుడు పట్టణంలో వుంటోన్న తన కూతురు గుర్తుకొచ్చి భయపడింది. కొడుకు తమ యింటికి కిరోసిన్ స్టావ్ తెస్తాను అంటున్నపుడల్లా 'వద్దే వద్దు. మనకు పొయ్యే చాలు" అనేది. ఇంతకీ ఈ చిన్న మంటతో వంట ఎలా చేస్తారంటూ కూతురిని ప్రశ్నించింది. ఆమె నవ్వుతూ "అమ్మకి ఊళ్ళో పొయ్యినిండా మాంచి పిడకలు. భగభగ మండే మంటలతో వంట చేయడమే తెలుసు. ఆ మంటకన్న యిది చిన్నదే! కానీ..పది నిముషాల్లో అన్నం ఉడుకుతుంది" అంది. "ఏమయినా చెప్పు. మాకైతే ఈ స్టావ్ అంటేనే భయం" అంది.

ఊళ్ళోలాగా బూడిద పెట్టి దినమంతా తోమినా పోనట్టు, మసి నిండిన పాత్రలు వేసుకొని పొద్దుటినించి తోమే పనినించి కూతురు విముక్తురాలైందని జైనాబికి సంతోషమే! పాత్రలకి ఏమాత్రం మసి కాకుండా కూతురు వంట చేయడం నేర్చుకుందని ఊళ్ళో అప్పి, అక్కమ్మ మొదలైన స్నేహితురాళ్ళకి చెప్పాలనిపించింది. కూతురు పట్టణ వాతావరణానికి ఎంత త్వరగా సర్దుకుందని గుర్తుకొచ్చి గర్వపడసాగింది. కాని పట్టణంలో ఎంత నాజూకు తనమున్నా, పల్లెల్లోని ప్రశాంతి కరువైపోయిందని యిక్కడికి వచ్చిన మరునాడే గ్రహించింది. ఆమె వచ్చిన మరుసటి రోజే అక్కడ కొట్లాటలు ప్రారంభమయ్యాయి. "ఇక్కడ తన్నుకున్నారు. అక్కడ నిప్పుబెట్టారు, మరో చోట దుకాణం లూటీ చేశారు" అంటూ భయకంపితుల్ని చేసే వార్తల పరంపర. కూతురు, అల్లుళ్ళకి చెప్పి ఊరికి తిరుగుముఖం పడదామంటే "ఇప్పుడు పోవడమా? ఇక్కడంతా గలాటా మొదలైంది. ఓ పదిరోజులు మీరిక్కడే వుండి, గలాటా ఆగిపోయాక వెళ్ళండి" అని అల్లుడన్నాడు.

కూతురిని చూసి వద్దామనీ, ఒకటి రెండు రోజులయ్యాక తిరిగి వెళ్ళవచ్చుననుకొనీ మంగళూరు వచ్చిన జైనాబి ఊరికి తిరిగిపోలేక పోయింది. "ఈ పాడు కొట్లాటలతో ఊరికి పోలేకపోయాను" అంటూ అప్పుడప్పుడు తనలో తనే గొణుక్కొంది. ఊళ్ళో మేకలకి వగలమారి కోడలు సరిగా ఆకులూ, అలమూ వేస్తోందో లేదో? పొట్టతో వున్న మేకకి కుడితీ, గంజీ సమయానికి పోస్తోందో లేదో? పెట్టల వెంట తిరిగే పెద్ద పుంజు గూటికి తిరిగొచ్చిందో లేదో? గుడ్లని పొదుగుతోన్న పెట్టకి సరిగా నీళ్ళూ, గింజలూ యిస్తోందా? మరో రెండు రోజుల్లో కోడి పిల్లలు బయటికొస్తాయి. చిన్న చిన్న నూకలు తయారు చేసి వచ్చాను. కోడలు వాటిని వేసి కోడిపిల్లల్ని సరిగా చూసుకుంటుందా? లేక గద్దలు తన్నుకు పోయేలా విడిచి పెడుతుందా? పక్కింటి ఆడవాళ్ళతో పిచ్చాపాటికి దిగిందంటే వంటింట్లోకి కుక్క జొరబడింది కూడా గమనించని ఘనాపాఠి. ఇలాంటి నిర్లక్ష్యపు కోడలికి తన యింటి బాధ్యత లప్పగించి వచ్చి యిక్కడ చిక్కుకొన్నాను కదా! కొడుకైనా సాయంత్రం యింటికి వచ్చి యివన్నీ చూసుకుంటాడో, లేదో?–అనుకుంటూ కూచొని వున్న ఆమె "ఏమయినా కానీ! రేపు నేను ఊరికి వెళ్ళక తప్పదు" అంది. "యా అల్లా! మీరిలా మొండికేస్తే ఎలా? ఇక్కడ ముస్లిముల వీధి కావడంతో మీకేమీ భయం లేదు. తర్వాత దీన్ని దాటితే వచ్చేది వాళ్ళ వీధే కదా!

బురఖా వేసుకున్న మీరు వాళ్ళ వీధి దాటి బస్ స్టాండ్‌కి ఎలా పోగలరు? ఎంతమంది ముస్లిమ్‌లను వాళ్ళు చంపారో తెలుసా మీకు" అంది కూతురు గాభరాగా.

ఆమె నాలాంటి ముసలిని చంపితే వాళ్ళకేమీ లాభం అనుకుంది. "నిన్న కుళ్ళిపోయి, మురిగికంపు వాసన కొడుతోన్న రెండు శవాల్ని కాలువనించి తీశారట పోలీసులు. అదీ బస్ స్టాండ్ పక్కనే! ఎవరో? ఎక్కడికి వెళ్ళాలని బయల్దేరిన వాళ్ళో?" అంది సల్మా మరదలు ఖదీజా. ఆమె అప్పటికే కాలేజీకి వెళ్ళక మూడు రోజులయ్యాయి. ఇంట్లో వున్నా పట్టణంలో జరిగే ప్రతి సంగతీ ఆమెకి ఎలాగో తెలుస్తోంది. ఒక్కో విషయాన్ని చెబుతుండగానే, ఆమె కళ్ళు చెరువులవుతున్నాయి.

ఈ గలాటాకి మూలకారణం... సాయంకాలం పూట ఐస్ క్రీం తింటూ వీధి పక్కన నించున్న ఓ ముస్లిమ్ పిల్లవాడి తలమీది టోపీని పారేసి ఓ తాగుబోతు గేలి చేశాట్ట! ఇది ముస్లిమ్‌లకు హిందువు చేసిన అవమానమని భావించి, నల్గురు ముస్లిమ్‌లు వాణ్ణి చితక తన్నారట! ఈ వార్త హిందువుల వీధికి నిప్పులా పాకింది. ఇంకేం? అప్పటికే గొడవలు జరిగి నల్గురు ఆహుతయ్యారు.

వార్తలు వింటూ యింటిలోపలే కూచోవడంలో నెమ్మది లేదు జైనాబికి. ఏ పనీ లేదు. అందుకని తన నల్లని సిల్కు బురఖాని కుట్టే తీర్మానానికి వచ్చింది. ట్రంకులో దాన్ని మడిచి పెట్టి చాలా సంవత్సరాలు గడిచినందువల్ల బొద్దింకలు కొట్టి అక్కడక్కడ రంధ్రాలు పడ్డాయి. ఆమె తనయింటి నించి బయటికి వెళ్ళడమే తక్కువ. అలా ఎప్పుడైనా వెళ్ళితే పెద్ద కూతురి యింటికి మాత్రమే! ఆమె యిల్లు పక్కనే వుంది. అక్కడికి వెళ్ళడానికి బురఖా అవసరం లేదు. ఎక్కడైనా బంధువుల యింటిలో పెళ్ళీ, మౌలూదూ జరిగితే... కొడుకుని గానీ, కోడలిని గానీ పంపించి తాను ఏదో మిష చెప్పి తప్పించుకొనేది. అందుకని చాలా ఏళ్ళ నించి బురఖా అవసరం రాలేదు. రెండో కూతురింటికి అల్లుడి బలవంతం చేత బయల్దేరినప్పుడు బురఖా పైని రంధ్రాలు దృష్టి కొచ్చాయి. దీన్ని ధరించి పోతే అక్కడంతా నవ్వి పోతారనిపించి నిరాశ చెందిన ఆమె మళ్ళీ నవ్వినా ఫరవాలేదని ధైర్యం తెచ్చుకొంది. నవ్వడానికి వాళ్ళింటిలో అత్తామామలూ, పెద్దలూ ఎవరూ లేరు. తన కూతురు, అల్లుడు, మనుమడు, కూతురి ఆడబిడ్డ యింతే మంది యింటిలో వుండే వాళ్ళు. వీళ్ళ ముందు మర్యాద పోయే ప్రశ్నే లేదు.

బయట వీధంతా నిశ్శబ్దంగా వుంది. జనాలంతా భయంతో తమ యింటి కిటికీలు మూసుకొని బందీలయ్యారు. ఎలా గాల్లో తేలివసున్నాయో...అన్నట్టు 'అక్కడ నిప్పు పెట్టారట! ఇక్కడ కొట్టి చంపారట' అనే వార్తలు ఎలాగెలాగో వస్తున్నాయి. ఇది తప్పితే గడ్డ కట్టిన మౌనం. ఈ వీధిలో ముస్లిముల సంఖ్య ఎక్కువ కావడం చేత కూతురు, అల్లుడు భయపడాల్సిన అవసరం లేదని సమాధానంగా వున్నారు. "హిందువుల్లో ఒక్క నరమానవుడు ఈ వీధిలోకి వస్తే....బయటి కెళ్ళకుండా బందోబస్తువుంది" అన్నాడు అల్లుడు. వీధిలో హిందువులు ఎవరైనా వుంటే బ్రతకడం కష్టమని తెలిసిపోతోంది. అలాగవుతే హిందువులు అధిక సంఖ్యలో వున్న వీధిలోని ముస్లిముల గతి ఏమిటి అని జైనాబి ఆలోచిస్తోంది.!

"అక్కడ ఎంతోమందిని చంపేశారట! అక్కడ ముస్లిములని చంపిందానికి యిక్కడ ప్రతీకారం తీర్చుకున్నారు" అన్నాడు అల్లుడు. జైనాబి ఈ విషయాలు వింటూ భయంతో వణికిపోయింది. తనకొడుకూ, కోడలూ, పిల్లలూ ఎలా వున్నారో? ఇంటి కిటికీ తలుపుల్ని కాస్త తెరిచి వీధివైపు తొంగిచూసింది. బస్సులూ, కార్లూ తిరగడం లేదు. బస్సులు నడిస్తే మొదట సైబాని బీబీ దర్గాకి వెళ్ళి, తర్వాత వూరికెళ్లిపోవాలి. వీధంతా నిర్మానుష్యంగా వుంది. నిజానికి జైనాబి మంగళూరు రావడంలో వుద్దేశ్యం...కూతుర్ని చూడ్డంకన్నా సైబాని బీబీ దర్గాకి వెళ్లి గోరీ మీద నాల్గు మల్లెపూల మాలల్ని వుంచి, ఊదుబత్తీలు వెలిగించి, రెండు చిటికెల లోబాన్ వేసి దువా చేయాలి అనే ఎన్నో రోజుల ఆశే ముఖ్య కారణం.

"మంగళూర్ బస్టాండులో మీకోసం ఎదురు చూస్తాను. ధైర్యంగా రండి. నేనొక వేళ కన్పించలేక పోయినా కంగారు పడాల్సింది లేదు. అక్కడే శివణ్ణ ఆటోరిక్షా వుంటుంది. అతడు మిమ్మల్ని మనింటికి సీదా తీసికొస్తాడు" అని అల్లుడు వుత్తరం రాశాడు. పూర్వం ఓమారు కూతురు పుట్టింటికొచ్చినప్పుడు "మా వీధి ఆడవాళ్ళు పేటకు వెళ్ళాలనుకుంటే శివణ్ణ ఆటోలో వెళతారు. ఆ రిక్షాలో వెళ్ళడమంటే మగడితో పోతున్నంత ధైర్యంగా వుంటుంది" అని చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది.

మంగళూర్ బస్టాండులో దిగగానే మధ్యాహ్నమైంది. అల్లుడు అక్కడక్కడా కన్పించకపోయేసరికి బెంబేలు పడిపోయింది. పక్కింటి అమ్మాబి కొడుకు సుకుమార్‌ని వెంట తెచ్చుకున్నా బావుండేది అనుకొంది. అల్లుడైనా ఎంత నిర్లక్ష్యపు మనిషి!

బస్టాండులో వుంటానని యిలా చేస్తాడా? శివణ్ణ గుర్తుకొచ్చి అక్కడే ఓ వైపు వరుసగా నించున్న ఆటోల దగ్గరికి వచ్చింది. అక్కడ నించున్న ఓ వ్యక్తిని "శివణ్ణ రిక్షా ఏదయ్యా?" అని ప్రశ్నించింది. "అదే! ఆ వైపు నించి మూడోది" అంటూ చూపించాడు.

ఆమెని చూడగానే శివణ్ణ "ఖాదర్ సాబ్ అత్తగారా?" అంటూ ప్రశ్నించాడు. జైనాబికి ధైర్యం వచ్చింది. అవునంది. "అయ్యో అమ్మా! మీ కోసం అప్పట్నించీ వచ్చిన గిరాకీలు అన్నీ పోగొట్టుకొని ఎదురు చూస్తున్నాను. పన్నెండు గంటల దాకా మీ అల్లుడు ఎదురు చూశాడు. ఏదో అర్జంటు పని వుందనీ, వెంటనే పూర్తి చేసి వస్తాననీ, ఈ లోగా మీరొస్తే సీదా యింటికి తీసుకొని రమ్మనీ చెప్పి వెళ్ళిపోయారు" అన్నాడు శివణ్ణ. అతని మాటల్ని వింటూనే, దాదాపు శివణ్ణ మాటా, రూపూ అన్నీ తన కొడుకులాగే వున్నాయనిపించింది ఆమెకు. రిక్షాలో కూచుని కూతురింటికి చేరింది. కూతురితో శివణ్ణ వినయాన్నీ, గుణాన్నీ ఒకటే పొగడ్డం.

"ఈ వీధిలోని స్త్రీలంతా పేటకి పోవాలంటే...పిల్లల్ని బాగులేనప్పుడు తీసికెళ్ళాలంటే శివణ్ణ రిక్షా వుంటే చాలు వెళ్ళొచ్చు" అంటూ కూతురూ శ్రుతి కలిపింది. ఇలాంటి శివణ్ణని ఆమె వచ్చిన మరునాడే ఈ వీధివాళ్ళు అలా చేస్తారని జైనాబి కలలోనూ అనుకోలేదు.

ఆ రోజు ఖదీజా ఎప్పటిలా కాలేజీకి వెళ్ళింది. పగటి పూట పట్టణంలో కొన్ని చోట్లలో గొడవలు ప్రారంభమయ్యాయి అనే వార్త విని సల్మా ఆందోళన పడసాగింది. కాలేజీకి వెళ్ళిన ఖదీజా నడిచే యింటికి వస్తుంది. ఆమె వచ్చే దారిలో ఏదైనా జరిగితే ఏం గతి? "అల్లా!" అంటూ గొణిగింది. భర్త త్వరగా షాపు మూసి యింటికి రాకూడదా అంటూ కంగారు పడసాగింది. ఉన్నట్టుండి వీధిలో ఏదో గొడవ విన్పించి సల్మా, జైనాబీ కిటికీ గుండా తొంగి చూశారు.

"బాభీ! తలుపు తియ్యి" అనే ఖదీజా మాట వినిపించి సల్మా తలుపులు తెరిచింది. ఏడుస్తూ యింట్లోకొచ్చిన ఖదీజా "బాభీ! మేం నడిచి రావడం చూసి శివణ్ణ 'గొడవలు జోరుగా వున్నాయి అంటూ మమ్మల్ని యిక్కడికి రిక్షాలో తెచ్చాడు. అతణ్ణి ఈ వీధిలోని వాళ్ళంతా చేరి కొడుతున్నారు. అతణ్ణి విడిపించు బాభీ!" అంటూ రోదించింది. సల్మా వీధిలోకి పరుగెత్తడం చూసి జైనాబీ కూడా కూతుర్ని అనుగమించింది. పక్కింటి నల్గురైదుగురు ఆడవాళ్ళు అప్పటికే బయటి కొచ్చి శివణ్ణ రిక్షామీద దాడి చేస్తోన్న

అబ్బాయిల్ని తిడుతున్నారు. "బేవార్సిలంతా చేరి అతణ్ణి ఎందుకు కొడుతున్నారు? విడిచి పెట్టండి" అంటూ సల్మా ముందుకి వెళ్ళేసరికి, మిగిలిన ఆడవాళ్ళూ అండగా నిలిచారు. జనాలు బెదిరి వెళ్ళి పోయారు. కాని శివణ్ణ ఆటో రిక్షా అద్దాలు అప్పటికే పగిలిపోయాయి. అతని ముక్కు నుండి రక్తం కారుతోంది. షర్టు చిరిగిపోయింది. అతడు విచలితుడై రిక్షాలో సీటు మీద కూచునివున్నాడు. చూస్తూ నించున్న వాళ్ళంతా సిగ్గుపడి తలలు పంచేలా, అతడు రిక్షా విడిచిపెట్టి వెళ్ళిపోయాడు.

ఇంట్లో ఖదీజా వెక్కిపడుతూ "ఇక...శివణ్ణ ఈ వీధికి రాడు. మనల్ని అతడింక ఎక్కడికీ తీసికెళ్ళడు" అంది. ఇంట్లో శివణ్ణ సంఘటనతో అందరూ మౌనంగా వుండిపోయారు. అల్లుడొచ్చాక జరిగిన విషయం ఖదీజా చెప్పింది. అతడు నిట్టూరుస్తూ "షాపుకి తాళం వేసి వచ్చేశాను. ఈ గొడవలతో ఎన్ని రోజులు వ్యాపారం ఆగిపోతుందో?" అన్నాడు.

ఊళ్ళో అందరూ ఎలా వున్నారో? వచ్చేటప్పుడు దారిలో కన్పించిన సంజీవ్‌తో "కాస్త యింటివైపు చూడు. నేను కూతురింటికి వెళ్ళివస్తాను" అని చెప్పింది గుర్తుకొచ్చింది. అక్కడ సంజీవ్, అప్పి, కొరగప్ప, అక్కమ్మ, నాగణ్ణ, అమ్మాబి అందరూ మంచివాళ్ళే కదా? అక్కడ యిలాంటి గొడవలు జరగడం అసాధ్యం. అందుకని భయపడాల్సింది ఏమీ లేదని జైనాబి ఎంత సమాధానపరచుకున్నా, శివణ్ణ కూడా మనవాడే కదా? అనే ప్రశ్న ముందుకొస్తోంది. అద్దాలు పగిలిపోయిన అతని రిక్షా, ముక్కునించి కారుతోన్న నెత్తురూ, చిరిగిపోయిన చొక్కా జ్ఞప్తికొచ్చినప్పుడల్లా గుండెలు గుభేలు మంటున్నాయి. ఖదీజా ఆ సంఘటన చెబుతున్నపుడు అల్లుడి ప్రతిక్రియ అలా ఎందుకుంది?

పట్టణం నాల్గు రోజుల గొడవలు సద్దుమణిగినట్టుగా మౌనముద్ర దాల్చింది. ఈ నిశ్శబ్దం నివురు కప్పిన నిప్పులా ఎప్పుడు భగ్గుమంటుందో చెప్పలేమని ఖదీజా చెబుతోంది. అప్పుడప్పుడు వస్తోన్న హత్యలూ, లూటీలూ, దొమ్మీలూ...మొదలైన వార్తలు వినీ వినీ తల పగిలిపోయేట్టుంది. సైదాని బీబీ దర్గా యిక్కణ్ణించి పెద్ద దూరంలో లేదని జైనాబికి తెలుసు. ఈ వీధి చివర కుడికి తిరిగితే వచ్చే సందులో నాలుగడుగులు వేస్తే దర్గా మీనారు కన్పిస్తుంది అని సల్మా చెప్పింది. "అయినా నీవిప్పుడు అక్కడికి పోవద్దు. గొడవలు ఆగిపోనీ..." అంటూ ఆమె బయల్దేరతానంటున్నప్పుడల్లా సల్మా

ఆపేసింది. బయటికి ఎక్కడికీ వెళ్ళలేక కాళ్ళూ చేతులకీ తిమ్మిరెక్కి నట్లయింది. సల్మా యింటి ఖర్చులు పెరిగిపోతున్నాయని లెక్కలు చేస్తోంది. అన్ని రకాల కూరగాయలకి కిలో పదునాల్గు రూపాయలయ్యాయి. చేపలమ్మే ఆడవాళ్ళు ఈ వీధికి రావడమే లేదు. షాపులు తీయడం లేదు. జైనాబి సైదాని బీబీ దర్గాకి వెళ్ళే అవకాశం కోసం ఎదురు చూస్తోంది. దర్గాకి వెళ్ళిన మరునాడే ఊరికి వెళ్ళాలని నిశ్చయించుకొంది.

ఇంట్లో మేకల్ని కోడలు బాగా చూసుకొంటోందో, లేదో. పెద్ద పుంజు గూటికి తిరిగి వచ్చిందా? పెద్ద మేక పోతుకి గిరాకీ వుందని కొడుకు చెప్పాడు. కూతురి యింటికి బయల్దేరేటప్పుడు ఆమె తొడుక్కొన్న పాత బురఖా చూసి కొడుకు "మేకలమ్మిన డబ్బుతో కొత్త బురఖా తీసుకొస్తానమ్మా" అన్నాడు. 'నాకెందుకో కొత్త బురఖా ధరించి తిరగడానికి నేనింకా ఎటు వెళతాను? వయస్సు మించి పోయింది. ఎన్నో ఏళ్ళయ్యాక యిల్లు విడిచి వెళుతున్నాను. ఇంట్లో పేరుకుపోయిన పనుల్ని, విడిచిపెట్టి వెళ్లడానికి ఎలా సాధ్యం? నాకెందుకురా అవన్నీ" అంటూ చెప్పి ఊరుకుంది.

బురఖా పైని రంధ్రాలు గుర్తుకు రాగానే "సల్మా! నల్లదారం వుందా? ఊరికే కూచుని బేజారు. బురఖా కాస్త చిరిగింది. కుట్టుకుంటాను. సూదీ, దారమూ యివ్వు" అంది. బురఖాని తొడల మీద వేసుకొని కూతురిచ్చిన సూదీ, దారమూ తీసికొని కుట్టసాగింది. నల్లటి సిల్కు బురఖా శరీరానికి తాకగానే తీయని జ్ఞాపకాలు ఆమెని చుట్టుముట్టాయి. తన పెళ్ళిరోజు భర్త తెచ్చిన బురఖా. ఆనాటి రోజుల్లో నల్లని సిల్కు బురఖా వేసుకొని తిరగడం ఎంత ప్రతిష్ఠాకరమైన సంగతి! అప్పుడు ఒల్లి అనే పెద్ద వస్త్రాన్ని తలనించి కాళ్ళదాకా కప్పుకొని ఆడవాళ్ళు తిరగాల్సిన పరిస్థితి. ఒక్కోసారి ఒకే అచ్ఛాదనలో యిద్దరు. ఒక్కొక్కరికి ఢీకొట్టుకొన్నట్టు నడిచి వెళ్ళాల్సిన పరిస్థితి జైనాబికి గుర్తుకొచ్చినప్పుడల్లా బురఖా తెచ్చిన తన భర్త గురించి సగర్వంగా వుంది. మొట్టమొదట దాన్ని ధరించగానే కల్గిన రోమాంచం యిప్పటికీ గుర్తు. భర్త బ్రతికి వున్నప్పుడు ఘుమ ఘుమలాడే అత్తరు పూసుకొని, చీర కట్టుకుని మైలూదూ, ఉర్సూ...దేన్నీ విడిచిపెట్టకుండా పరుగో పరుగు. కాని ఆయన చనిపోయాక ఎక్కడికీ వెళ్ళాలని లేదు. కొబ్బరి చెట్ల తోట పనిలో నిమగ్నమయ్యేది. ఆవులూ, మేకలూ, కోళ్ళూ...వీటితో పని. "మీరు మా యింటికి రండి" అని అల్లుడు పిలిచినప్పుడు "ఒకటి రెండు రోజులుండి రా అమ్మా! లేకుంటే బావకి కోపమొస్తుంది. నీవు సైదాని

బీబీ దర్గాకి వెళ్ళాలనుకుంటున్నావు కదా! అది అక్కడికి దగ్గరే!" అని కొడుకూ బలవంతం చేశాడు.

బురఖా అంటే జైనాబికి పంచప్రాణాలు. దాన్ని ధరించకుండా వీధిలో నడవడమంటే నగ్నంగా తిరగడమనే! అలా ఈనాటి ఆడపిల్లలు అనుకోవడమే లేదు. నట్టనడివీధిలో బురఖా లేకే తిరుగాడుతున్నారు. సల్మా ఆడుబిడ్డ యిలా అంటే ఒప్పుకొనే ఒప్పుకోదు.

సల్మా అమ్మకు టీ తెచ్చి యిచ్చింది. బురఖాకి ఎక్కడైనా నొప్పి వేస్తుందో అన్నంత మెత్తగా నయంగా కుడుతోన్న తల్లిని చూసి నవ్వొచ్చింది. "అమ్మా! నీవు కుడితే... కుట్టినట్టే అనిపించడం లేదు. అంత నాజూకుగా వుంది" అంది. కుట్టుపనిలోనే లీనమైపోయిన జైనాబి ఈ లోకంలోకి వచ్చి "లేదు బిడ్డా"! ఇప్పుడు సరిగా కళ్ళు కన్పించడం లేదు" అంటూ తనపని కొనసాగించింది. సల్మా బురఖా అంచుని చూస్తూ "అదెంత కాలమైనా ఈ బురఖా రంగు ఎంత తాజాగా వుందో చూడు. కాని ఈనాటి బురఖా అయితే ఒకటి రెండు సంవత్సరాల్లోనే రంగు మాసిపోతుంది" అని కూతురు పొగడుతుంటే జైనాబి కళ్ళల్లో కొత్త కాంతి మెరిసింది. "మీ నాన్న ఏది తెచ్చినా మంచి రకమే కొనేవాడు" అంది గర్వంగా.

సల్మాకి తన తండ్రి జ్ఞాపకం మసకమసగ్గానే వుంది. ఆమె చిన్నపిల్లగా వున్నప్పుడే అతడు చనిపోయాడు. "ఇప్పుడు కాస్త గొడవలు తగ్గిపోయి వుంటాయి కదూ!" అంది జైనాబి సల్మాతో.

"ఏమీ చెప్పలేకుండా వుంది. పోలీస్ వ్యాన్ మాత్రం తిరుగుతోంది" అంది కూతురు.

"మంజుమ్మయిల్లు ఈ వీధి చివరే కదా! అక్కణ్ణించి మలుపు తిరిగితే బీబీ దర్గా మీనారు కనిపిస్తుంది కదూ!!" అని జైనాబి కూతూహలంగా అడుగుతోంటే కూతురికి ఏదో భయం.

"అమ్మా! ఇప్పుడు నీవు వెళ్ళవద్దు. రెండ్రోజులు ఆగితే గొడవలు నిలిచిపోతాయి. అప్పుడంతా కలిసి పోవచ్చు" అంది సల్మా.

"బిడ్డా! నాకు ఈ రోజే దర్గాకి వెళ్ళి రావాలనిపిస్తోంది. దర్గాకి వెళ్ళేవాళ్ళని ఆపుతారా?" అన్న జైనాబి మొండితనం చూసి కూతురు గాభరా పడింది.

"లేదమ్మా! ఈ జనాల గురించి ఏ గ్యారంటీ చెప్పలేం. ఈ వీధి దాటేవరకూ ముస్లిములే ఎక్కువగా వుండేది. ఏమీ కాదు-తర్వాత దర్గాకి వెళుతోంటే...దారిలో

ఏదయినా జరిగితే? ఖదీజా తల నొప్పి అంటూ పడుకొంది. ఆయన కూడా యింట్లో లేరు' అంది సల్మా.

"నీవేమీ భయపడాల్సింది లేదు. నేను మంజుమ్మ యింటికి వెళ్ళి ఆమెని తీసుకునే పోతాను. రేపు ఎలాగైనా ఊరికి వెళ్ళిపోవాలి. అక్కడందరూ ఎలా వున్నారో?" అంటూ జైనాబి బురఖా వేసుకొని బయల్దేరింది.

నడిచి వెళుతోందే ఏదో అవ్యక్తమైన భయం ఆమెని ఆవరించింది. నలు దిక్కులా మౌనం.

తలుపులు మూసివున్న యిళ్ళు. అక్కడక్కడ దేన్నో కెలుకుతూన్న కుక్కలూ, పిల్లులూ, కాకులూ, గద్దలూ, అది శవమై వుంటుందా? తాను నడిచి వెళుతోన్న వీధిలో పారిన రక్తం తన కాళ్ళకి అంటుకొంటోందా? రావిచెట్టు దాటి పోతుంటే "చెల్లెమ్మా!" అంటూ ఎవరో క్షీణస్వరంతో పిలవడం వినిపించి జైనాబి దిదగాలు పడిపోయింది. దయ్యమై వుంటుందా? పక్కకి తిరిగి బురఖా కాస్త తొలగించి చూసే సరికి ఓ పురుషుడు చెట్టు చాటునించి బయటికొచ్చాడు. అతడి పక్కన ఓ స్త్రీ నించొని వుంది. ఆమె భయంతో వణికిపోవడం జైనాబి గమనించింది. ఆమె ముఖమంతా చెమటలు కమ్మి ఉన్నాయి. నొసటి కుంకుమ చెమటలో కరిగి వంకర టింకరైంది. పురుషుడు వణుకుతోన్న కంఠంతో "తప్పుగా అనుకోకు చెల్లెమ్మా! ఇక్కడ మేం చిక్కుకొని పోయాం. మేం యిక్కణ్ణించి వెళ్ళాలి. నీ బురఖాని ఈమెకి యిస్తావా?" అన్నాడు.

నట్టనడి వీధిలో బురఖా విప్పడమా?" ఇది ముస్లిమ్ మెజారిటీ వున్న వీధి. ఇక్కడ మనకు భయం లేదు. ఏ ఒక్క హిందూ నరమానవుడొచ్చినా తప్పించుకోలేని ఏర్పాట్లు చేశారు. వాళ్ళ వీధిలో మన వాళ్ళని ఎందరిని చంపేశారో తెలుసా? అందుకే..." అన్న అల్లుడి మాటలు గుర్తుకొచ్చాయి. క్షణం సేపు తన ఊళ్ళో వున్న కొడుకు, కోడలు, పిల్లలు అందరూ కళ్ళముందు మెదిలినట్లయింది. వెనకా ముందూ చూడక తన బురఖా విప్పేసి ఆ స్త్రీకి తొడిగింది. ఇప్పుడు ఆ పురుషుడికి ధైర్యం వచ్చినట్టు గమనించి, జైనాబికి తృప్తిగా వుంది. చేతులు జోడించి ఎదుట నించున్న అతడి కళ్ళు వర్షిస్తున్నాయి. ఇద్దరూ మాటలు రానివాళ్ళలా మూగవాళ్ళై జైనాబి ముందు నించున్నారు. "వెంటనే వెళ్ళండి యిక్కణ్ణించి.."అంటూ జైనాబి హెచ్చరించాల్సి వచ్చింది. వాళ్ళిద్దరూ హఠాత్తుగా వాస్తవలోకంలోకి వచ్చి విసావిసా వెళ్ళిపోయారు.

పువ్వు

మలయాళం : ఓ.వి. విజయన్

పువ్వు పూయగానే చెట్టు సంతృప్తి చెందింది. పువ్వు యవ్వనం ముందు తన ముదుచుకొన్న వేళ్ళని మరచిపోయి చల్లగాలికి మెల్లగా ఓలలాడింది. పువ్వు చుట్టూ తేనెటీగలూ, సీతాకోక చిలుకలూ గిరికీలు కొడుతున్నాయి. ఆ పూజ పువ్వుకి ఆనందాన్నిచ్చింది. మొక్క సైతం ఆ విషయాన్ని గమనించలేనంత వాత్సల్యంలో మునిగి మైమరచిపోయింది.

'సాయంకాలం అయ్యేసరికి వాడిపోవాలి-పువ్వు ఆలోచించింది. అంతవరకూ, ఈ కొమ్మకి అంటి పెట్టుకొని వుండడం అంటే విసుగు.'

తుమ్మెదలూ, కందిరీగలూ పువ్వు చుట్టూ పచార్లు చేస్తున్నాయి. ఆ ఆరాధన పువ్వుకి నచ్చింది. మొక్క యిదంతా అర్థం చేసుకోలేని ఆలోచనల్లో మునిగిపోయింది.

మధ్యాహ్నపు మండుటెండలో ఓ తాగుబోతు ఆ దారంట వచ్చాడు. అతడు ఆ పువ్వుని తెంచగానే మొక్క బాధపడింది. పువ్వుకి మాత్రం కుతూహలంగా వుంది. 'ఇది ఓ కొత్త అనుభవం.'

మొక్క "నన్ను విడిచి దూరంగా వెళుతున్నావా?" అంది.

"అవును. ఈ సాహసవంతునితో వెళుతున్నాను" అని జవాబు చెప్పింది పువ్వు.

"నీకు నా మీద ప్రేమ లేదా?" అంటూ ప్రశ్నించింది మొక్క.

"నా కొమ్మ నాకెప్పటికీ ముఖ్యమైందే! సూర్యుడు క్రుంకేవరకు నేను కొమ్మని ఎప్పుడైనా మరిచానా? కానీ...తాగుబోతు నాకు మత్తు యిచ్చాడు. సెలవు."

మొక్క బాధపడి పువ్వు బాగుండాలని ప్రార్థించింది.

"నా పువ్వు రెక్కలు రాలకుండా వుండనీ."

వాసన కొడుతోన్న పళ్ళతో తాగుబోతు పువ్వు రెక్కల్ని సుతారంగా కొరికినప్పుడు, పువ్వుకి ఆపుకోలేనంత నవ్వు వచ్చింది.

'పుష్ప పరిమళం తప్ప ఏదీ తెలీని నాకు ఈ వాసన గమ్మత్తుగా ఉందే?" తనలో తనే అనుకొంది.

ఓ వేశ్య కొప్పులో తాగుబోతు పువ్వుని అలంకరించాడు. పువ్వుకి ఇది కూడా కొత్త అనుభవమనిపించింది. కొప్పు విడిపోగానే పువ్వూ నేలరాలింది. రెండు ప్రాణుల పోరాటాల్లో అప్పచ్చి అయ్యింది.

రేకులు పోయిన పువ్వుని తాగుబోతు మొక్కవైపు విసిరి చక్కా వెళ్ళాడు.

"నేను వచ్చాను. నన్ను ఎత్తుకో..." అంది రేకులూడిన పువ్వు.

"అయ్యో! దేవుడా..." మొక్క అంగలార్చింది.

"భగవాన్! నాకు నా కొమ్మే చాలు" పువ్వు గాద్గిదికమైంది.

ఆంధ్రజ్యోతి వారపత్రిక 22-2-1991

జననం- మరణం

బెంగాలీ మూలం : విభూతి భూషణ్ బందోపాధ్యాయ

జీవితంలో అప్పుడప్పుడు చాలా చిత్రమైన సంఘటనలు జరుగుతుంటాయి. ఆలోచన రీత్యా కాని, అనుభవం దృష్ట్యా కాని వాటి ప్రాముఖ్యత తక్కువేం కాదు. ఇటీవల నా అనుభవంలో అలాంటి ఓ సంఘటన జరిగింది. నిజానికి ఆ సంఘటనను రెండు సంఘటనల సమ్మేళనం అని చెప్పవచ్చు.

నాకు మధుపూర్‌లో ఓ అద్దె ఇల్లు కావాల్సివచ్చింది. భవానీపూర్‌లో వుంటోన్న ఓ పెద్ద మనిషి ఇల్లు మధుపూర్‌లో అద్దె నిమిత్తం వుందని తెలిసి ఉదయమే వెళ్ళాను. బహుశా పది గంటల ప్రాంతం. భవానీపూర్‌లోని ఆ పెద్దమనిషి ఇల్లు లంకంత పెద్దది. బయట పరిశుభ్రమైన కచేరీ, దాని పక్కన వున్న చిన్న గదిలో ఓ మంచమ్మీద కూచుని ఆయన పొగాకు నములుతున్నాడు.

ఆయన వృద్ధుడు. డెబ్భై ఏళ్ళు ఉండవచ్చు. నన్ను చూడ్డంతోటే "రండి! రండి! ఇవాళ సుదినం. నా పుట్టిన రోజు. ఇల్లంతా సంబరంగా వుంది" అన్నాడు.

నేను వచ్చిన పని ఏమవుతుందో అని మనసులోనే మథనపడ్డాను. ఈ హడావుడిలో నా అద్దె ఇంటి విషయం కదపడం ఉచితమా, కాదా అన్నది నా మీమాంస. నేను నా ఆలోచనల్లోంచి తేరుకోకముందే ఓ అందమైన యువతి హాయిగా నవ్వుతూ ఇంట్లోకి ప్రవేశించింది. ఆమె చేతిలో పెద్ద పుష్పగుచ్ఛం వుంది. వెనకాల ఓ యువకుడున్నాడు.

ఇంటి యజమాని.."అరుణా! వచ్చేశావా? ఓహ్! వెంట నిర్మల్‌ని తీసుకొచ్చావా? నిజమే! మీ రోజులే వేరు. మేం ముసలివాళ్ళం కదా.." అన్నాడు.

ఆ యువతి తను తెచ్చిన పుష్పగుచ్ఛాన్ని వృద్ధునికిచ్చి, నమస్కరించి, ఆయన బుగ్గ మీద గిల్లి వెళ్ళిపోయింది. "నా మనుమరాలు. మా పెద్దబ్బాయి కూతురు. భర్త ఇంజనీర్. విదేశాల్లో పెద్ద ఉద్యోగం" అన్నాడు నన్ను చూసి.

ఈలోగానే మరో యువతి వచ్చింది. ఆమె జుత్తు మెడలమీద వదులుగా పడి అదోరకంగా అందంగా వుంది. ఎంబ్రాయిడరీతో వున్న నీలంరంగు చీర, అదే రంగు జాకెట్టు, మెడలో చెయిన్, కాళ్లకి ఖరీదైన చెప్పులు. ఆమెతోపాటు మరో యువతి కూడా వచ్చింది. ఇద్దరూ అవివాహితులని తర్వాత తెల్సింది. ఒకావిడ తెల్లగానూ, మరో స్త్రీ చామనఛాయగానూ వుంది. వాళ్ళు కూడా పుష్పగుచ్ఛాలు యిచ్చి వెళ్ళారు. పైగా తెల్లగా వున్న స్త్రీ ఓ పౌడుం డబ్బా ఆ పెద్ద మనిషికిస్తూ "నాన్న కున్నూర్‌నించి పంపించారు. అమ్మ రాలేకపోయింది" అంది.

"మా రెండో అమ్మాయి కూతుళ్లు. బాగ్‌బజార్‌లో మా అమ్మాయి అత్తగారిల్లు. గోర్‌చాంద్ మల్లిక్‌గారి గురించి విని వుంటారు. ఆయనే మా వియ్యంకుడు. సంప్రదాయ కుటుంబం. ఓహ్! భూదర్! రావయ్యా, రా!! కూచో' అన్నాడు.

నేను వచ్చిన మనిషిని గమనించాను. భూధర్‌కి ఏభైపైన వుండొచ్చు. భారీ శరీరం. ఆయన వెంట వున్న స్త్రీ మాత్రం చాలా పీలగా వుంది. ఆ ఆలుమగల చుట్టూ ఆరేడుగురు పిల్లలున్నారు. అందరికీ పది, పందొమ్మిది ఏళ్ళ మధ్య ప్రాయం వుంటుంది. అయితే వాళ్ళలో ఓ అమ్మాయి చంకన మాత్రం పిల్లవాడు ఉన్నాడు.

వృద్ధుడు ఆమెవేపు చూసి "ఏయ్! మృణాళ్! వెనక ఎవరు? రా! రా!! పిల్లవాణ్ణి ఇవ్వు. ఎత్తుకొని ఇస్తాను. నిశీథ్ రాలేదా ఏం?' అన్నాడు.

నా పరిస్థితి కడుశోచనీయమైపోయింది. ఆ చిన్న గదిలో ఇక స్థలం లేదు. ఉన్న ఖాళీ ప్రాంతమంతా కొత్తగా వచ్చిన ఆలుమగలతోనూ, వెంట వున్న పిల్లలతోనూ నిండిపోయింది. నేను కాస్త నా కుర్చీని గోడవైపు లాక్కున్నాను. దాంతో కొంత స్థలం దొరికింది. అయితే ఆ పెద్దమనిషిని చూసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే జనాల సంఖ్య మాత్రం తగ్గుముఖం పట్టలేదు. గదిలోకి వచ్చిన వాళ్ళు బయటికి వెళ్ళిపోతేనేగాని బయటి నుండి లోనికిరావడానికి నించున్న జనం ప్రవేశించలేరు.

"ఇదుగో వీడు మా పెద్దబ్బాయి తారక్. అలీపూర్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాడు. బాలిగంజ్‌లో ఇల్లుంది. అక్కడే వుంటాడు" అన్నాడు మరొకరిని చూపిస్తూ నాతో.

మళ్ళీ కొత్తగా వచ్చిన గుంపులో స్త్రీలు ఎవరూ లేరు. ముగ్గురూ అబ్బాయిలే! పదహారేళ్ళ నించి ఇరవై ఏళ్ళమధ్య వుంటారు. వాళ్ళు వృద్ధుడికి ఏ కానుకలూ ఇవ్వలేదు. ఓ అబ్బాయి ఆటోగ్రాఫ్ బయటికి తీసి వృద్ధుడితో..

"మాకు ఏదైనా రాసివ్వండి" అన్నాడు. అలా ఆటోగ్రాఫ్ రాశాడో, లేదో ఈలోగా ఇద్దరు అబ్బాయిలు, వాళ్ళ వెంట ఓ అమ్మాయి వచ్చారు.

ఆ తర్వాత ఇంక వూహించని రీతిలో జనం తరలివచ్చారు.

ఎంతమంది అబ్బాయిలు అమ్మాయిలు, ఎందరు పిల్లలు, పెద్దలు అని లెక్కపెట్టలేం. పూల దండలతో, పుష్పగుచ్చాలతో మంచం నిండిపోయింది. అందరూ అతని కొడుకులు, కూతుళ్ళు, మనవలు, మనుమరాళ్ళు, అల్లుళ్ళు, తమ్ముని భార్యలు, మళ్ళీ వాళ్ళ పిల్లలు. ఇల్లంతా మహా సంబరంగా వుంది. ఆ పెద్దమనిషి అదృష్టవంతుడు. పైగా సంపన్నుడు, ఇలాంటి వ్యక్తుల సహాయ, సహకారాలు లేక పోతే బ్రహ్మదేవుని సృష్టికి అర్థంలేదేమో! క్రమేపీ రద్దీ పెరుగుతోన్న కారణంగా నేను బయటికి వచ్చేసి హాయిగా ఊపిరి వదిలాను. ఆ పెద్దమనిషి ఈ సందడిలో నా సంగతే మర్చిపోయాడు. ఆ సమ్మర్దంలోంచి బయటపడ్డమే మంచిదైంది. ఇంటి ముందరి వీధిలో ఈ కొసనించి ఆ కొసదాకా క్యూ వుంది. వాహనాల వరుస కూడా తక్కువేం కాదు. వీధినించి మెయిన్ రోడ్డుదాకా నిలిచివున్నాయి. అసలు పెళ్ళివాళ్ళ యింటికి కూడా ఇన్ని వాహనాలు రావేమో! వీధి దాటి మెయిన్ రోడ్డు చేరగానే నివారణ్ మిత్రా కనిపించారు. ఆయన నా స్నేహితుడు. ఉరుకులు పరుగులతో వెళుతున్న ఆయన్ని చూసి "నువ్వు కూడా ఆ విశ్వనాథ్‌బాబుగారి ఇంటికేనా వెళ్ళడం?" అన్నాను.

"అవును. అన్నట్టు..ఆయన నీకెలా తెలుసు?"

"ఇప్పటిదాకా అక్కడే కూచుని వున్నాను. నా తల తిరిగిపోయింది. నగరంలోని ముప్పాతిక శాతం మంది సందులేకుండా వున్నారు".

"నీకు అంత ఆశ్చర్యంగా వుందా?... విశ్వనాథ్‌బాబుకు ఏడుగురు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు. మళ్ళీ వీళ్ళ పిల్లలు, అంటే మనవలు, మనుమరాళ్ళు. అంతే కాకుండా ఆయనకు ముగ్గురు తమ్ముళ్ళున్నారు. వాళ్ళ పిల్లలు అంతా కలిసి బోలెడు మంది. అన్నట్టు...నీకు అసలు విషయం తెలీదా? ముసలాయన దగ్గర ఏభై, అరవై

వేల రూపాయలు ఉన్నాయి. అందరి కళ్ళూ ఆ డబ్బుల మీదే! మంచిది...వస్తాను భాయీ! ఆలస్యమవుతోంది" అంటూ వెళ్ళిపోయాడు మిత్రుడు.

❀ ❀ ❀

ఆ తర్వాత రెండు వారాలకి నేను మా వూరువెళ్ళాను. నాకు మా స్వగ్రామంతో పెద్దగా సంబంధం లేదనే చెప్పాలి. ఏడాదికోమారు కూడా వెళతానో, లేదో చెప్పడం కష్టం.

మా వూళ్ళో అందరికన్నా పెద్ద వృద్ధురాలు శశితాకూర్ చనిపోయిందని ఇంటికి వెళ్ళాక తెలిసింది. కొందరు ఆమెకి తొంభై ఏళ్ళుంటాయనీ, మరికొందరైతే నూటికి దగ్గర అనీ అంటారు. అసలు నా చిన్నప్పటినించే ఆమెని వృద్ధురాలిగా చూస్తున్నాను.ఆమెకి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. పెద్ద కొడుకు తప్ప మిగిలిన ముగ్గురూ ఇతర గ్రామాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద కొడుకు చదువుకోకపోవడం చేత వూళ్ళో ఆ పనీ, ఈ పనీ చేస్తాడు. అయితే ఆయన పరిస్థితి ఏమంత బాగా లేదు. గంపెడు సంతానం. తమ్ముళ్ళు ఎవ్వరూ సాయం చేయరు. ఉద్యోగ ప్రాంతాల నుండి సాధారణంగా ఎప్పుడూ స్వస్థలానికి రారు.

శశీతాకూర్ కష్టాలకి అంతులేదు. కప్పు కూలిపోతోన్న గదిలో నివాసం. ఈ మధ్య పెద్దకొడుకు కూడా తల్లిని సరిగా పట్టించుకోవడం లేదు. ఆయన మనసులోనూ తల్లికి తను ఒక్కడే కొడుకు కాదు కదా అన్న ఆలోచన ప్రవేశించింది. తమ్ముళ్ళు ఏమాత్రం డబ్బులు పంపకపోతే తను మాత్రం ఎలా బాధ్యత వహిస్తాడు?డబ్బులు ఎలా పంపించగలం? ఇంటి దగ్గర, కాస్తో, కూస్తో ఆస్తిపాస్తులు వున్నాయి కదా! వాటి ఆదాయం అమ్మకి సరిపోతుంది" అంటూ జవాబు రాస్తారు.

వృద్ధురాలికి తిండికే ఇబ్బందిగా వుంది. పైగా ముసలితనం కావడంచేత తీపి తినాలన్న వాంఛలు, వగైరాలు. నేను ఓమారు వూరికి వెళ్ళినప్పుడు ఆమె ఓ చెట్టు నీడన కూచుని వుంది. చేతిలో ఓ కర్ర వుంది. నన్ను చూసి "ఎవరూ? కుంజిబాబేనా?" అంది.

"ఔను...ఇప్పుడే వస్తున్నాను. బాగున్నావా?"

"నేను బావున్నానని ఎలా చెప్పను. తిండికి కటకటగా వుంది. బాదా దగ్గర కొంత డబ్బు అప్పు చేశాను. తీర్చలేకపోయాను. అందుకని ఆయన మళ్ళీ అప్పు ఇవ్వడం

లేదు. సిద్ధూ దగ్గర ఎన్నిసార్లు అడగాలి? వాడు తన పిల్లా పాపలతో అష్టకష్టాలు పడుతున్నాడు. పిల్లలముఖం చూస్తే కొండంత దుఃఖం కల్గుతోంది. వాడికే బొటాబొటిగా వుంటే నేనెలా అడగను? అవునూ...నీ దగ్గర ఏమన్నా వుంటే...ఓ నాలుగు అణాలు ఇవ్వరాదూ!"

ముసలావిడ దురవస్థని చూసి చలించిపోయాను. జేబులోంచి ఓ రూపాయి తీసి ఆమె చేతికిస్తూ "ఇప్పటికిది వుంచండి! మీకెంత కావాలో నేను ఇక్కడ వున్నంతసేపూ అడిగి తీసుకోండి" అన్నాను.

ఆమె అవాక్కయిపోయింది. ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయింది. అసలు ఆవిడ అడగ్గానే నేను అలా రూపాయి ఇస్తానని వూహించలేదు.

మరుసటి సంవత్సరం విజయదశమి కన్న కొంతముందుగానే వూరికి వెళ్ళాను. మా ఇంటి ముందరి బత్తాయి చెట్టు నీడలోంచి ఆమె నడిచి వెళుతోంది. చేతిలో ఓ పెద్దకంచుపాత్ర వుంది. నన్ను చూసి "ఎప్పుడొచ్చావ్ బాబూ?" అంది.

"నిన్న వచ్చాను. పాత్రను ఎక్కడికి తీసుకెళుతున్నావు?"

"ఓహూ! చెప్పలేదు కదూ! దీన్ని అమ్మడానికి పట్టుకుపోతున్నాను. మాకు రోజులు గడవడం మహాకష్టంగా వుంది. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఇల్లంతా దరిద్రం. సిద్ధూ ఎక్కడికో వెళ్ళిపోయి ఐదు రోజులవుతోంది. పిల్లలంతా పస్తులతో వుంటున్నారు."

"మరి ఆ పాత్రని అమ్మి ఎన్ని రోజులు గడుపుతారు?"

"పిల్లలు ఆకలితో అలమటించి పోతున్నారు. పాత్రని నువ్వు తీసికోగలవా? పూర్తి కంచుతో చేసింది. పెళ్ళి తర్వాత మా పుట్టింటి వాళ్ళు నాకోసం ప్రత్యేకంగా చేయించి యిచ్చారు."

నగరంలో వుంటూ డబ్బులు గడించే నాలాంటి వాళ్ళకి పల్లెల్లో ఇంత దుర్భర దారిద్ర్యం వుందనే విషయమే గుర్తుకురావడం లేదేమో! అన్యమనస్కంగా వున్న నన్ను చూసి ఆ వృద్ధురాలు నాకు పాత్రని కొనడం ఇష్టం లేదని గ్రహించినట్టుంది.

"కొనకున్నా ఫరవాలేదు. తాకట్టు పెట్టుకొని అర్ధరూపాయి ఇస్తే చాలు" అంది.

ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో వున్న ఆమెని నేను చాలాసార్లు గమనించాను.

వృద్ధురాలి మరణ సమయంలో పెద్దకొడుకు తప్ప ఎవ్వరూ రాలేదట! పెద్దకొడుకు తల్లికి చాలా సేవ చేశాడట. ఇంక రెండు గంటలైతే ప్రాణం పోతుందనగా ఆమె తన

కోడల్ని పిలిచి తన శరీరంమీది కోటుని తీసి పిల్లల కోసం కాపాడమని చెప్పి విలవిలా రోదించిందట.

పెద్దకొడుకుని దగ్గరకు పిల్చుకొని "చూడు సిద్ధూ! ఓ మాట విను. నా అంత్యక్రియలకు ఖర్చులు పెద్దగా చేయకు. తమ్ముళ్ళు ఎవ్వరూ డబ్బులివ్వరు. ఆడంబరంగా ఖర్చులు చేయడం నీకు ఎలా సాధ్యమవుతుంది? ఓ ఐదుగురు బ్రాహ్మలని పిలిచి నమో! నమో! అనిపించు. ఒకవేళ తమ్ముళ్ళు డబ్బులు పంపించినా అదంతా ఖర్చుపెట్టకు. దాన్ని నీ పిల్లల తిండికోసం అలా అట్టిపెట్టుకో!" అందిట.

కానీ నేను విన్న విషయం ఏంటంటే... చనిపోయింతర్వాత ఆమె కొడుకులందరూ వచ్చి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారని.

ఓమారు అలా వెళ్ళి వద్దామని వాళ్ళింటికి బయలుదేరాను. ఇంటిముందరి వాకిట్లో కొబ్బరికొమ్మలతో మంటపం వేశారు. మంటపం ముందు షామియానా వుంది. గ్రామంలోని చాలామంది వున్నారక్కడ. మూడో అబ్బాయి గోపీశ్వర్ వూరి పెద్దమనిషి చౌదరిగారితో మాట్లాడుతున్నారు. గోపీశ్వర్ రైల్వే ఆడిట్ ఆఫీస్‌లో పెద్ద ఉద్యోగి. చౌదరిగారు ఎవరిగురించో ఉద్యోగం కావాలని గోపీశ్వర్‌గారిని అడుగుతున్నారు. ఆయనేమో ఇప్పుడు సాధ్యం కాదని కారణాలు చెప్పుతున్నారు. గోపీశ్వర్ కదా! వస్తూపోతూ వుంటేనే చుట్టరికం. ఇప్పుడైనా అత్తగారు చనిపోయి వుండనట్లయితే మనం వచ్చేవాళ్ళమా? ఉత్తరం చూడగానే వెళ్లకపోతే వూళ్ళో పరువుండదని వచ్చాం. అత్తగారికి డబ్బు లేదనే విషయం అందరికి తెలుసు. కానీ ఆమెకి వూళ్ళోనూ ఇంట్లోనూ మంచి పేరుంది. రాకపోతే తల్లి అంత్యక్రియలకి రాలేదనే చెడ్డ పేరు వస్తుంది. అందుకనే వచ్చాం. లేకపోతే ఇలాంటి వూళ్ళో మనుషులు నివసిస్తారా? అబ్బా! ఏం దోమలు? నిన్న రాత్రి ఏ మాత్రం కళ్ళు మూతలు పళ్ళేదు" అంది.

రెండో అబ్బాయి కొడుకు వికాస్ తను ఎలా స్కూల్లో ఫుట్‌బాల్ జట్టులో గెలిచిందీ మహా ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు. మూడో కొడుకు కుమారుడితో, పెద్దకొడుకు కుమారుడు నిశ్శబ్దంగా వాళ్ళ ముఖాలకేసి చూస్తూ శ్రద్ధగా వాళ్ళు చెప్పే విషయాలు వింటున్నాడు. ఆయన తన చిన్నాన్న కొడుకులకన్న వయస్సులో పెద్దవాడైనా, వూరి ప్రైమరీస్కూల్ తప్ప మరోటి ఎరగడు. అందుకే ఆయనకి సిగ్గుగా వుంది. వాళ్ళతో కలివిడిగా వుండలేక పోతున్నాడు.

హఠాత్తుగా వికాస్ చిన్నక్కయ్య ఆరతి ఆఘమేఘాలమీద వచ్చి "ఒరేయ్! ఇక్కడి కూచుని ముచ్చట్లు పెడుతున్నారా? మేమంతా నిన్ను పిలిచి హైరానా పడిపోతున్నాం. టీ తయారైంది. తాగి మళ్ళీ మొదలెట్టండి. రండి!" అంది.

ఇదంతా చూసాక నా మనస్సులో ఓ దృశ్యం మెదిలింది. చనిపోయిన వృద్ధురాలు, వంగిపోయిన నడుం, ముడుతలు పడ్డ ముఖం, కంచు పాత్రని అమ్మడానికి తీసికెళుతోన్న సన్నివేశం... అన్నీ ఒకటి వెనుక ఒకటి దృశ్యమాలికలా కనిపిస్తున్నాయి. హాయిగా నవ్వుతూ, తుళ్ళుతూ గెంతులేసే ఈ సమస్త బాల బాలికలు, పెద్ద వాళ్ళు, యువతులు, వీళ్ళ సౌందర్యం, సజీవత్వం, సంతోషం, సంభ్రమం అంతా ఆ దరిద్ర వృద్ధురాలి సృష్టి! వీళ్ళంతా ఆమెకి వారసులు. మరి ఇన్నాళ్ళు వీళ్ళంతా ఏమయ్యారు? ఎక్కడున్నారు? వీళ్ళంతా వుండగా ఆ వృద్ధమాత కూటికి, గుడ్డకి ఎందుకు మొహం వాచి వుంది? ఎందుకు ఆమె రహస్యంగా ముఖం దాచుకొని తలగడలు తడిపింది? దీనికి ప్రత్యుత్తరం ఎవరి దగ్గరా లేదు.

నా స్మృతిపథంలో పై దృశ్యంతోపాటు మరో చిత్రం కూడా కదలాడుతోంది. అది కలకత్తాలోని భవానీపూర్‌లో వున్న పెద్దమనిషిది. అక్కడ కూడా ఇక్కడిలాగే బోలెడు మంది కొడుకులు, కూతుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, తమ్ముళ్ళు, మళ్ళీ వారి పిల్లలు, వాళ్ళ సంతానమూ, అంతా ఇక్కడికి మల్లే! అయితే అది పుట్టినరోజు పండగ. ఇది చావుకి సంబంధించిన కర్మకాండ. ఇద్దరి వయస్సుల్లోనూ మరి పెద్దగా అంతరం లేదే!

– విపుల

తల్లి చీర

కన్నడ మూలం : కె.ఆర్. సంధ్యారెడ్డి

రాజన్న తన భార్యా పిల్లలతో వూరికి బయల్దేరాడు.

ఇంటినుంచి బయలుదేరేటప్పుడు తలుపులు, గొళ్ళేలు, స్విచ్చులు, కిటికీలు, బీరువా, తాళం, తాళంచెవులు, అదీ ఇదీ అన్నీ బందోబస్తు చేసుకొని, ఆటో పట్టుకొని బస్టాండ్‌కొచ్చేసరికి.. ఊరికి వెళ్ళి తిరిగివచ్చినంత పనైంది.

అందుకే ఈ మధ్య ఊరికి వెళ్ళిరావడం అంటే బేజారు. కేవలం ఒకటి, రెండు రోజుల కోసం ఊరికి ప్రయాణమైనా ఇంటిదగ్గర... ఇక్కడ ఇంత బందోబస్తు చేయాలిమరి!

అతడి ఊరు బెంగుళూరునించి కేవలం ఎనభైమైళ్ళ దూరంలో వుంది. చదివేటప్పుడూ, తర్వాత పనిలో చేరాక కూడా ప్రతి శనివారం సాయంకాలం ఊరికి వెళ్ళి సోమవారం పొద్దున తిరిగొచ్చేవాడు. పెళ్ళి తర్వాత ఈ అలవాటు తప్పింది. ఏదో ఓ పని వచ్చివుండేది. భార్య ఉమ కూడా ఉద్యోగస్థురాలు. ఎక్కువగా సెలవులు దొరకవు. ఆ ఒక్క ఆదివారమూ వారంలోని మిగిలిన పనుల్ని ముగించడానికి సరిపోదు. ఇలాంటి సవాలక్ష కారణాలతో మునుపటిలా ఊరికి పోవడం కుదరడంలేదు.

చిత్ర పుట్టాక మరింత తీరిక కరువైంది. ఇటీవల బెంగుళూరులో ఇల్లు కట్టుకోవడం మూలాన అసలే వీలుచిక్కలేదు. 'ఇల్లు కట్టి చూడు, పెళ్ళిచేసిచూడు' అని ఊరికే అన్నారా మరి! ఇల్లు కట్టింతర్వాత ఇతర సమస్యలు తోడై ఊరికి వెళ్ళిరావడం వృథా

ఖర్చు అనే ఆలోచనా కల్గింది. సంక్రాంతి, ఉగాది, దీపావళి మొదలైన పండుగలకు వెళ్ళివస్తే సరిపోతుందని నిర్ధారించుకున్నాడు. రాజన్నకు మధ్యలో మళ్ళీ ఏమైనా పనులొస్తే ఈ కార్యక్రమం కూడా తారుమారు కావడం మామూలే! ఈసారి అలాగే జరిగింది. ఉగాది పండక్కి వెళ్ళాలనుకుంటే కూతురి పరీక్షలు, ఆఫీసులోని పని ఒత్తిడి ఆటంకాలుగా మారాయి. ఈ జంజాటమంతా పూర్తయ్యాక ఇదుగో ఇప్పుడు బయల్దేరాడు. వెళ్ళకపోతే నాన్న, అమ్మ, చుట్టాలు, చుట్టుపక్కలవాళ్ళు ఏమనుకుంటారో అనే కారణం బయల్దేరడానికి బలంగా పనిచేసింది.

బస్సులో కూచున్న తర్వాత ఓమారు స్త్రీలవైపు దృష్టిసారించాడు. వాళ్ళలో చాలామంది తన భార్యలా వివాహితులు. దాదాపు ఉమ కున్నంత వయస్సులో వున్నవాళ్ళే! అయినా ఉమ వాళ్ళకంటే ఎంతో స్మార్టుగా ఉంది. ఆమె మెడలోని నల్లపూసల గొలుసు కన్పించకుండా వుంటే ఆమెకు ఇంకా పెళ్ళికాలేదనే అనుకుంటారు. పొడుగ్గా వుండే ఆమెకి ఏ చీర అయినా అందంగానే వుంటుంది. పైగా ఉమకి తన దుస్తుల గురించీ, ముస్తాబు గురించీ విపరీతమైన శ్రద్ధ. ఏ సందర్భానికి ఎలాంటి చీర కట్టాలో ఆమెకు బాగా తెలుసు. చీర పారదర్శకంగా వుండకూడదు. మరీ డల్లుగా వున్నా లాభంలేదు. జరీ వుండొద్దు. ఎక్కువ నెరువు ఉండాలి. సరిగా మ్యాచ్ అయ్యే బ్లౌజ్ ఉండాలి. ప్రయాణంలో నలిగిపోకూడదు. అయితే ఇన్ని లక్షణాలున్న చీర దొరుకుతుందా ఇంతకీ? అందుకే విసుక్కుంటూ "ఛీ! ఒక్కటైనా సరైన చీర లేదు నాకు" అంటుంది. పండుగ అడ్వాన్సులోంచి చీర కొనుక్కుందాం అంటే అప్పులబాధ కదా అని గొణుక్కుంటుంది. రాజన్నకు మాత్రం ఆమె ప్రవర్తన అతిగా అనిపిస్తుంది.

"మాలా నాల్గు షర్టులు, ఫ్యాంట్లు వుంటే నీకు ఈ బాధ వుండకపోయేది. అయినా నువ్వు చీరలు కట్టి ఇంకా ఎవరిని మెప్పించాలి? పిల్లలయ్యాక ఈ షోకులెందుకోయ్?" అంటాడు భర్త. ఆమె కూడా అందరు పెళ్ళాల్లానే.....

"భలే మొగుడివే! అవసరమున్నవి కొనివ్వకపోయినా ఫరవాలేదు. కనీసం తన పెళ్ళాం అందంగా కన్పించాలి అనే రసికత లేకపోతే ఎలా?" అంటుంది.

పెళ్ళికి ఎవరింటికి వెళ్ళివచ్చినా ఉమ మనస్సు అల్లకల్లోలమవుతుంది. ఓ పేదవాడి బిడ్డ పెళ్ళి చేయగల్గిన ఖరీదైన చీరలు ధరించిన స్త్రీలనూ, ఆధునిక రీతిలో కళాత్మకంగా వున్న చీరలు ధరించిన వాళ్ళనూ చూసి తాను ఓ పాతకాలం గొడ్డు అనుకుని

కుంగిపోతుంది. తమకన్నా పైస్థాయి అభిరుచులకూ, తమ ఆదాయానికీ మధ్య వున్న కందకంలో పడి కొట్టుమిట్టాడే భార్యని చూసి రాజన్న "చూడు! నువ్వు నన్నెందుకు పెళ్ళిచేసుకొన్నావు? కలెక్టర్నో, సి.టి.ఓ.నో. చేసుకుంటే బాగుండేది" అంటాడు.

ఉమ తన అంతస్తు తెలియనంత మూర్ఖురాలేంకాదు. మొగుడి ప్రాణాలు తోడేసే మొండిదేం కాదు. కొన్ని సందర్భాలలో మాత్రం ఆమె అలా ప్రవర్తిస్తుంది. అంతే!

చీరలు, గుడ్డల విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా రాజన్న మనస్సు ఊళ్ళో వుంటోన్న అమ్మ, నాన్న, వదినల వేపు పరుగులు పెడుతుంది. ఉమ మనసేమో రోజుకో చీర మార్చుతూ ఎగిరిపడే విమల, సుజాతల వంక ఉరుకులు తీస్తుంది. ఊళ్ళలో వున్నవాళ్ళకు ఎలా వున్నా నడిచిపోతుంది. పొలాలకీ, చేలకీ వెళ్ళే వాళ్ళకి గుడ్డల ధ్యాస వుండదు. రాజన్న ఇంటివాళ్ళు సైతం నోరువిడిచి ఏ రోజూ అడగలేదు కాబట్టి అతడు ఆ సమస్యను గుర్తించీ, గుర్తించనట్టే మసలుకొంటున్నాడు. రాజన్నకు భార్య ఆదాయం కూడా తోడు కావడంచేత జీవితరథం బాగానే సాగుతోంది. బర్త్‌డే, యానివర్సరీ డేల మిషలతో కొత్తబట్టలు కొనుక్కుంటూనే వున్నారు.

ఉమ మరీ స్వార్థపరురాలు కూడా కాదు. "అత్తగారికి నా చీరల్లో ఏదైనా ఇస్తాను. కానీ....ఆమె పద్దెనిమిది మూరల చీర కడుతుందే! అలాంటిది నాదగ్గరేమో లేదాయె! పోనీ..తోటి కోడలుకు ఇద్దామన్నా ఆమె ఈ కాటన్, సిల్కు చీరల్ని మెయింటెయిన్ చెయ్యలేదు. వాళ్ళు ధరించే చీరలే కావాలంటే కొనక తప్పదుమరి! అన్నీ కలిపి ఎంత ఖర్చో మళ్ళీ...ఏం చేద్దాం?" అనుకుంటూ కిమ్మనకుండా వుండిపోతుంది.

రాజన్న కూడా అంతే! "అమ్మకి చీర తీసుకుపోవాలి. కానీ ఆమెకొక్కదానికే తీసుకుపోతే బావుండదు. వదినకూ తీసుకోవాలి. అన్న బతికి వుంటే అది వేరుగా వుండేది! అతని బాధ్యత అని వూరుకోగలిగేవాణ్ణి! బావి పనికి వెళ్ళి మట్టి గడ్డ విరిగి పడి అతను చావకపోతే... ఇంకా నాన్నగారున్నారు. ఈయనకు మొదటినుంచీ అమ్మమీదే ప్రేమ. 'నాకు ఒక్కటీ తీసుకురాకు' అనుకుంటే ఎలా? తీసుకుంటే అందరికీ తీసుకోవాలి. మరి అంత డబ్బు ఎక్కణ్ణించి తేను? చేతికొచ్చే జీతంకన్న కోతలే ఎక్కువాయె! పైగా పెద్ద జీతమని టాక్స్ కట్టాలాయె! వచ్చే జీతం దినవెచ్చానికీ, కట్టుబట్టలకీ చాలనప్పుడు..." అని గొణుగుతూ నణుగుతూ అతనూ గమ్మున వుండిపోయాడు.

బస్ బయల్దేరిన కాస్సేపటికే కునికిపాట్లు ప్రారంభించిన చిత్ర "అమ్మా! నేను పడుకొంటాను. పెద్ద పెద్ద వాగులూ వంకలూ వస్తే లేపు" అని ఉమ ఒళ్ళో తలపెట్టుకుంది. ఆరేళ్ళ ఆ పాపకి సముద్రాలు, నదులు, చెరువులు, వాగులు అంటే ఎంతో ఇష్టం. ప్రయాణానికి సరిపోయే చీర కట్టుకోలేదనే దిగులుతో కుంగిపోయిన ఉమకి నవ్వు వచ్చింది. ఈ చిత్ర ఇలాగే... తన ప్రతి మాటతో తల్లిని ప్రసన్నం చేస్తుంది.

రాజన్న పత్రికలో ముఖం దూర్చాడు. పత్రికను పొల్లుపోకుండా చదివేదాకా ఆకాశంమీద పడ్డా అతని దృష్టి సడలదు. దారికి ఇరుపక్కల పచ్చని పంటపొలాలు, ప్రయాణం ఉల్లాసకరంగా వుంది. బెంగుళూరు యాంత్రిక జీవితాలతో మొహం మొత్తిన మనస్సులు ప్రకృతి దృశ్యమాలికలతో సేదతీరుతున్నాయి. తోటలు, పొలాలు అంటే ఉమకి వల్లమాలిన ఇష్టం. 'అసలు ఊళ్ళోని అత్తగారింటిలో బాత్‌రూం, లాట్రిన్ సౌకర్యం వుంటే అప్పుడప్పుడు సెలవుతీసికొనైనా వెళ్ళేదాన్ని!' అని అనుకుంటుంది. తాను ఆ ఇంటి కోడలుగా వెళ్ళినప్పటినుంచీ మామగారు 'ఈ వర్షాకాలం గడిచిపోనీ...ఇటుకలు ఎలాగూ వున్నాయి. బాత్‌రూం, వీలుంటే లాట్రిన్‌గదినీ కట్టిద్దాం" అంటారు. ఇలా పదేళ్ళు గడిచాయి. కట్టించే తీరిక దొరకలా. లేదా అది అతనికి అత్యవసరం కాదేమో!

"పోనీ! ఆయనకు ఎలా అనుకూలంగా వుంటే అలాగే చేసికోనీ!" అనుకుంది ఉమ కూడాను. అయితే బెంగుళూరునించి అవురూపంగా వెళ్ళే ఉమ అందచందాలనూ, తెల్లని కాళ్ళు, చేతులనూ, పల్లెటూరి పిల్లలు ఆశ్చర్యంగా చూస్తారు. ఇరుగుపొరుగు స్త్రీలు సైతం ఉమ ఎక్కడికి వెళ్ళినా కన్నార్పకుండా గమనిస్తారు. ఈ విషయాలు గుర్తుకొచ్చినప్పుడల్లా "ఛీ! ఓ బాత్‌రూం కూడా లేదు" అంటూ గొణుగుతుంది. రాజన్న ఇంటి ముందరి వాకిట్లో ఓ మూలకు ఏడెనిమిది బండరాళ్ళు పేర్చి స్నానాలగదిగా మార్చారు. దానికి తలుపులుండవు. పెళ్ళైన కొత్తలో మాత్రం ఉమ స్నానంకోసం దుప్పటిని తెరగా కట్టారు. ఓ రోజు ఆమె స్నానం చేస్తోంటే దుప్పటి జారిపోయింది. అదే ఆఖరు...అప్పటినుంచీ ఉమ అక్కడ స్నానం చెయ్యలేదు. ఉమ అత్తవారింటికి వచ్చినప్పుడల్లా ఒకేరాత్రి వుండిపోతుంది. మరునాడు పగలు ప్రయాణమే.

ఊరు దగ్గరవుతోంది. చిత్రకు మెలకువ వచ్చి లేచికూచుంది. కిటికీ గుండా

బయటికి చూస్తూ 'అమ్మా! ఆ పచ్చిక ఎంత చక్కగా పెరిగిందో చూడు. ఎవరైనా పెంచారా ఏంటి?" అంది. అసలు అవి వరిచేలు అనే విషయం ఆ పాపకి తెలియదు. కూతురి మాటలతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చింది ఉమ. రాజన్న జోగుతున్నాడు.

ఊరు రాగానే చిత్ర ఇంటికేసి పరుగులు పెట్టింది. ఆమెకు ఊహ తెలిశాక ఈ వూరికి రావడం ఇది రెండోసారి. ఐనా నేరుగా ఇంటికి పరుగులుతీసింది. కారణం...అది పెద్ద ఊరు కాదు. సుమారు అరఫర్లాంగు వరకు వీధికి ఓ పక్క ఇళ్ళు. చుట్టుపక్కల వరిచేలు, చెరుకు చేల పచ్చదనం. కొబ్బరితోటలు కూడా ఉన్నాయి.

ఇంట్లో అడుగుపెట్టగానే రాజన్న అన్న కూతురు సరస కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు ఇచ్చింది. ఆమెకిప్పుడు పద్నాలుగు సంవత్సరాలు. ఓణి వేసుకుంటోంది. పొడుగాటి జడలు. నల్లరాతి శిల్పంలాంటి దేహం. ఆ శరీరం రంగే ఆమె పెళ్ళికి ప్రధాన అవరోధంగా నిలిచిపోతోంది.

రాజన్న, ఉమలు కాళ్ళు కడుక్కొని వచ్చి చాపమీద కూచున్నారు. రెండు బెంచీల్ని కలిపి చేసిన మంచం మీద రాజన్న నాన్న పడుకొని వున్నారు. వీళ్ళని చూసీ చూడక ముందే లేచి కూచున్నారు. రాజన్న గురించీ, ఆయన స్నేహితుల యోగక్షేమాల గురించీ అడిగారాయన. కోడలువైపు తిరిగి ఎప్పటిలా "ఇప్పుడు నీ జీతం ఎంతమ్మా? ఇల్లు కట్టిన అప్పు తీరిందా? అదేం బెంగుళూరోకానీ కష్టపడి సంపాదించిన సొమ్మంతా ఇల్లే మింగుతోంది" అంటూ నిట్టూర్చారు. కొడుకుతో ఊళ్ళోని విద్యుత్కోత గురించీ ముచ్చటించారు. "పంపుసెట్టు పెట్టాం. కానీ కరెంటే లేనప్పుడు ఏం చేయగలం? పగలంతా ఉండదు. రాత్రి ఇస్తారు. రాత్రంతా మెలకువతో వుండి పొలాలకు నీళ్ళు పెట్టాలి. పెద్దవాడేమో సినిమాల చుట్టూ, హోటళ్ళచుట్టూ తిరుగుతాడు. వాడికి ఏమాత్రం బాధ్యత లేదు. ఏం వ్యవసాయమో, ఏమో!" అంటూ గొణిగారు. ఉమవైపు తిరిగి, "చూడమ్మా! అప్పటికి నీకింకా పెళ్ళికాలా. అప్పుడోమారు నేను బెంగుళూరుకు వెళ్ళాను. అసెంబ్లీ చూపిస్తాను నాన్నా అంటూ రాజన్న ఆఫీస్‌నించి రాగానే నన్ను తీసుకుపోయాడు. చూశాను. అసెంబ్లీ భవనమంతా విద్యుద్దీపాలతో ధగధగా మెరిసిపోతోంది. ఈ పేదప్రజలు వ్యవసాయానికి కరెంటు చాలక ఊళ్ళల్లో ఇబ్బందులు పడుతోంటే, ఈ దొంగనాయకులు కరెంటును ఇలా తగలెడుతున్నారా అని ఉడికిపోయాను. మాకేమో కరెంటు లేదు అంటారు. వీళ్ళ పిండాకూడు! పదరా ఇంటికి. వీళ్ళ అసెంబ్లీ ఎవడిక్కావాలి అంటూ తిరిగొచ్చాను" అన్నాడు నవ్వుతూ.

అతని మాటలకు రాజన్న తల్లి గలగలా నవ్వింది. ఎప్పుడూ నవ్వడమే ఆమె స్వభావం. మగడు తిట్టినా, మండిపడినా నవ్వుతూనే వుంటుంది. ఎప్పుడూ యంత్రంలా చురుగ్గా పనిచేసుకుపోయే ఆమెకు రెండేళ్ల క్రితం కంటి ఆపరేషన్ జరిగింది. ఫలితం కన్ను సొట్టబోయి ఏ చికిత్సకూ తగ్గలేదు. చివరికి కంటిపాపనే తొలగించాల్సి వచ్చింది. మరో కంటిలో పొర వచ్చేసింది. అది కూడా ఎక్కువైంది. గుడ్డిదానిలా తడుముకుంటుంటే రాజన్నకు "అయ్యో! పాపం" అన్పించి "అమ్మా! ఆ కంటికి ఆపరేషన్ చేయిస్తాను" అన్నాడు. "వద్దురా వద్దు. ఇంకెన్ని రోజులు? ఇలాగే వుండిపోతాను. నన్ను మళ్ళీ ఆ ఆసుపత్రికేసి తీసికెళ్ళకు" అని ముక్తసరిగా తోసిపుచ్చింది.

రాజన్న నాన్నగారికి తొంభైదాటాయి. అప్పుడప్పుడు ఇహ... అయిపోయినట్లే అనేంతవరకు వెళ్ళి మళ్ళీ మామూలు మనిషి అయ్యేవాడు. ఐదారేళ్ళనించి మాత్రం ఆయన ఇప్పుడో, అప్పుడో అన్నట్లు వున్నాడు. ఆరోగ్యం సరిగా వున్నప్పుడు సాయంత్రం ఏడింటికి కూడా కళ్ళద్దాలు లేకుండానే పంచాంగం చదివేవాడు. పాకెట్ డైరీలో లెక్కపక్కలన్నీ చక్కగా రాసుకునేవాడు. ఏదైనా తిని అరిగించుకోగలడు. ఇలాగే ఈ ముసలివాడు నూరేళ్ళు జీవిస్తాడేమో అని ఆశ్చర్యపడేలా వుంటాడు. అయితే తోలుమాత్రం మిగిలి ఎముకల గూడులా మారిపోయిన ఆ దేహంలో గురగురమనే ప్రాణం తప్ప ఏదీలేదు.

రాజన్న తల్లిమాత్రం కంటి ఆపరేషన్ పుణ్యమా అన్నట్టు నానాటికీ అనారోగ్యంపాలవుతోంది. ఎంతో చలాకీగా, చురుగ్గా ఇంటిపనులన్నీ క్షణాల్లో ముగించగల్గిన ఆమె అలా మంచంపట్టి వుండడం చూసి "నాన్నకన్న ముందు అమ్మే పోతుందా ఏం?" అనిపిస్తోంది రాజన్నకు. మొదటినుంచీ అతనికి అమ్మ అంటేనే ఎక్కువ ప్రేమ. చిన్నప్పుడు నాన్న అమ్మపట్ల సరిగా ప్రవర్తించలేదని ఆయనకు కోపం. పైగా పేదరికం. రెండు పూటల తిండికీ కటకటపడే పరిస్థితి. ఆ మధ్య నాన్నకు ఎదిరింటావిడతో సంబంధం కూడా కల్గింది. అమ్మ మౌనంగా రోదించడం తప్ప ఏనాడూ ఎదురుచెప్పలేదు. ఉన్నంతలో సంతృప్తిచెందే స్వభావం ఆమెది. దేనికీ చేతులు చాచని అభిమానవంతురాలు. అందుకే రాజన్నకు అమ్మంటే అంత ఇష్టం.

సరస భోజనాలు వడ్డించింది. ఉమ కంచాలు తీస్తోంటే ససేమిరా వద్దని తనే తీసికడిగింది.

రాజన్న భార్యతో ముందరిగదిలోకి వచ్చాడు. 'ఎన్నిసార్లు చెప్పినా కిటికీలు ఎందుకు మూస్తారో అర్థంకాదు' అని సణుగుతూ కిటికీ రెక్కలు తెరిచాడు. వీళ్ళకోసమనే ఆ గదిని ముందుగానే శుభ్రంచేసి వుంచారు. సరస గదిని చక్కగా వూడ్చిపెట్టింది. రాజన్న పక్క సరిచేశాడు. ఉమ చీర మార్చుకుంటూండగా చిత్ర వచ్చింది. ఉమ విప్పేసిన చీరని శరీరానికి చుట్టుకుంది. "అమ్మా! నానమ్మవాళ్ళు చాలా పేదవాళ్ళా?" అంది పాప.

"లేదమ్మా! ఎందుకు? వాళ్ళూ మనలాగే.." అంది ఉమ.

"మరి నానమ్మ చిరిగిపోయిన చీర కట్టుకుందేం?" అని అడిగింది. ఉమకు ఏం చెప్పాలో తోచలా.

"ఛీ! నా చీరని నాశనం చేస్తున్నావు. పద బయటికి" అంటూ ఆమె చీరని మడతపెట్టసాగింది. వీరి మాటల్ని శ్రద్ధగా వింటోన్న రాజన్న కళ్ళముందు ఒకనాటి అమ్మరూపం కదలాడింది.

"అచ్చం ఆకుపచ్చని, నేరేడు రంగు చీరల్లోనూ, నల్లపైసల మాలతోనూ, ముక్కుకి రెండు పక్కలా ముక్కుపుల్లలతో, వెడల్పాటి కుంకుమ బొట్టుతో, చేతులనిండా నీలవర్ణపు గాజులతో..అమ్మ ముఖం ఎంత కళకళలాడుతూ వుండేది! మరి ఇప్పుడో? నేను ఆమెకు చీర కొనిచ్చి రెండు, మూడేళ్ళు అయ్యాయి అప్పటికే. మరోసారి ఎప్పుడైనా అమ్మకు చీర తీసుకుని పోవాలి" అనుకొన్నాడు.

వదిన చేనుపనినుంచి తిరిగి వచ్చాక పరస్పరం కుశలప్రశ్నలు పూర్తయ్యాయి. అయితే వదిన తన చెవులకు ఎప్పుడూ ధరించే కమ్మలు లేవు. బహుశ అమ్మి వుంటారు అనుకున్నాడు రాజన్న. కమ్మలు లేని ఆమె ముఖం కళావిహీనంగా బోసిగా వుంది.

మర్నాడు భోజనాల తర్వాత రాజన్న భార్యా పిల్లలతో బెంగుళూరుకు ప్రయాణం అవుతోంటే, రెండుమూడు నెలలకు సరిపడా బియ్యం, బెల్లం, చింతపండు, మిరపకాయలు, పప్పులు, ధాన్యాలు...ఇలా ఎన్నో సర్దిపెట్టిన గోనెసంచిని వదినగారు అందించారు. ఇంట్లో పెరిగిన మల్లెచెట్టునుంచి పూలు తెంచి చక్కగా మాల కట్టి ఇచ్చింది సరస చిత్రకోసం. రాజన్న నాన్నగారు కరివేపాకు తెంపి కూరగాయల సంచిలో ఉంచారు. రాజన్న అమ్మ మంచమ్మీంచే "ఏం కావాలన్నా అడుగు తల్లీ! ఏమైనా మరిచావా చూడు...ఇంట్లో ఉన్నప్పుడు అక్కడ డబ్బులు పెట్టి ఎందుకు కొనాలి?

మేం ఉన్నంత వరకూ నువ్వు దేనికీ సంకోచపడవద్దు" అని ఉమతో అంటుంటే, "ఈ మర్యాదల బరువు మోయలేను" అన్నట్టు సిగ్గిల్లింది ఉమ.

రాజన్న ఎప్పటిలా తండ్రికి చిల్లరఖర్చులకని ఇరవై ఐదు రూపాయలు ఇస్తోంటే, "ఒరే బాబూ! ఇప్పటికే పదిహేను రూపాయలు అప్పుచేశాను. మరో ఇరవై ఇవ్వరా" అన్నాడు. రాజన్న మారుమాట్లాడకుండా మరో ఇరవై ఐదు ఇచ్చి, "చాలా నాన్నా?" అన్నాడు. "ఏదో చాల్లే!" అంటూ ఆయన జేబులో పెట్టుకున్నాడు. అమ్మకు కూడా రాజన్న పదిహేను, ఇరవై రూపాయలో ఆమె తమలపాకు ఖర్చులకని ఇచ్చిపోతాడు. ఈసారి కూడా రాజన్న తన పర్సులోంచి ఇరవై రూపాయలు తీసి తల్లిచేతిలో పెట్టినప్పుడు "వద్దయ్యా! నువ్వే ఉంచుకో" అంటూ పడకకింద వున్న తమలపాకుల సంచీ తీస్తూ అందులోంచి మాసిపోయి మెత్తగా తడైపోయిన ఐదు, పది రూపాయల నోట్లు ఒక్కొక్కటే చేతిలో పెట్టింది. రాజన్న గాబరాపడిపోయాడు.

"ఎందుకమ్మా? ఇంత డబ్బు ఎక్కడిది?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

"నాకు నువ్వు తప్ప ఇంకెవరు ఇస్తారు? ఈ డబ్బుతో ఓ చీర కొను. చూడూ.. ఉన్న చీరలన్నీ చిరిగిపోయాయి. నేను కట్టుకున్న చీరను కుట్టడం కష్టమంది సరస" అంటూ చిరిగిపోయిన చీరని రాజన్నకి చూపించింది.

రాజన్న చిరిగి పేలికలైపోయిన తల్లి చీరనీ, రెండు మూడేళ్ళలో తాను తల్లి ఖర్చులకని ఇచ్చిన నోట్లనూ విస్మయంగా చూశాడు. గొంతు పూడుకుపోతోంది. ఊపిరి తీసుకోవడం కష్టమనిపిస్తోంది.

"అమ్మా! ఈ డబ్బు నువ్వే ఉంచుకోమ్మా! వచ్చేవారం మళ్ళీ వస్తాను. తప్పక రెండు చీరలు తెస్తాను" అంటూ నోట్లు తల్లిచేతికి తిరిగి ఇవ్వబోయాడు.

రాజన్న తల్లిమాత్రం......

"నాకెందుకయ్యా రెండు చీరలు. ఒకటే తీసుకురా! అదిచాలు. అసలు అది చినిగేదాకా నేనే వుంటానో లేదో! ఈ డబ్బంతా ఏంచేసుకోవాలి? తీసుకో!" అని మళ్ళీ రాజన్నకే తీసుకోమంది.

రాజన్న ఉక్కిరిబిక్కిరై ఉమకేసి చూశాడు. ఆమె తల వాల్చేసింది. రాజన్న వణుకుతున్న చేతులతో రూపాయల్ని పర్సులో పెట్టుకున్నాడు.

- విపుల

ఇల్లు

కన్నడ మూలం : సి.యస్. ముక్త

మైసూర్‌కి వెళ్ళే బస్సులో కూచున్న శారద బస్ కదలగానే నెమ్మదిగా నిట్టూర్చింది.

రాత్రిపూట బస్ ప్రయాణం చాలా బేజారుగా వుంటుంది అని ఎంతగా మొత్తుకున్నప్పటికీ శంకరయ్య రాత్రి బస్సుకే టికెట్ రిజర్వు చేశాడు. పాపం...శారద ఏం చెయ్యగలుగుతుంది. కిమ్మనకుండా బయలుదేరింది.

"రాత్రి పదిన్నరకి బస్సు బయల్దేరుతుంది. పొద్దుట ఏడు గంటలకల్లా నువ్వు మైసూర్‌లో వుంటావు. నేరుగా అడ్వొకేట్ వైదేహి గారింటికి వెళ్లు. నేను ఆవిడగారితో అన్నీ మాట్లాడాను."

"నారాయణ నేను వెళ్ళకుండా వుంటే బేజారైపోతాడా?" శారద అంది.

"ఎందుకు, బేజారవుతాడమ్మా? నువ్వు వెళ్ళకుండా వుంటే ఓ పూట అన్నం మిగిలిందనుకుంటాడు. మామయ్య బుద్ధి నాకు తెలియనిదా?" పెద్ద కొడుకు ప్రభాకర్ అన్నాడు.

"అమ్మా! ఈసారి నువ్వు మామయ్యమీద కేసు వేసితీరాలి. అంత పెద్ద ఇంటికి ఎంత ఖరీదో నీకేం తెలుసు? ఆ ఇంటిని మామయ్య తన సొంతం చేసుకోవాలనుకుంటున్నాడు. మనమిప్పుడు ఊరుకోకూడదు" చిన్నబ్బాయి ప్రశాంత్ అన్నాడు.

కూతురు ప్రతిభ కూడా ఈ విషయంలో తలదూర్చింది.

"అమ్మా! ఇల్లు నీ పేరుమీద వుంది. మామయ్య ఆ ఇల్లు విడిచిపెట్టను అంటే అమ్మేసే ప్రయత్నం చెయ్యి. లక్షలొస్తాయి".

"ఏది ఏమైనా నేను ఆ ఇల్లు అమ్మను" కుండబద్దలు కొట్టినట్లు అంది శారద.

బస్సు ఎక్కిస్తున్నప్పుడు కూడా శంకరయ్య భార్య చెవిలో ఊదడం మరిచిపోలేదు.

"చూడు శారదా! నువ్వు ఈసారి ఏదో ఒక ఏర్పాటు చేసే రావాలి. లేకపోతే నేను చాలా చెడ్డవాణ్ణి కావల్సి వస్తుంది".

బస్సు బయల్దేరగానే శాలువాను బిగుతుగా కప్పుకొని సీటుకి ఒరిగి కళ్లు మూసుకుంది శారద. కానీ నిద్ర రాలేదు. మనస్సు మైసూర్లోని ఇంటి గురించి ఆలోచించసాగింది.

పోస్టాఫీసుకి దగ్గర్లో ఓ పెద్ద కాంపౌండులో ఆ ఇల్లు వుంది. ఆ ఇంటికి వెనకభాగంలో ఒక గది ఔట్‌హౌస్‌గా వుంది. శారద నాన్న లాయర్ శ్యాంరావ్ విపరీతంగా సంపాదించారు. అతనికి ఇద్దరే పిల్లలు. పెద్దవాడు నారాయణ. అతని తదనంతరం శారద. శ్యాంరావ్ హఠాత్తుగా గుండెపోటు వల్ల మరణించినప్పుడు అనసూయమ్మగారికి ఏ దిక్కూ తోచలేదు. కాని ఆవిడ ధైర్యస్థురాలు. కొడుకుని 'లా' చదివించింది. నారాయణ తండ్రి పేరు కాపాడాడు. శారద పి.యు.సి.లో వున్నప్పుడు ఔట్‌హౌస్‌లో వుంటోన్న వారాలబ్బాయి శంకర్‌తో పరిచయం ఏర్పడింది. అప్పుడతను బి.ఇడి చదువుతున్నాడు. అతని రూపం, తెలివితేటలు, ఆకర్షణీయమైన మాట తీరు, వీటిపట్ల శారద మొగ్గుచూపింది. శంకర్ బి.ఇడి ముగించి దావణగెరె ప్రైవేట్ పాఠశాలలో పనిచేయసాగాడు. అనసూయమ్మ కూతురి కోరికకి ఆటంకం కల్గించకుండా తానే ముందుండి శారద పెళ్ళి చేసింది.

ప్రభాకర్ పుట్టేంతవరకూ అంతా సవ్యంగానే జరిగింది. శారద తనకన్న అదృష్టవంతురాలు మరొకరు లేరని గర్వంగా వుండేది. ప్రియమైన భర్త, ముత్యంలాంటి కొడుకు, తనని ప్రాణంకన్న మిన్నగా చూసుకునే అన్న, తన కలలు కల్లలు కావని మురిసిపోయే ముసలి తల్లి...ఒక స్త్రీ సుఖంగా వుంటానికి ఇంకా ఏం కావాలి?" అన్నట్లుగా వుండేది. దసరా వేసవి సెలవులు రాగానే శారద సంసారసమేతంగా అన్నయ్య సన్నిధిలో వాలిపోయేది.

ఆమె రెండో కాన్పుకి వచ్చినప్పుడు ఆమె కుటుంబంలో అపశ్రుతులు మొదలయ్యాయి. పేకాటకి దాసానుదాసుడైన శంకర్ ఒళ్లు తెలీకుండా అప్పులు చేసి ఎవరికీ చెప్పా పెట్టకుండా ఊరొదిలి వెళ్ళిపోయాడు. పచ్చిబాలెంతరాలు శారద ఏం చేయాలో పాలుపోక ఏడ్చింది. నారాయణ చెల్లికి ఊరట కల్గించాడు. ధైర్యం చెప్పాడు.

"ఎందుకమ్మా ఏడుస్తావు? మేమంతా నీతోపాటు లేమా? నేను నిన్ను వదిలేస్తానా? ధైర్యం తెచ్చుకో! నువ్విలా అధైర్యపడితే పిల్లలగతి ఏమవుతుంది?" అన్నాడు.

శారద ధైర్యం తెచ్చుకుని అన్న బలవంతం మీద పనిలో చేరింది. ఓ ప్రైవేటు కంపెనీలో గుమాస్తాపని. తల్లి ప్రోత్సాహంతో ప్రైవేటుగా బి.ఏ. చేసింది. ఆమె అన్న చాలా మంచి మనిషి. కాని ఆమె వదిన పంకజం నోరు చాలా గడుసు. తల్లి వద్దంటున్నా వెనక వున్న ఔటుహౌస్‌లోకి తన కాపురాన్ని మార్పించింది. అనసూయమ్మ వుండడంవల్ల శారదకి తన పిల్లల్ని చూసుకోవడం ఏమంత కష్టం అనిపించలేదు. వేరే ఇంటిలో వాళ్లున్నప్పటికీ పండగలు, పబ్బాల్లో అన్నగారింటికే వెళ్ళేది. అన్నకి ముగ్గురు ఆడపిల్లలు. వదిన కొన్నిసార్లు అడ్డుపుల్లలు వేస్తున్నా, అన్నాచెల్లెళ్ళ అనుబంధం మధురంగానే వుండేది.

ఈ సమయంలోనే అనసూయమ్మ ఆరోగ్యం పూర్తిగా పాడయింది. ఆమె కొడుకుతో ఇంటి గురించి మాట్లాడింది. నారాయణ స్పష్టంగానే తన అభిప్రాయాన్ని.

"అమ్మా! ఇది నాన్నగారి స్వార్జితం. రెండు ఇళ్ళూ నీ పేరున ఉన్నాయి. ఓ ఇల్లు నాకు రాయి. మరోటి శారదకి రాసివ్వు" అని చెప్పాడు.

"నేనూ అలాగే అనుకుంటున్నాను నాన్నా! పెద్ద ఇల్లు నీ పేరున రాసి, ఔట్ హౌస్ శారద పేరుమీద రాస్తాను".

"వద్దమ్మా! దేవుడు నాకు చాలినంత ఇచ్చాడు. సంపాదన బావుంది. కాని శారద అదృష్టం బాగోలేదు. పెద్దింటిని శారద పేరుమీదే రాయి. ఔట్‌హౌస్ నాకు చాలు" కాని శారద ఒప్పుకోలేదు.

"వద్దన్నయ్యా! కాలం ఒకే తీరుగా వుండదు. నాకున్నది ఇద్దరే పిల్లలు. నీకు ముగ్గురు ఆడపిల్లలున్నారు. వాళ్ళ చదువులకీ, పెళ్ళిళ్లకీ చాలా డబ్బు కావాలి".

"నీకేమీ తెలీదు శారదా! పెద్ద ఇల్లు నీ పేరుమీదే వుండనీ. నేనక్కడే వుంటాను. నువ్వు ఆ చిన్న ఇంట్లోనే వుండు. కాని దీన్ని ఇప్పుడే ఎవరికీ చెప్పకూడదు".

అనసూయమ్మకి ధర్మరాజులాంటి కొడుకుని చూసి హృదయం పొంగిపోయింది. ఆమె అతని సలహా ప్రకారం వీలునామా రాసి నిదానంగా కళ్లు మూసింది. ప్రశాంత్‌కి ఎనిమిదేళ్లు నడుస్తున్నప్పుడు శంకర్ తిరిగి వచ్చాడు. శారద అతనితో మాట్లాడ్డానిక్కూడా నిరాకరించింది.

"శారదా! నువ్వు చేస్తున్నది తప్పమ్మా! బుద్ధి గడ్డితిని చేయకూడదనిది చేసినప్పటికీ పశ్చాత్తాపపడి తిరిగి వచ్చేశాడు. నువ్వు శంకర్‌ని క్షమించి వదిలెయ్. నేనతనికి ఇక్కడే ఎక్కడైనా పని ఇప్పిస్తాను. నెమ్మదిగా వుండు" అన్నాడు నారాయణ.

"తను లేకుండా నేను బతగ్గలను అన్నయ్యా! అతన్ని క్షమించడానికి నా మనస్సు ససేమిరా అంటోంది".

"తండ్రినించి పిల్లల్ని దూరం చేయడానికి నీకు ఏ హక్కూ లేదు చెల్లీ! పిల్లలకోసం అతణ్ణి మన్నించు".

శారద మగణ్ణి దబాయించింది.

"చీట్లపేకకి మరిగి మమ్మల్ని నట్టేటిలో వదిలేసి వెళ్ళిపోయారుకదా. నా గురించీ, పిల్లల గురించీ ఏనాడైనా ఆలోచించారా? మా అన్నయ్య నన్ను పోషించకుంటే నేనీ పాటికి ఏ బావినో, చెరువునో చూసుకుని వుండేదాన్ని".

ఎవరు ఎన్ని అన్నప్పటికీ శంకర్ స్థితప్రజ్ఞుడిలా వుండిపోయాడు. శారద అన్నగారి కోసం మగణ్ణి క్షమించింది. అతనికి పని దొరకడం అనుకున్నంత సులభంగా ఏమీ లేదు. పైగా ముప్పూటలూ ఇంట్లో తిష్టవేసుక్కూచున్నాడు. పంకజం తన ఆడపడుచు మగణ్ణి ఏదోరకంగా మాటల ఈటెలతో గుచ్చుతోనే వుంది. శారద ఎవరినీ ఏమీ అనలేక కుమిలిపోయింది. నారాయణకి చెల్లిశోకం అర్థమౌతూనే వుంది.

అతనోసారి బావగార్ని "దావణగెరెకి వెళ్తారా?" అన్నాడు.

"నాకు అక్కడ పని ఎవరిస్తారు?" అన్నాడాయన.

"నేను కనుక్కొన్నాను. శంకర్‌కి అతను మొదట పనిచేసిన స్కూల్లోనే పని ఇస్తారుట. 30,000 రూపాయలు ఇవ్వాలట. పైగా సీనియారిటీ వుండదన్నాడు."

"నేను ముప్పైవేల రూపాయలు ఎక్కణ్ణించి తీసుకొస్తానన్నయ్యా?" అంది శారద.

"నేనిస్తానమ్మా! నీకు వీలున్నప్పుడు తీర్చు అథవా నీవు తీర్చలేకపోయినా విచారం లేదు. ఆ మాత్రం నీకోసం చేయలేకపోతే ఎలా?

"అలా కాదన్నయ్యా. నీ ఋణం నేనెలా తీర్చాలి?"

"మనమధ్య ఋణం మాట ఎందుకమ్మా?" అన్నాడు నారాయణ.

నారాయణ ప్రయత్నంతో శంకర్‌కి మళ్ళీ అతని పాత పాఠశాలలోనే ఉద్యోగం వచ్చింది. దావణగెరెకి వచ్చిన సంవత్సరంలోనే ప్రతిభ పుట్టింది. ఉద్యోగం చేసి అలవాటు పడిన శారదకి ఇంట్లో ఊరికే కూచోవడానికి విసుగ్గా ఉంది. ఆమె కాస్త పెట్టుబడి పెట్టి శారదా హోం ఇండస్ట్రీస్ ప్రారంభించింది. అప్పడాలు, పచ్చళ్ళు, సాంబారు పొడి, వీటితో ప్రారంభమైన హోం ఇండస్ట్రీస్ ఇప్పుడెంతో పేరు తెచ్చుకుంది. అనేక రకాల హాట్, స్వీటు ఆహార పదార్థాల్ని తయారుచేయించి హోటళ్లకీ, కొట్లకీ సరఫరా చేస్తోంది. వందమందికి తిండి కల్పించే ఏర్పాట్లు చేసింది. పాఠశాల, కళాశాల, కార్యాలయాల్లో జరిగే పార్టీలకి, విహారయాత్రలకి వాళ్ళడిగిన ఆహార పదార్థాల్ని తయారుచేసి పంపిస్తోంది.

ప్రభాకర్ పి.యు.సి. దాటలేక తల్లికి సహాయంగా వుంటున్నాడు. ప్రశాంత్ ఇంజనీరింగ్ ముగించి ఫలితాలకోసం చూస్తున్నాడు. ప్రతిభకి పెళ్ళయింది. శంకరయ్య రిటైరై నాలుగేళ్ళు గడిచాయి.దావణగెరెలో రెండిళ్లు కొన్నారు. మరో ఇల్లు కొనబోతున్నారు.

మైసూరులోనే ఉన్న నారాయణకు కాలం కలిసిరాలేదు. తన పిల్లల్లో ఎవరో ఒకరిని చెల్లి కొడుక్కి ఇవ్వాలనే కల కలగానే వుండి పోయింది. శారద ఒప్పుకొన్నా శంకర్ ఒప్పుకోలేదు.

"ఆ పిల్లలు అందంగా లేరు. వద్దు" అన్నాడు. పైగా ప్రభాకర్ "నేనిప్పుడే పెళ్ళి చేసుకోను" అని మొండికేశాడు. ధర్మరాజు లాంటి నారాయణ సంపాదన తగ్గుముఖం పట్టింది. ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయడంతో అతని సంపాదన హరించుకుపోయింది. చిన్నమ్మాయి రోహిణి బ్యాంకులో ఉద్యోగం చేస్తోంది. వాళ్ళకున్న ఆస్తి అంతా ఆ చిన్న ఇల్లు ఒక్కటే.

శంకరయ్య రెండేళ్ళనుంచి భార్యని బలవంత పెడుతున్నాడు.

"మనమూ మైసూరుకి వెళ్ళి అక్కడ ఆ ఇంట్లో ఎలానూ వుండలేం. ఆ ఇల్లు అమ్మేయాలి".

"మా తండ్రి సంపాదించిన ఏకైక ఆస్తి అది. ఇల్లు అన్నగారిది. మనం ఎలా అమ్మగలం?" శారద అబద్ధమాడింది.

"నువ్వు కథలు చెప్పకు. పెద్ద ఇల్లు నీ పేరున వుందనేది నాకు తెలుసు. మీ అన్న ఇప్పటివరకూ మనకి ఒక్కపైసా కూడా ఇవ్వకుండా ఆ ఇంట్లో వున్నాడు. మన ప్రశాంత్ వెళ్ళినప్పుడు చూసొచ్చాడు. పెద్ద ఇంటికి పార్టీషన్ చేసి అద్దెకిచ్చాడట.!"

"నేను చెప్పాకే అతనలా చేశాడు. ఇల్లు అతనికే వదిలేద్దాంలెండి. మనకి ఆ ఔటు హౌస్ చాలు. ఎలాగోలా దాన్నించి కూడా మనకి నెలకి వెయ్యి రూపాయల అద్దె వస్తోందికదా!"

కాని శంకరయ్య ఒప్పుకోలేదు. పిల్లలూ తండ్రికి వంత పాడారు.

"ఆ ఇల్లు మనది. అది మనకే దక్కాలి. మనం ఆ ఇంటిని అమ్మేద్దాం".

"మీరెంతగా తాపత్రయపడుతున్నప్పటికీ నేను ఆ ఇంటిని అమ్మనుగాక అమ్మను" అంది శారద.

"అలాగయితే మీ అన్నని అద్దె అడుగు. ఇప్పుడు ఆ ఇంటికి ఎంతకాదన్నా మూడు వేల అద్దె వస్తుంది".

"మంచిది. నాకు తీరిక దొరికినప్పుడు అక్కడికి వెళ్ళి మాట్లాడుతాను" అందిశారద.

అయితే ఆమెకి తీరిక ఎక్కడ? "శారదా హోం ఇండస్ట్రీస్' సమస్త బాధ్యతా ఆమెదే. భర్త ఈ విషయంలో తలదూర్చడానికి ఆమె అవకాశమే ఇవ్వలేదు. శంకరయ్య రిటైరైనప్పుడు వచ్చిన డబ్బు కూడా ఆమెకు ముట్టలేదు. "నువ్వు నీకు ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేసుకో! నాకు ఆ డబ్బులు వద్దు" అంది.

"ఎందుకలా అంటున్నావ్?"

"నా సంపాదన బ్రహ్మాండంగా వున్నప్పుడు మీ డబ్బుల అవసరం దేనికి? సైటు తీసుకోండి. పిల్లలకైనా వుంటుంది" అంది.

తన సంపాదనతోనే తన ఇంటిమీద ఒక పెద్ద హాలు. పెద్ద వంటిల్లు, స్నానాల గది... అన్నీ కట్టించింది. రోజూ ఆరుగురు వంట మనుషులు వచ్చి పనులు చేస్తున్నారు. వంద క్యారియర్ల భోజనం బయటకు వెళుతోంది. ఎవరికీ మెస్‌లో వడ్డించే ఏర్పాట్లు పెట్టుకోలేదు. శారద మరీ ఆత్మీయులైన ఇద్దరికి ఇంటినించి భోజనం పంపిస్తోంది.

పెద్దబ్బాయి ప్రభాకర్ సాయం చేయడం ప్రారంభించిన దగ్గర్నించి ప్రతినెలా అతని పేరున మూడువేల రూపాయలు బ్యాంకులో వేయడం మొదలుపెట్టింది. కూతురికి చాలినంత ఇచ్చి పెళ్ళి చేసింది. శారదకి ఎవరికీ లెక్కలు అప్పగించే అవసరం లేదు.

ఆమె పేరుమీద సుమారు పది లక్షల రూపాయలున్నాయి. అన్నయ్య తనకి కష్ట సమయాల్లో చేసిన సహాయాన్ని ఆమె మరిచిపోలేదు.

భార్య అద్దె విషయం కదపడానికి మైసూరుకి వెళ్ళాలన్న ఆలోచనే చేయకపోయేసరికి, శంకరయ్య నారాయణకి సుదీర్ఘమైన ఉత్తరం రాసి అద్దె అడిగాడు. నారాయణ ఆ నెల రెండువేల రూపాయల్ని చెల్లి పేర పంపించి తాను అంతకన్నా ఎక్కువ ఇవ్వలేకపోయినందుకు విచారిస్తూ ఉత్తరం రాశాడు. అది చదివిన శారద భోరున విలపించింది. ఆమె నాల్గురోజులు తీరిక చేసుకుని మైసూర్‌కి వెళ్ళి వచ్చింది. అన్నయ్య ఆరోగ్యం సరిగా లేదు. వదిన 'కిరికిరి' ఎక్కువైంది. చిన్నమ్మాయి పెళ్ళై వెళ్ళిపోతే మా గతేం కావాలి అనే విచారం వాళ్ళని బాధిస్తోంది. శారద అన్నగారికి ఓ లక్ష రూపాయలిచ్చి...

"నువ్వు నాకు చేసిన ఉపకారానికి వెల కట్టలేను అన్నయ్యా! ఇది నా సంపాదన. నువ్వు చక్కగా మందులు వాడు' అంది.

భార్య అద్దె విషయంలో ఎలాంటి ఏర్పాట్లూ చేసి రాకపోవడంతో శంకరయ్య ధుమధుమలాడాడు.

"మీ అన్నని ఇల్లు ఖాళీ చేయమని ఎందుకు చెప్పి రాలేదు?" అని అడిగాడు.

"అతని స్థితి చూశాక నాకలా చెప్పడానికి మనస్సు రాలేదు" అంది.

"అద్దె సరిగా పంపమని చెప్పొచ్చావా లేదా?"

"ఊహూ....చెప్పలేదు. ఇంకా పదిజన్మలు ఎత్తినా నేనతని ఋణం తీర్చుకోలేను. నేనతణ్ణి అద్దె అడగలేను".

"మరేం అడగ్గలవ్"?

"కొంతమందిని కొన్ని అడగలేమండీ! అలా అడగాల్సివస్తే మిమ్మల్నే నేనూ, మా అన్నయ్యా సవాలక్ష ప్రశ్నలు అడగాలి".

శంకరయ్య ముఖం పాలిపోయింది. తన మాట నడవడంలేదని తెలిసి తన పిల్లల్ని ఉసిగొలిపాడు. పెద్దవాడైన ప్రభాకర్‌కి మామయ్య గురించి సదభిప్రాయం లేకున్నప్పటికి, తల్లిని ఎదిరించే ధైర్యం లేదు. తల్లి తనని వదిలేస్తే... ఈ విధంగా సుఖంగా బతకడం కష్టమని అతనికి బాగా తెలుసు.

ప్రశాంత్ మాత్రం అప్పుడప్పుడు బాగా జోరుగా మాట్లాడుతున్నాడు. ఓసారి అతను తల్లితో స్పష్టంగా చెప్పాడు.

"నేను బి.ఇ. ముగించాక ప్రైవేటుగా ఏదైనా ప్రారంభిస్తాను. నాకు నాలుగైదు లక్షలు చాలు. నువ్వు మైసూర్లో వున్న ఇంటిని అమ్మాలి" అన్నాడు.

"నిన్ను చదివించడం నా కర్తవ్యం. చదవడమే అంటే ఎం.ఇ. చేయాలంటే చేయి. మరో రెండేళ్ళపాటు చదివిస్తాను. ఆ తర్వాత ఉద్యోగంలో చేరి డబ్బులు సంపాదించి బిజినెస్ చేసుకో! ఎవరు వద్దంటారు?" అంది.

"అలాగయితే నువ్వు డబ్బులివ్వవా?"

"డబ్బులివ్వమని అడుగు. నావల్ల అయినంత ఇస్తాను. కాని ఇల్లమ్మి ఇవ్వమని అడగొద్దు. ఆ హక్కు నీకు లేదు" అంది శారద.

ప్రశాంత్ ముఖం కందగడ్డలా మారిపోయింది. లక్షలాది విలువ చేసే ఇల్లు తమ చేజారిపోతుందికదా అని పిల్లలకి బాధగా వుంది. ప్రతి రోజు ఏదో ఒక కారణంతో ఈ విషయంలో గొడవ జరుగుతూనే ఉంది.

మరో సంవత్సరం గడిచింది. అన్నగారికి ఆత్మీయులైన సుబ్బన్న శారదని చూద్దానికొచ్చాడు. అతని ద్వారా ఆమెకి అన్నయ్య పరిస్థితి పూర్తిగా అర్థమైంది.

"రోహిణి బాగా జోరుగా మాట్లాడుతోందమ్మా! తల్లిదండ్రుల్ని బాగా ఇబ్బంది పెడుతోంది. తల్లిదండ్రులు తన పెళ్ళి చేస్తారో లేదో అని భయపడుతోంది. వాళ్ళ బ్యాంకులోనే పనిచేస్తోన్న ఓ అబ్బాయితో చెట్టపట్టాలేసుకొని తిరుగుతోంది. అతణ్ణే పెళ్ళిచేసుకుంటుందని అంతా అనుకుంటున్నారు".

శారద ఏమని జవాబు చెప్పగలుగుతుంది? తన ఇంటివాళ్ళ ఇబ్బందులూ పెరిగిపోయి ఆమె మైసూర్‌కి బయల్దేరింది. ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఉపదేశాలు, సందేశాలూ ఇచ్చారు. శంకరయ్యది ఒకే మొండిపట్టు.

"నువ్వు ఇల్లు ఖాళీ చేయించు. చేయక పోతే కేస్ వెయ్యి".

"వాళ్ళు ఏంచెప్పినా వినొద్దమ్మా! ఆ ఇల్లు మనది కావాలి. వాళ్ళని ఆ చిన్న ఇంట్లో వుండమని చెప్పు. పెద్ద ఇంటిని మనం దేనికైనా వాడుకోవచ్చు. ఆఫీస్‌కో, బ్యాంకుకో ఇస్తే నెలకి ఐదువేల అద్దె ఖచ్చితంగా వస్తుంది" అన్నాడు ప్రభాకర్.

"అమ్మా! ఆ ఇల్లు నీ చేతికొస్తే నాకు ఓ లక్ష రూపాయలు ఇవ్వాలి సుమా!" అంది కూతురు.

"అన్నయ్య దుస్థితి తెలిసి తెలిసీ అతని మీద కేసు ఎలా వేయడం? రక్తం పంచుకుని పుట్టిన అతని మనస్సుని ఎలా నొప్పించడం? నా శరీరంలోని రక్తం నీళ్ళుగా మారిపోయిందా? నేను ఏ మొహం పెట్టుకొని అన్నయ్యని ఇల్లు ఖాళీ చేయమని చెప్పడం" ఆమె మనస్సు మనస్సులో లేదు. ఆలోచిస్తూనే వుంది.

తాను ఎలాంటి ఏర్పాట్లూ చేయకుండా ఇంటికి వెళితే... భర్త, పిల్లల కోపానికి గురి కావాల్సి వస్తుంది. ఆమె మనస్సు సందిగ్ధంలో పడిపోయింది.

* * *

భార్య మైసూర్ వెళ్ళి పది రోజులైనప్పటికీ శంకరయ్యకి ఏ సమాచారమూ అందలేదు. శారద లేక ఇల్లు బోసిపోయింది. ప్రభాకర్‌కి హోం ఇండస్ట్రీస్ పనుల్ని నిర్వహించగలిగిన సామర్థ్యం లేదు. తల్లి వున్నప్పుడు ఆమె చెప్పిన పనులు చేసేవాడు. భార్య లేక పోవడంతో వంటమనుషులు మహా హుషారైపోయారు. పనిమనుషుల నోరు ఊరైపోయింది. కొట్టు హోటల్ మొదలైనవాటి నించి వచ్చిన ఆఫర్లు నిర్వహించలేక ప్రభాకర్ అలసిపోయాడు.

శారద తనకు ఎన్ని పనులున్నప్పటికీ భర్త బాగోగుల్ని గమనించేది. తానే వుండి భర్తకి తిండి, కాఫీ ఏర్పాట్లు చేసేది. అతనికి ఇష్టమైన పేపర్స్ తెప్పించేది. అయితే ఇప్పుడు తనని గమనించేవాళ్ళు లేక శంకరయ్య అనాథైపోయాడు. శారద లేని ఇల్లు ఇల్లులానే లేదు.

శారదనుండి సమాచారం రాకపోయేసరికి శంకరయ్య అడ్వొకేట్ వైదేహికి ఫోన్ చేశాడు. ఆమె తన దగ్గరికి శారద రాలేదని చెప్పేసరికి శంకరయ్యకి శంకలు పెరిగిపోయాయి. నారాయణ ఇంటికి ఫోన్ లేదు కనుక కాంటాక్టు చేయలేకపోయాడు.

"ప్రభాకర్! ఇవాళ్టి పోస్టు చూసి రేపు మైసూరు బయల్దేరు" అన్నాడు శంకరయ్య.

ఆ రోజు పగటి పోస్టులో శారద రాసిన ఉత్తరం వచ్చింది.

ప్రియమైన మీ అందరికీ నమస్కారాలు.

నా మౌనాన్ని చూసి మీరంతా ఆశ్చర్యపోయి వుంటారు. ఇక్కడి పరిస్థితులు చూశాక నేను స్వతంత్రించి కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. అన్నా వదినలు అత్యంత దయనీయస్థితిలో వున్నారు. రోహిణి తనకిష్టమైన అబ్బాయిని పెళ్ళిచేసుకోవడమే కాకుండా కలకత్తాకి బదిలీ చేయించుకుని వెళ్ళిపోయింది. అన్నయ్యకి ఏ రకమైన సంపాదనా లేదు. ఆరోగ్యం పూర్తిగా పాడైంది. మందులు కొనుక్కొనే స్థితి కూడా

లేదు. అన్నయ్య నా కష్టాల్లో కొండంత అండగా వుండి నా కాళ్ళమీద నేను నించునే స్థితిని కల్పించాడు. అతని కష్టాల్లో పాలుపంచుకోవడం నా కనీస ధర్మం. మీ అందరి అభీష్టానికి వ్యతిరేకంగా నేను నా ఇంటిని అన్నయ్య పేరుమీద రాశాను. మేం ముగ్గురం చిన్న ఇంట్లో వుంటూ పెద్ద ఇంటిని అద్దెకిచ్చే నిర్ణయానికొచ్చాం. భార్యగానూ, తల్లిగానూ నా కర్తవ్యం నిర్వర్తించాను. చెల్లిగా నా బాధ్యత నెరవేర్చాల్సి వుంది. అక్కడి ఆస్తిపాస్తులు మీవి. పిల్లలకి ఊరట కల్గించండి.

మీ శారద

ఉత్తరం చదివి ఒక్కక్షణం బిత్తరపోయాడు శంకరయ్య. శారద లేని ఇల్లు శూన్యంగా వుంది. ఈ ఆస్తిపాస్తులు, నగలూ, నాణేలూ వీటన్నింటికి మించి తన శారద వెలకట్టలేని రత్నం అనిపించి శంకరయ్య గొంతు రుద్ధమైపోయింది.

"ప్రభాకర్! రేపే వెళ్ళి మీ అమ్మనీ, మామయ్య, అత్తయ్యలను తీసుకొని రా. ఇకముందు వాళ్ళంతా ఇక్కడే వుంటారు" అన్నాడు.

తండ్రి మాటలు అర్థంకానట్లు పిల్లలు శిలాప్రతిమల్లా అలా నించునే వుండిపోయారు.

– విపుల జూన్ 1998

ఫోనుకు అవతలి వైపు వ్యక్తి

బెంగాలీ మూలం : గౌర్ బైరాగి

గడియారంలో పదకొండూ ఐదు అవుతున్నప్పుడు ఫోను మోగింది. నలువైపులా భీకర నిశ్శబ్దం. రమాకాంత్ సర్కార్ ఆశ్చర్యపోయాడు. ఈ ఇంట్లో ఈ సమయంలో ఎలాంటి ఫోనూ వచ్చే అవకాశం లేదు. ఏనాడూ రాలేదు కూడాను. ఈ మధ్య కొన్నాళ్లుగా పగటివేళ కూడా ఫోన్ రావడం లేదు.

బయట వర్షంతో పాటు విపరీతమైన గాలి. రోడ్డుపై ఒక్క పురుగూ లేదు. అలక వంటగదిలో ఉంది. బహుశా ఇప్పుడు పాలు వేడి చేస్తూ వుంటుంది. రాత్రి భోజనం అయ్యాక రెండు గ్లాసుల పాలు ఇద్దరికీ తయారు చేస్తుంది. ఆమె దగ్గర్లో ఉంటే ఫోన్ తప్పక ఎత్తి వుండేది! ఫోన్ మోగుతూనే ఉంది. మరో మార్గం లేదు. సోఫాలోంచి రమాకాంత్ సర్కార్ లేచాడు.

"హల్లో!" అన్నాడు.

అవతలివైపు నుండి "మాట్లాడుతున్నది రమాకాంత్ సర్కార్‌గారేనా?" అన్న గొంతు వినిపించింది.

"ఔను"

"నేను తపన్ కిరణ్ణండీ! తపన్ కిరణ్ ఛటర్జీని!"

అవాక్కయ్యాడు. తపన్‌కిరణ్ ఛటర్జీ ఎవరు? తనకు తెలిసిన మనిషా...కాదే.కాస్త

విసుక్కున్నాడు. ఈ సమయంలో ఫోన్ చేసేవాళ్లు ఎవరై ఉంటారు? ప్రత్యేకించి ఇలాంటి సమయంలో.

తెరిచిన కిటికీలోంచి బయటి పరిసరాలు కన్పిస్తున్నాయి. కొంత ఆకాశం కూడా కన్పిస్తున్నది. చీకట్లో కూడా ముద్దలు ముద్దలుగా మేఘాలు కనిపిస్తున్నాయి. మధ్య మధ్య కాస్త వర్షం పడుతున్నది. వీధి దీపం తాలూకు పసుపు పచ్చని హాలోజన్ వెలుతురులో వర్షం కలిసిపోయింది. బయట రోడ్డుమీద ఒక్క మానవుడూ లేడు. తోటలోని చెట్టూ చేమా నిశ్శబ్దంగా తడిసిపోతున్నాయి.

అలక వంటగదిలో వుంది. ఆమెకి ఈ ఫోన్ చప్పుడు వినిపించిందా? వినిపిస్తే తప్పకుండా కోపానికొస్తుంది. ఫోన్‌కి వేళాపాళా లేదా ఏం? ఇంత రాత్రి ఎవరు చేశారు? ఎవరికి అంత అవసరం? ఫోన్ శబ్దం వినిపించి వుంటే కనుసైగతోనే కట్ చేయండని ఈ పాటికే చెప్పి వుండేది.

అవతలి వైపునుండి "హలో!" అంటూ తన ఉనికిని గుర్తుచేశారు ఎవరో. ఎవరో ఏంటి? తపన్ కిరణ్ ఛటర్జీ కదూ! రమాకాంత్ తన మనసులో నిక్షిప్తమైన జ్ఞాపకాలని కెలుక్కున్నాడు. ఊహూ..ఆ పేరుతో ఎవరూ తనకి పరిచయం లేరు. రాంగ్ నంబర్ అంటూ ఫోన్ కట్ చేయవచ్చు. కానీ అవతలి వ్యక్తి తన పేరుని అంత ఖచ్చితంగా చెప్పాడంటే తను అతడ్ని గుర్తుపట్టలేకున్నా అతను తనని గుర్తుపట్టాడని కదా. ఆ వ్యక్తికి తనతో ఏదో పనివుండి ఉంటుంది. ఎలాగోలా గొంతును కూడదీసుకొని "నేను మిమ్మల్ని గుర్తుపట్టలేకపోతున్నాను" అన్నాడు రమాకాంత్.

బదులుగా అవతలి వైపునుండి చిరుదరహాసం వినిపించింది. ఆ తర్వాత "నేనూ మిమ్మల్ని గుర్తుపట్టలేను. ఇంతకు ముందు ఎన్నడూ చూళ్లేదు కూడా. కేవలం నా అవసరం కోసం మిమ్మల్ని కాస్త విసిగిస్తున్నాను" అన్నాడు.

రమాకాంత్ సర్కార్‌కి కోపం నషాళానికి అంటింది. అవతలి వ్యక్తికి సాహసానికేమీ కొదవ ఉన్నట్టులేదు. అపరిచితుణ్ణి అయిన తనను విసిగిస్తున్నాననే విషయం ఎంత సునాయాసంగా చెప్పాడతను. పైగా రాత్రి పదకొండింటికి డిస్టర్బు చేయడం. లోన్ ఇస్తామంటూ బ్యాంకుల నుండి ఫోన్లు రావడం మామూలే. మరికొన్ని ఫోన్లు మధ్యతరగతి జనాలకి ఆశలు గొలిపే డిపాజిట్ స్కీము తాలూకు. అయితే ఆ ఫోన్లు అన్నీ పగటిపూటే వస్తుంటాయి. ఫోన్ చేసే వాళ్లు ఇరవైయో, ఇరవై రెండేళ్ల వాళ్లో అయ్యుంటారు.

అప్పుడప్పుడు అబ్బాయిలూ, ఇప్పుడిప్పుడు అమ్మాయిలూ మహా తీయటి గొంతులతో మాట్లాడతారు. అయితే రమాకాంత్ వాళ్లని పూర్తిగా మాట్లాడనివ్వడు. కాస్త అవకాశమిస్తే చాలు వాళ్లు వదలరు 'నాకిలాంటి స్కీములంటే ఆసక్తి లేదు' అని టక్కున ఫోన్ పెట్టేస్తాడు.

ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చు. కానీ చేయలేకపోయాడు. ప్రత్యేకించి సమస్త ప్రపంచం వర్షంలో తడిసిపోతున్న ఈ సమయంలో ఆ పని చేయలేకపోయాడు. ఆకాశంలో మెరుపులు మెరుస్తున్నాయి. అతని గొంతుని బట్టి వయస్సు డెబ్బైకి తక్కువ కాకపోవచ్చు అనిపించింది. అందుకే నిష్ఠూరంగా మాట్లాడలేకపోయాడు రమాకాంత్.

"నాతో మీకేం పని?" లోగొంతుకతో అడిగాడు రమాకాంత్. అలా ప్రశ్నించాడో లేదో అవతలి మనిషి నవ్వు గొంతుతో "మీ వయస్సు అరవైకి మించి వుండవచ్చని నా అంచనా. మీకు భార్య వుండి వుంటే మీరిద్దరూ ఒంటరి ద్వీపాల్లా మీరు కట్టుకున్న మీ పాత సొంత ఇంట్లో కాలం గడుపుతూ వుంటారు" అన్నాడు.

మరోసారి రమాకాంత్ అవాక్కయ్యాడు. అవతలి వ్యక్తికి తను ఎవరో తెలీదు. అయినా తన వయస్సు అరవై దాటి వుండొచ్చని అంచనా వేశాడు. ఈ ఇంట్లో మేమిద్దరమే ఉంటామని అతని ఊహించడంలో పెద్ద ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ ఇద్దరమూ ఒంటరి ద్వీపాల్లా బతుకుతున్నామని అతనికెలా తెలుసు? పైగా ఈ ఇల్లు తమ సొంతమే! అందులోనూ పాత ఇల్లే!! ఇంత ఖచ్చితంగా ఇలా అంచనా వేయగలిగాడు?

రమాకాంత్ ఆలోచనల్లో మునిగివుండగానే తపన్ కిరణ్ "ఇవన్నీ తెలుసుకోవడం పెద్ద కష్టమా? టెలిఫోన్ డైరెక్టరీ తిరగేస్తే చాలు. సాధారణంగా ఈ రోజుల్లో ఏ యువకుడూ రమాకాంత్ అన్న పాతకాలం పేరు పెట్టుకోవడం లేదు. అంతెందుకు? ఇప్పటి ఏ అపార్టుమెంటునైనా, ఇంటినైనా పరిశీలించండి..రమాకాంత్ లాంటి పేర్లుంటాయా వాటికి? మీ ఇల్లు మూడు బై రెండు నీవా దత్ లేన్‌లో ఉంది. మీ ఇంటిముందు ఓ చిన్నతోట లాంటిది ఉందని ఊహించగల్గుతున్నాను. అందులో మాధవీలత లాంటి పూలమొక్కలు వుండి ఉంటాయి. ఆ యింట్లో కేవలం మీ భార్యతో..మీరిద్దరూ ఒంటరి ద్వీపాల్లా...'

రమాకాంత్ ఇవన్నీ నిశ్శబ్దంగా వింటున్నాడు. అవతలి వ్యక్తి గొంతు వయోధిక్యాన్ని

సూచిస్తున్నది. అతని మాటతీరూ పాతకాలం మనిషి అని చెప్పకనే చెబుతున్నది. అంటే తపన్‌కిరణ్ డెబ్బై లేదా అంతకన్నా ఎక్కువ ఏళ్ళ మనిషై ఉండాలి. కానీ ఇంతరాత్రి అతనికి తనతో ఏం పని?

"పని ఉంది. చాలా అత్యవసరమైన పని. దయచేసి ఫోన్ పెట్టేయకండి. ముందు నేను మీ గురించి చెప్పిన అంచనాలన్నీ దాదాపు వాస్తవానికి దగ్గరున్నాయా? అది చెప్పండి" అన్నాడు తపన్ కిరణ్.

"అయితే ఏం ప్రయోజనం?" గొంతులోంచి విసుగును తీసేయలేకపోయాడు రమాకాంత్.

"లాభం ఉంది రమాకాంత్ బాబూ! నాకిప్పుడు డెబ్బై రెండేళ్లు. అస్వస్థతగా ఉన్న భార్యతో వుంటున్నాను. భావసారూప్యం ఉన్న వ్యక్తులవుతేనే కష్టసుఖాలు చెప్పుకోగలం. ముందు నేను మీ గురించి చేసిన ఊహాగానాలన్నీ నిజాలా కాదా చెప్పండి?"

ఇంత సేపటికి రమాకాంత్ మనస్సులో ఉన్న విసుగు పోయి దాని స్థానంలో ఉత్సుకత ప్రవేశించింది. ఉత్కంఠ కూడాను. "చాలావరకు మీరు ఊహించింది నిజమే" అన్నాడు.

"అవుతే ఇక మీతో కులాసాగా మాట్లాడొచ్చు. దీన్నే ఆక్సెప్టెన్సీ అంటారు.॥

"ఆక్సెప్టెన్సీనా?"

"అవును. కొన్ని విషయాలు కొంతమందితో చెప్పుకోకూడదు. రహస్యాలు అసలు చెప్పుకోకూడదు. ఆక్సెప్టెన్సీ ఉన్నవాళ్ళయితే చెప్పొచ్చు. భావసారూప్యం గలవాళ్ళతో కూడాను" అన్నాడు తపన్ కిరణ్.

రమాకాంత్‌కి ఏమీ బోధపడలేదు. రాత్రి పదకొండింటికి ఒక అపరిచితుడు ఇన్ని వాస్తవాలు చెపుతుంటే ఏమనాలి? నిజమే తమ ఇంటిముందు చిన్నపాటి తోట ఉంది. అందులో అతనన్నట్లే నాలుగైదు పూలమొక్కలున్నాయి. గాలికి ఇప్పుడవి అటూ ఇటూ తలలు ఊపుతున్నాయి. పరిసరాలన్నీ చాలా నిశ్శబ్దంగా ఉన్నాయి. కేవలం ఫోనుకి అవతలి వైపున్న వ్యక్తి కంఠస్వరం ఒక్కటే వినిపిస్తున్నది.

అతని మాటతీరు క్రమంగా రమాకాంత్‌ని ఆకట్టుకొంటోంది. విసుగు మొత్తంగా పోయింది. ఉత్కంఠ కలుగుతోంది. అందుకనే "మీరు ఎక్కణ్ణుండి మాట్లాడుతున్నారు?" అనడిగాడు కుతూహలంగా.

అవతలి వ్యక్తి చిన్నగా నవ్వినట్లున్నాడు. తర్వాత "అన్ని వివరాలూ చెప్పను. మా ఇల్లు మాత్రం పార్కు దగ్గర. మీ ఫోన్‌లో సిఎల్ఐపై లేదని నాకు నమ్మకంగా తెలుసు. కాబట్టి నా చిరునామా కనుక్కోలేరు" అన్నాడు. అలా అనడం తరువాయి "చిరునామా కనుక్కొంటే ఏమవుతుంది?" అన్నాడు రమాకాంత్.

"మా ప్లాన్ అంతా పాడైపోతుంది. పైగా మేము ఎన్నాళ్ళనుండో అనుకుంటున్న ప్లాను ఇది. నేనూ, నా భార్య మాలతి వేసిన ప్లాను. ఆమెకి అక్యూట్ ఆర్తరయిటిస్, నాకేమో ఆస్తమా".

"పిల్లలు?" ఆ మాట అనగానే అవతలి వ్యక్తి ఉలిక్కిపడినట్లున్నాడు. వెంటనే ఏమీ మాట్లాడలేదు. కొంపదీసి లైన్ కట్ కాలేదు కదా అనుకున్నాను. మళ్ళీ "హల్లో!" అన్నాడు.

అవతలి నుండి "ఆ...మాట్లాడుతున్నాను. కాస్త నీళ్ళు తాగాను. గొంతు ఎండుకుపోతోంది. ఇప్పటి పిల్లల విషయం అడక్కండి. అబ్బాయి అమెరికాలో ఉన్నాడు. అమ్మాయి....అమ్మాయి విషయం అలా వుంచండి" అన్నాడు.

అలక గదిలోకి వచ్చింది. చేతిలో రెండు వేడి పాల గ్లాసులున్నాయి. నిదానంగా టేబుల్ మీద పెడుతూ రమాకాంత్ వైపు చూసింది. సైగతోనే ఎవరి ఫోన్ అంటూ అడిగింది. రమాకాంత్ కూడా చేతుల సైగతోనే నిశ్శబ్దంగా వుండమని చూపించాడు. నిజానికి అక్కడ అలక లేకపోతేనే బాగుండును అనుకున్నాడు. ఆమె చాలా బిగ్గరగా మాట్లాడుతుంది. ఇంతసేపూ ఎవరితో మాట్లాడుతున్నారని అవతలి వాళ్ళకు వినిపించేలా ఇంకా అడగలేదు. నయం. తెరచిన కిటికీలోంచి తుంపర్లు తుంపర్లుగా వర్షపు చినుకులు గదిలోకి వస్తున్నాయి. అలక వెంటనే వెళ్ళి కిటికీ మూసింది.

అంతవరకూ గాలికి రెపరెపలాడిన క్యాలెండర్ ఆగిపోయింది. అలక కుర్చీలో కూర్చుని భర్తవైపు చూసింది. భార్య కుతూహలమంతా ముడతలుగా ఆమె నుదుట గోచరించింది. రమాకాంత్ సహజంగా కోపగొండి. విసుగు ప్రదర్శిస్తున్నప్పుడు అతని కంటి కొలకుల్లో ముడతలు కనిపిస్తాయి. అతనికి ఎక్కువగా మాట్లాడడం నచ్చదు. మాటలు వినడం కూడా ఇష్టముండదు. అలాంటి రమాకాంత్ గొంతులో ఇవాళ కోపం లేదు సరి కదా విసుగూ లేదు. కేవలం అవతలివ్యక్తితో ఏవో విషయాలు పంచుకుంటున్నాడు. ఆ వ్యక్తి చెప్పే మాటలు వినేందుకు రమాకాంత్ తన చెవులు రిక్కించి వింటున్నాడు.

తపన్ కిరణ్ "హలో! వింటున్నారా?" అన్నాడు.

"ఆ... వింటున్నాను. చెప్పండి!"

"మా అసలు కథ ఇంకా మొదలే కాలేదు"

"అసలు కథా?"

"అవును. మా కథ వినడానికి ఈ లోకంలో ఎవరున్నారని?"

"పిల్లలున్నారు కదా!"

తపన్ కిరణ్ చిన్నగా నవ్వి "పందొమ్మిదొందల ఎనభైతొమ్మిదిలో జి.ఆర్.ఇ. అంటూ ఏవేవో పరీక్షలు రాసి అమెరికా వెళ్లాడు మా అబ్బాయి. మొదట్లో రాత్రి పన్నెండున్నర, ఒంటిగంట ప్రాంతంలో దాదాపు రోజూ ఫోన్ చేసేవాడు. ఓ ఆర్నెల్లయ్యాక చదువులో ఒత్తిడి పెరిగి నెలకి రెండుసార్లు మాట్లాడేవాడు. కొన్నేళ్ళు పోయాక ఆర్నెల్లకీ, తొమ్మిది నెళ్ళకీ మాట్లాడేవాడు. పి హెచ్.డి. పూర్తి చేసి అక్కడే సెటిలయ్యాడు. పెళ్ళీ జరిగిపోయింది. ఆ తర్వాత చాలావరకు ఫోన్లు తగ్గిపోయాయి. అయినప్పటికీ వాళ్ల అమ్మ పుట్టినరోజుకి తప్పనిసరిగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపేవాడు. ఈ సంవత్సరం ఆగస్టు ఇరవైరెండుకి అదీ లేదు" అని ఆగాడు. ఇంటిముందరి తోటలోంచి తపన్ కిరణ్ నవ్వు చిన్నగా గాలిలో తేలివస్తున్నట్లు అనిపించింది. ఆ గాలిలో ఏదో పూల సుగంధం కూడాను.

రమాకాంత్ "బహుశా మీవాడు బిజీగా వుండి వుండొచ్చు. మీరు ఫోన్ చేయవచ్చు కదా!" అనడిగాడు.

"కావచ్చు. కానీ మేము..." అవతలి వ్యక్తి కంఠస్వరం వణుకుతోంది.

"పోనీ మీ అమ్మాయి వుంది కదా!" అని ప్రశ్నించాడు రమాకాంత్.

"ఆమె విషయం అలా వుంచండి!" అవతలి వైపునుండి కాసేపు నీరవ నిశ్శబ్దమే వినిపించింది. తర్వాత రిసీవర్‌లో సుయ్, సుయ్ శబ్దాలు. అలక ఇంకా భృకుటి ముడివేసే చూస్తున్నది. అయితే ఫోను వైపు కాదు. భర్త వైపు. ఇప్పుడు ఆమె మోహంలో విసుగూ లేదు. సంతోషమూ లేదు. కుతూహలంగా వుంది. అలక మెల్లగా గొంతు తగ్గించి "విషయమేంటి? ఇంకా ఎంతసేపు మాట్లాడతారు?" అంది.

ఇంకొక సందర్భం అయివుంటే ఆమె మాటలకి రమాకాంత్ నవ్వుకొని వుండేవాడు. ఇప్పుడు నవ్వూ రావడం లేదు. రాత్రి పదకొండూ పదిహేను నిమిషాలకి అతని చేతిలో రిసీవర్ ఉండడమే ఆశ్చర్యం. తనకి ఇష్టం లేకపోతే ఫోన్ కట్ చేయవచ్చు.

కానీ చేయలేకపోతున్నాడు. అవతలి వ్యక్తి తను భావసారూప్యం కల్గిన మనిషి అని మాట్లాడుతున్నాడు. అతని మాటల పట్ల ఇప్పుడు రమాకాంత్‌కి ఆసక్తి కల్గుతున్నది. కుతూహలాన్ని అణచుకోలేక "మీరు చెప్పడం ఇంకా పూర్తి చేయలేదు" అన్నాడు.

"అవును. ఇంకా పూర్తి చేయలేదు".

"మీ టెలిఫోన్ బిల్లు పెరిగిపోతుంది".

"కరక్టుగా చెప్పారు" అంటూ అవతలి వ్యక్తి చిన్నగా దగ్గి గొంతు సవరించుకున్నాడు. మళ్లీ అతనే "అయినా ఇంక బిల్లు గురించి పట్టించుకోదలచుకోలేదు. ఎందుకంటే ఈసారి ఫోన్ పర్మనెంట్‌గా డిస్‌కనక్టు అయిపోతుంది" అన్నాడు.

"అంటే"

"అంటే కాంటాక్టు ఉండదు" అంటూ మృదువుగా నవ్వాడు తపన్ కిరణ్.

"నాకు అర్థం కావడం లేదు" అన్నాడు రమాకాంత్ సర్కార్.

"మేము శాశ్వతంగా వెళ్ళిపోవాలనుకుంటున్నాం" ఒక్కసారిగా వాతావరణం గంభీరంగా మారిపోయింది. కాసేపయ్యాక ఒక పల్చని నవ్వు అవతలి వైపునుండి తేలివచ్చింది. నవ్వు పూర్తయ్యాక అవతలి వైపునుండి మాటలు ఇలా పెగిలాయి.

"నా పేరు తపన్ కిరణ్ ఛటర్జీ. డెబ్బైరెండేళ్ళు. భార్య మాలతీ ఛటర్జీ. ఆమెకి అరవై ఎనిమిది. అబ్బాయి విదేశాల్లో ఉన్నాడు. ఇంక తిరిగిరాడు. మా అమ్మాయి, ఆమె విషయం అలా వుంచండి! పార్కు దగ్గర పన్నెండొందల చదరపు అడుగుల ప్లాటు వుంది. ఇరవైరెండు లక్షల దాకా బ్యాంకు బ్యాలెన్సు . ఎనిమిది వేల పెన్షన్. గల నెలలో మా అపార్టుమెంటులోని నాలుగో అంతస్తు అశేష్ సర్కారు ఆత్మహత్య చేసుకున్నాడు. మా ఆవిడ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. రాత్రింబవళ్లు ఆమెకి ఒకటే చింత... మిమ్మల్ని ఎవరి దగ్గర వదలి వెళ్ళాలి అంటూ..."

అవతలి వ్యక్తి గొంతు ఆగిపోయింది. వినిపించడమే లేదు. బయట జోరుగా కురుస్తున్న వానకి వినిపించడం లేదా? లేక వర్షంతో పాటు వీస్తున్న హోరుగాలి కారణంగానా? రమాకాంత్ కళ్లు గోడ గడియారం మీదకి మళ్లాయి. పదకొండుగంటల ఇరవై ఐదు నిమిషాలు. అలక టేబుల్ పక్కకు కూచుని వుంది. చాన్నాళ్లుగా దంపతులిద్దరూ కళ్లతోనే మాట్లాడుకుంటున్నారు. రమాకాంత్ కడుపు నిండా మాట్లాడి ఎన్నాళ్లయ్యిందో? కానీ ఫోనులో అవతలివ్యక్తితో మనస్ఫూర్తిగా మాట్లాడుతున్నాడు. రిసీవర్ జారిపోకుండా గట్టిగా చెవి దగ్గరే పెట్టుకున్నాడు.

అలక స్వరం తగ్గించి "పాలు చల్లారిపోయి వుండొచ్చు" అంది.

"చల్లారిపోనీ!" అంటూ రిసీవర్ మరింత గట్టిగా పట్టుకొని "కొంపదీసి అతను ఫోన్ కట్ చేయలేదు కదా!" అన్నాడు.

"అవసరం ఎవరిది? మీదా లేక అతనిదా?" అలక వేసిన ప్రశ్నకి రమాకాంత్ జవాబివ్వలేదు. హఠాత్తుగా ఏదో ఉద్వేగానికి గురయ్యాడు. నుదుట చిరు చెమటలు పట్టాయి. గొంతు వణుకుతున్నది. గట్టిగా "హలో! తపన్ కిరణ్ బాబు గారూ!" అన్నాడు.

"ఆ..... చెప్పండి! మాట్లాడుతున్నాను" మృదువుగా అన్నాడు అవతలి వ్యక్తి.

"మీరు చెబుతున్న విషయం ఇంకా పూర్తికాలేదు" దాదాపు అరిచినంత పనిచేశాడు రమాకాంత్.

తపన్‌కిరణ్ నవ్వుతూ "మీకు ఉద్వేగమూ, ఉత్కంఠా కల్గుతున్నాయా?" అని ప్రశ్నించాడు.

"సహజమే కదా"

"ఎందుకు సహజం? నాకు డెబ్బైరెండేళ్ళు. మా ఆవిడకి అరవై ఎనిమిది. ఇంకా సాకారం కావల్సిన స్వప్నాలు ఏవీ లేవు మాకు".

"అయితే ఏమిటి తపన్ కిరణ్‌బాబు గారూ?"

తపన్‌కిరణ్ మృదువుగా "మా ఆవిడ మాలతి దాదాపు ఎప్పుడూ 'మిమ్మల్ని ఎవరి దగ్గర దించి వెళ్ళాలి నేను' అడుగుతుంటుంది" అన్నాడు.

ఆ మాటకి రమాకాంత్ ఎలాంటి జవాబు చెప్పలేకపోయాడు. అలకవైపు చూశాడు. ఆమె కూడా అతని వైపే చూస్తున్నది. ఎదుట గ్లాసుల్లో ఉన్న పాలు చల్లారిపోయాయి. వాటి వైపు ధ్యాసే లేదు. ఇప్పుడు అలక ఏం ఆలోచిస్తున్నది? ఆమెకి ఈ అద్భుతవ్యక్తి వృత్తాంతం చెప్పాలా? చెబితే అవతలి వ్యక్తి పిచ్చోడై వుంటాడని అనుకుంటుందా!

"హలో" ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా అడిగాడు "మీ అపార్టుమెంటు పేరూ, మీ ఫ్లాటు నంబరూ కాస్త చెబుతారా?"

అవతలివైపు నుండి నవ్వు వినవచ్చింది. "రమాకాంత్ బాబుగారూ! ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. మీరు రావడానికి ముందే ఏ సంఘటనైనా జరిగిపోవచ్చు. దానికి బదులుగా విషయం వినండి".

"ఇంకా ఏం వినాలి? ఇంకా మీ విషయం చెప్పడానికి ఏం మిగిలింది?"

'ఉంది. ఈ భూమడలంమీద మీలాంటి ఒక అద్భుతమైన మనిషి దగ్గర వీడ్కోలు తీసుకునే వీలు దొరికింది".

అతని మాటలు చాలా ప్రశాంతంగా ఉన్నాయి. నిర్వికారంగా వున్నాయి. రమాకాంత్ గొంతు పూడుకుపోయింది. తబబడుతూనే చిన్నగా "తపన్ కిరణ్..తపన్ కిరణ్‌గారూ!" అన్నాడు.

"ఆ...చెప్పండి!"

"ఇప్పుడే మీ దగ్గరికొస్తాను"

"మీరా!" అంటూనే గొంతు ఆగిపోయింది. అప్పటికి బయట గాలి ప్రచండంగా వీస్తోంది. ఫోన్ బహుశా కట్ అయినట్టుంది. రమాకాంత్ "హలో! హలో!! వింటున్నారా? తపన్‌కిరణ్ బాబుగారూ వింటున్నారా? అడ్రస్ తెలిస్తే నేను తప్పక వస్తాను" అంటూ అరిచాడు.

అవతలివైపు నుండి ఈ సారి కూడా ఎలాంటి జవాబు రాలేదు. అర్థమైపోయింది... విషయం తెలిసి పోయింది.

అలక చిన్నగా "ఇక వచ్చేయండి" అని పిలిచింది.

రమాకాంత్ ఫోన్ క్రెడిల్ మీద పెట్టిలేచాడు. టేబుల్‌కి రెండువైపులా రెండు కుర్చీలు, టేబుల్ మీద పాలగ్లాసులు. ఇప్పుడు చల్లారి పోయాయి.

అలక ఇవాళ చక్కగా నిండు ముత్తయిదువలా అలంకరించుకుంది. పెద్దంచు గల చీర... నుదుట బొట్టు. ఆమె కోటేరులాంటి ముక్కుపై ట్యూబ్‌లైటు వెలుతురుపడి నిగారిస్తున్నది. తలవెంట్రుకల్ని ఎప్పటిలానే ముడుచుకున్నది. అలక ఇవాళ ఒక మాతృమూర్తి కాదు. అలక ఇవాళ ఒక అర్థాంగి కూడా కాదు. ఇవాళ అలక కేవలం ఒక స్త్రీమూర్తి మాత్రమే!

రమాకాంత్ ఆమె దగ్గరికి వెళ్తూ "రాత్రి పన్నెండయ్యింది" అన్నాడు.

"కానివ్వండి! మరీ ఆలస్యమైతే కాలేదుగా!"

అలక గొంతు స్థిరంగా వుంది. "అన్నట్టు...అమ్మాయిని చూడాలని వుందన్నారుగా!" అంది అలక.

రమాకాంత్ "మన అమ్మాయి విషయం అలా ఉండనీ!" అన్నాడు.

"అలాగే వుండనీ" అంటూ అలక తన చేతిలోకి ఓ పిడికెడు టాబ్లెట్లు తీసుకుంది. అవి నిద్రమాత్రలు. నిద్ర పట్టడం లేదంటే డాక్టరుగారు రాసిచ్చిన మాత్రలు.

గత కొన్నాళ్లుగా రాత్రిళ్లు ఆ మాత్రలు వేసుకోకుండా అలక వాటిని మిగిల్చింది. పాలగ్లాసుల్లో వాటిని అలక ఒక్కటొక్కటే వేస్తూ తల ఎత్తింది.

"మీకు పన్నెండు వేశాను. నాది మొండిప్రాణం. పదహారు కన్నా తక్కువైతే పని నడవదు" అని చెంచాతో మాత్రల రూపంలో వున్న నిద్రని, శాశ్వత నిద్రని చక్కగా కలపసాగింది.

రమాకాంత్ ఒక్క ఉదుటున లేచి "కాస్త ఆగు" అన్నాడు.

అలక "మళ్లీ ఏమైంది మీకు?" అంది.

"ఒక్క నిమిషం!" అంటూ వెంటనే టెలిఫోన్ డైరెక్టరీ తీసుకొని ఒక పేరూ, ఆ పేరు తాలూకు నంబరూ రాసి పెట్టుకున్నాడు రమాకాంత్.

ఫోన్ కలవకపోతే ఎలాగని అతనిలో భయం గూడు కట్టుకుంటున్నది. వణుకుతున్న చేతులతోనే డయల్ చేశాడు. రాత్రి పన్నెండు గంటలు. రింగ్ అవుతోంది. దూరంగా అవతలివైపు ఎక్కడో ఫోన్ మోగుతోంది. ఒకసారి రెండుసార్లు అవును రెండు సార్లు మోగింది. మూడోసారి మోగడానికి ముందే ఎవరో ఫోన్ ఎత్తారు. సరిగ్గానే కలిసింది.

"హల్లో!" చిన్నగా అంటూనే "మీరు కరుణామయ్‌మిత్రాగారు కదండీ!" అన్నాడు రమాకాంత్.

"అవును..మీరు?" దెబ్బఎళ్లు పైబడిన గొంతు ప్రశ్నిస్తోంది.

"నేను రమాకాంత్ సర్కార్‌ను. మీరు నన్ను గుర్తుపట్టలేరు. మీతో ఓ ముఖ్య విషయం చెప్పాలనుంది. దయచేసి ఫోన్ కట్ చేయకండి".

అలక అవాక్కయిపోయింది. అలాగే చూస్తూ ఉండిపోయింది. ఆమె చేతిలో పాలగ్లాసులు. ఫోన్ మాట్లాడ్డం అయ్యాక వణుకుతున్న పెదాలతో పాలు తాగెయ్యాలి. ముందు అవతలివైపు నుండి ఎలాంటి మాటలూ వినరాలేదు.

రమాకాంత్ వణుకుతున్న గొంతుతో "హలో!" అన్నాడు మళ్ళీ.

సరిగ్గా అప్పుడే ముప్పై ఒకటీ బై బి, డమ్ డమ్ రోడ్డు వైపు నుండి అంటే రోడ్డుకు అవతలి వైపు నుండి "చెప్పండి! వింటున్నాను" అన్న మాటలతో పాటు ఓ నిట్టూర్పు కూడా వినిపించింది.

– ఆంధ్రజ్యోతి (ఆదివారం) – 30 నవంబరు 2008

దేశబాంధవుడు

–కన్నడ మూలం : డా॥ బెసగరహళ్ళి రామణ్ణ

ఆలస్యంగా ప్రారంభమైన తొలికరివాన మధ్యాహ్నం నుండి విసిరి విసిరి కొడుతున్నది. నేను శ్రీరంగపట్నం బస్టాండులో వున్నాను. ఎటూ తోచక కొంతసేపు కూచుని మరి కొంతసేపు నిలుచున్నాను. భోరున కురుస్తున్న వాన వ్యామోహంలో పడి దాని పెళపెళార్భాటాలను చూస్తూ మాండ్యకు వెళ్ళే బస్సుల్ని మిస్ చేసుకున్నాను. ఇటీవల బాగా పెరిగిపోతున్న ప్రమాదాలతోనూ, చావులతోనూ ప్రైవేటు టెంపోల్లో ప్రయాణం చేయకూడదన్న నిర్ణయానికొచ్చాను. వర్షం మొదలు కాకముందే శ్రీరంగపట్నంలో చాడాల్సినవన్నీ చూశాను. టిప్పుసుల్తాన్ శవం దొరికిన స్థలం, సుల్తాన్ రాజభవనపు శిథిలాలు, మామిడి తోటలో వున్న ఫ్రెంచివాళ్ళ సమాధులు..అన్నింటినీ కలయచూశాను. ఫ్రాన్సు నుండి ఇండియాకొచ్చి మనల్ని పాలించి చచ్చాక దివ్యంగా తమ సమాధుల్ని కట్టించుకున్నవాళ్ళ బింకాలూ పొంకాలూ నాకు చిత్రమైన అనుభవాన్ని కల్గిస్తున్నాయి. మరణించిన తమ పెళ్ళాలకు, ప్రియురాళ్ళకు, కొడుకులకు, ఫాదర్లకు, వీరులకు, రక్తపిపాసులకు సమాధులు కట్టించుకున్న పరాయి పరాసువాళ్ల చారిత్రక దృష్టి నాకెందుకో నవ్వు తెప్పిస్తున్నది.

"రాజులంతా ఒక్కటే తీరు. తమ కీర్తి ప్రతిష్టల్ని ఉన్నతీకరించుకోవడంలో వాళ్ళకు వాళ్ళే సాటి" అంటూ ఖాండ్రించి వుమ్మేశాను. ఎందుకో తెలుగు మహాకవి శ్రీశ్రీగారి "నరజాతి చరిత్ర సమస్తం, పరపీడన పరాయణత్వం" అన్న కవిత్వ చరణాలు నాకు తెలియకుండానే నా నాలిక మీంచి జాలువారినై.

"ఏమన్నారు? ఏదీ...మళ్ళీ అనండి. నాకు సరిగా విన్పించలేదు." ఎవరిదో ఒక స్పష్టమైన గొంతు నా వెనకాలే వినిపించింది. అయితే ఆ గొంతులో నిరాశ నిండి వుంది. నేను గిర్రున వెనక్కి తిరిగి చూశాను. ఒకాయన ప్రేతాత్మలాగా వున్నాడు. అతని తలంతా అట్టలు కట్టేందుకు సిద్ధమై వుంది. ఎండి పోయిన ముఖం. పొడవైన ముక్కు. గుంతలు పడి లోతుకు పీక్కుపోయిన కళ్ళు. వాడిన పెదాలు, చీలికలు పేలికలైన చొక్కా, ప్యాంటు వేసుకుని వున్నాడు. మనిషి ఎత్తుగా వున్నాడు. నా ముఖంలో వున్న కంగారు చూసి కావచ్చు అతను–"నేనే ఇందాక మాట్లాడింది. నన్ను చూస్తే భయమవుతున్నదా?" అన్నాడు.

నేను "లేద"ని తల వూపాను.

"ఇందాక అదేదో ఒక పంక్తి చెప్పారు కదా! అది సరిగా విన్పించలేదు. దయచేసి మరోమారు చెబుతారా?" అంటూనే జీవచ్ఛవంలా నన్ను సమీపించాడు.

నేనతని ముఖాన్ని బాగా పరికించాను.

"అయ్యా! నా ముఖాన్ని ఏం చూస్తావు?

నేనేమైనా దేవదూతనా? నా ముఖమ్మీద యిండియా పటం కనిపిస్తున్నదా ఏం? అన్నట్టు..ఇందాకటి కవిత్వ చరణాలు చెప్పు" అంటూ దబాయించాడు.

"ఓ అదా? శ్రీశ్రీ అని తెలుగులో మహాకవి వుండేవారు. అతని 'మహాప్రస్థానం' కన్నడంలోకి అనువదించబడింది. ఇందాకటి పంక్తులు అందులోనివే!"

"ఆ పంక్తుల్నే మళ్ళీ చెప్పమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను."

"నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం".

"అబ్బ! చెవులకు యింపుగా వున్నాయి. అర్థమేమిటి అప్పా? కాస్త చెప్పు".

"మానవ చరిత్ర అంతా పరులపీడనే నిండి వుంది. బలవంతులు బలహీనుల్నీ, నిస్సహాయుల్నీ హింసిస్తూనే తాము సుఖపడుతున్నారు".

"ఇంకాస్త అర్థమయ్యేలా వివరిస్తారా?"

"రాజులూ, మహారాజులూ కట్టించిన రాజభవనాలు; కోటలూ పేటలూ, మందిరాలూ, మసీదులూ...ఇలాంటివన్నీ నిరుపేదల్ని, అసహాయుల్ని దోపిడీ చేసి హింసించిన డబ్బులతోనే నిర్మించబడినై, చరిత్రలోని ప్రతి పేజీలోంచీ నెత్తురే చిమ్ముతున్నది."

"అర్థమైందిలే! ఆ శ్రీశ్రీగారు ఇంకా బతికే వున్నారా?"

"లేదు"

"అది కాదయ్యా! ఇలాంటి కవిత్వం రాసిన కవికి చావుంటుందా?"

"సుకవికి చావు లేదు. నీ మాట నిజం. శ్రీశ్రీ గారిని నేను డెబ్బయి తొమ్మిదిలో బెంగుళూర్లో జరిగిన ఓ సాహిత్య సమావేశంలో చూశాను.

"ఎట్లా ఉంటారు? భారీ శరీరం...బానెడు పొట్ట...ఎందుకంటున్నానంటే..ఈ కవులున్నారే...వీళ్ళలో కూచుని తినేవాళ్ళే ఎక్కువ..."

"శ్రీశ్రీ మాత్రం చీపురు పుల్లలాంటి మనిషి"

"కానీ...ఓ ఉత్తుంగ హిమశృంగం లాంటి కవిత్వం రాశాడే! అన్నట్లు...నీ నోటినుండి యిప్పటికిప్పుడు ఆ పంక్తులెందుకొచ్చినట్టు?"

"ఇన్ని ప్రశ్నలు వేస్తున్నారు. ఇంతకీ మీరెవరు" అన్నాను.

" నా గురించి వివరాలు కావాలా నీకు?"

"ఊ" అంటూ తల ఊపాను.

❀ ❀ ❀

"నా పేరు శ్రీకాంత్. ఇక్కడి అత్తిగుప్పె తాలూకా మాది. మా తండ్రిపేరు పుట్టేగౌడ. మా తల్లి పుట్టతాయి. మా తండ్రిది భారీశరీరమట. వీధిలో నడుస్తుంటే నేలంతా అదిరేదట! మా తాతగారు దొడ్డ పుట్టేగౌడ. ఐదారు పెద్దపెద్ద రాగుల రొట్టెల్ని ఒక్కడే లేత తమలపాకుల్ని నమిలినట్లు నమిలేవాడట. మా తాత యిబ్బందిని భరించలేక మా నానమ్మ తిమ్మక్క యిట్లా అనేదట. 'నీ తతంగం చాలు. ఇంకో దాన్ని కట్టుకో. తిండిపోతుతో సంసారం చేయడం నావల్ల కాదు'. ఆయనగారేమో 'ఓసి పిచ్చిదానా? నేనేమైనా తిరుగుబోతునా? నువ్వే నా సర్వస్వం. 'నీ చేతి రాగుల రొట్టెల కన్నా నీ శరీరం నాకు మరింత రుచికరం. పంట చేలు విడిచి పరిగె ఏరుతానా?' అనేవాడట. ఎంతవద్దన్నా పన్నెండు మందిని కన్నాడట. మిగిలింది మాత్రం ముగ్గురు. మా పెద్దనాన్న, మా నాన్న, మా మేనత్తలు, ఏకపత్నీవ్రతులైన మగాళ్ళని చేసుకున్న పెళ్ళాల కథ ఎన్నో వెతలతో వుంటుంది. ముప్పొద్దులా కష్టపడాలి. పిండి నానబెట్టాలి. ముద్దలు చేయాలి. రొట్టెలు కాల్చాలి. ఎక్కడైనా యిసుకవస్తే అంతే సంగతి. తన్నులే తన్నులు, నరకం...రౌరవాది నరకం...పూర్వకాలపు స్త్రీల బతుకులు నరకం" అంటూ ఆపి ఊపిరి తీసుకున్నాడు.

"కథలు చాలా చక్కగా చెబుతున్నారే!"

"నన్ను మునగ చెట్టు ఎక్కించకు, నా సంగతి పొల్లు పోకుండా చెబుతాను. అన్నీ చెప్పుకోవాలని మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది".

'మరింకేం...? నీ హరికథ కొనసాగించు" అన్నాను.

"ఇదీ మా తండ్రిగారి వైపు కథ. మా నాన్నని మా తల్లిదండ్రి అంటే మాతామహుల యింటికి యిల్లరికం తెచ్చుకొన్నారు. మా తాతగారి పేరు బూరేగౌడ. ఇతనికిద్దరే పిల్లలు. ఒకరు ఆడ, మరొకరు మగ. మగవాడు చిక్కబూరేగౌడ. పెళ్లి మరో వారం రోజులనగా పాము కరిచి పోయాట్ట! మా నాన్న, అమ్మ...ఇద్దరే యింటి దీపాలయ్యారు. ఎలాగోలా బట్టకూ, పొట్టకూ లోటులేకుండా నడిచిపోతున్నది. నేనప్పుడు చిన్నపిల్లాణ్ణి. మా నాన్నకు-మా అక్కయ్య జయ, నేను-ఇద్దరే పిల్లలం. మురుకన హళ్ళి అనే ఊరికి మా అక్కయ్యను యిచ్చాం. తన గర్భంలో బిడ్డ అడ్డుపడిందనీ, మైసూరుకు తరలించాలనీ అన్నారు. బండి కట్టండి-బస్సు ఎక్కండి. అనే లోపే అక్కయ్య ప్రాణాలు హరీమన్నాయి. ఇది జరిగిన ఒకటి రెండేళ్ళలోపు మా నాన్నకి కలరా సోకి గుటుక్కుమన్నాడు. కూతురి చావు, మగని అకాల మరణంతో మా తల్లి ఉరివేసుకు చచ్చింది. ఇంత జరిగినా మా తాత బూరేగౌడ మాత్రం అధైర్యపళ్ళేదు.

అయ్యో! కొడుకూ, అల్లుడూ పోయారు. మనవరాలు, కూతురూ మరణించారని చేతులు కట్టుక్కూచుంటే పని వెళ్ళదు. చచ్చినాళ్ళతో పాటు మనమూ పోతే ఈ భూలోకమే వుండదు. బతకాలి. మనిషన్నవాడు బతికి సాధించాలి.' అంటూ నా చేతికి పలకా బలపాలూ యిచ్చి బడికి పంపాడు తాత.

'మంచి మొగోడివే! దెబ్బలు తాకిన కాలికే తగుల్తాయి లే! మనకున్న మంచి ఎద్దుల జతలో ఒకటి రోగమొచ్చి చచ్చిపాయే. ఈసారి బ్రహ్మాండమైన వానలు కురుస్తున్నాయి. రాగులు చల్లాలి. లే! ఊరు ఊరంతా దున్నకాలు సాగిస్తున్నద" అంది మా అమ్మమ్మ.

"అన్నట్లు...ఆమె పేరు చెప్పడం మరిచాను. చెన్నమ్మ, మా తాతగారి కన్నా గడుసుకత్తె. తలమీద రెండు చేతులు పెట్టుకొని విచారంగా కూచుని వున్న మా తాతని చూసి' లేవండి గాజులు తొడుక్కున్నారా ఏమిటి? నేనుండగా మీరెవరికీ తలవంచకూడదు. పొలం బీడు పడరాదు" అంటూ నాగలి నొగలను భుజమ్మీదికి

ఎక్కించింది. విధిలేక మా తాత పగ్గాలతో ఆమెను అనుసరించాడు. ఊరంతా నోరు వెళ్ళబెట్టింది. మా తాత "అయ్యో భగవాన్! మాకెందుకు చావు రాకపాయె. నా భార్యను ఎద్దుకి బదులుగా నాగలికి కట్టాల్సివచ్చింది కదా! నీ గుళ్ళో మన్ను పడనీ! ఇట్లాంటి కష్టం పగోనికి కూడా గావద్దు. ఇంతకన్నా పడుకున్నవాళ్ళని పడుకున్నట్లే తీసుకపో!" అంటూ కన్నీరు కార్చాడు. పొద్దస్తమానం దున్నాడు. మర్నాడు మా అమ్మమ్మ వద్దని వారించినా ఊరంతా తరలివచ్చి మా పొలాలు దున్నారు. చిక్కుళ్ళూ, మొక్కజొన్నలూ వేశారు. ఇప్పటికీ పట్టుదల అంటే మా అమ్మమ్మదే అని అంతా చెప్పుకుంటారు".

అతను కాసేపు ఆపాడు. నేను విస్తుపోయాను.

"పేదవాళ్ళు చస్తే కాల్చేందుకు కట్టెలుండవు.

జఠరాగ్ని తోనే శవం కాలిపోతుందా?

దేవుడా! పేదవాళ్ళకి చావు కూడా యివ్వకు" అన్న ఓ అజ్ఞాత జానపద కవి పంక్తులు గుర్తుకొచ్చినై. వర్షం జోరు అందుకున్నది. గాలి వీస్తున్నది. చలి పెడుతున్నది. అయినా నేను చెమటతో తడిసి ముద్దయ్యాను.

"ఇంకా కథ అయిపోలేదు. అప్పుడే చెమటలు పోశాయా సార్?" అన్నాడు.

"లేదు. మీ కథలోని వాస్తవికత గుర్తొచ్చి ఆశ్చర్యపోయాను" అన్నాను.

"ఇంకా వినండి" అంటూ ప్రారంభించాడు మళ్ళీ.

"ఏ చిన్న కష్టమొచ్చినా మా తండ్రివైపు బంధువులొచ్చి 'అంతో యింతో వీళ్ళ నాన్న ఆస్తి మా దగ్గర వుంది కదా! వీణ్ణి మాతో పంపించండి' అనేవాళ్ళు. మా తాత వినలేదు. మా అమ్మమ్మ 'ఉంటే మాతో వుంటాడు. చస్తే మాతోనే చస్తాడు' అని వాళ్ళని పంపించింది. ఆ తర్వాత క్రమంగా నన్ను స్కూలుకి పంపారు. పొరపాటున ఏనాడైనా బడి ఎగ్గొడితే మా తాత మక్కెలిరగదన్నేవాడు. మా అమ్మమ్మ బెల్లం ముక్క యిచ్చి 'బిడ్డా! మంచిగా చదువుకోవాలె, చచ్చి స్వర్గంలో వున్న మీ తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలె' అని భోరున ఏడ్చేది. నేనామె కన్నీళ్ళను తుడిచి సుతిమెత్తని పువ్వులాంటి ఓ ముద్దుతో ఆమెను ఊరడించేవాణ్ణి. బడికి పరుగులు తీసేవాణ్ణి. సీలనెరెలో మిడిల్ స్కూల్ ముగిసింది. అత్తెగుప్పెలో హైస్కూలు పూర్తయింది. మైసూరు అనాథ శరణాలయంలో చేరి యువరాజు, మహారాణి కళాశాలల్లో బి.ఎ. ముగించాను. తర్వాత సోషియాలజీతో ఎం.ఎ. చేశాను. అన్నింటిలోనూ ఫస్ట్‌క్లాస్ మార్కులు. మా తాత,

అమ్మమ్మలు ఉబ్బిపోయారు."నేను పిహెచ్.డి. చేస్తాను" అన్నాను. "చెయ్యి" అన్నారు. 'మా రెక్కల్లో బలమున్నంతవరకూ నిన్ను చదివిస్తాం" అన్నారు. పిహెచ్.డి. వచ్చింది. రెండేళ్ళ దాకా స్కాలర్‌షిప్. ఇంకేం ఖుషీగా వుండొచ్చు.. అనుకున్నాను. ఈలోపు మా వూరివైపు హేమావతి ప్రాజెక్టు నిర్మాణం కొరకు కాలువల సర్వే పని మొదలైంది. వయసుమళ్లిన మా తాత అమ్మమ్మలు కూలిపనులకు వెళ్ళసాగారు. నేను వద్దని మొత్తుకున్నాను. 'మాకు కూచుని తినడం సయించదు. మనమేమైనా రాజులమా? వెళ్ళకపోతే ఎట్లా' అన్నారు. ఓరోజు వీళ్ళు పనిచేస్తున్న కాలువ దభీమని కుంగిపోయింది. పది పదిహేను లారీల మట్టి పైనబడి పన్నెండుగురు సజీవ సమాధి అయ్యారు. అందులో మా వాళ్ళూ వున్నారు. విషయం తెలిసిన నేను మైసూరు నించి ఆఘమేఘాల మీద వచ్చి అంత్యక్రియలు పూర్తిచేశాను. ఆ తర్వాత నా చదువు కొనసాగలేదు. ఈ దుస్థితి చూసి రోత పుట్టింది. పల్లెసీమల్లో వున్న కష్టాలూ, కన్నీళ్ళూ చూసి నా మనస్సు కరిగిపోయింది. గాంధీగారి ఆలోచనా విధానాన్ని విస్మరించిన మన పాలకుల పాలసీలతో పల్లెపట్టులు వల్లకాడులవుతున్నాయి. ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు చేయడంలో మన రాజకీయ నాయకులను మించినవాళ్ళు ఈ ముల్లోకాల్లో ఎక్కడా లేరు. హెలికాప్టర్ ద్వారా వరద బాధితులకు పైనుండి పదుల సంఖ్యలో ఆహార పొట్లాల్నీ, చీరెల్నీ విసిరేస్తారు. ఆ నిరుపేదలు వాటికోసం కాట్లాడుతూ ఒకరిద్దరు తొక్కిసలాటలో మరణిస్తే మరలా మొసలి కన్నీరు కార్చుతారు. నష్టపరిహారాలు నాటకాలు ఆడుతారు. స్వాతంత్ర్యం వచ్చి ఐదు దశాబ్దులు దాటినా ప్రజల ప్రాథమికావసరాలు తీరలేదని ప్రసంగించి చప్పట్లు కొట్టించుకుంటారు. కోట్లకొద్ది రూపాయల్లో దోపిడీ చేస్తూ సంపాదిస్తారు. ఈ కపటవేషధారుల నాటకాలు నిరాఘాటంగా సాగిపోతున్నాయి. ప్రజలేమో గొర్రెల మంద. ఈ మంద పాతాళంలో పడిపోతున్నది. పల్లంలోకి దిగిపోతున్నది. ఈ అమాయక ప్రజలకు చెప్పేనాథుడు ఎవరూ లేడు. ఉన్నా ప్రజలకు వాళ్ళమీద గురి లేదు. ఈ పరిస్థితుల్ని గమనిస్తుంటే ఒళ్ళంతా మండిపోతున్నది' అంటూ తన కుడి పిడికిలితో రాతిబెంచీ మీద బలంగా గుద్దాడు.

"అయ్యో! చేతికి నొప్పి వేయదూ?" అన్నాను.

ఛీ! ఈ పాడు పిడికిళ్ళు ఉండి ప్రయోజనం లేదు. మొత్తం వ్యవస్థే కరుడుగట్టుకుపోయింది. ప్రతి పల్లెలోనూ ఆంగ్లభాషా వ్యామోహం. పోయిన విదేశీయులు

మన ప్రజల ఇంగ్లీషు వ్యామోహంతో మళ్ళీ మనల్ని ఏలుతున్నారు. దేశభాషలు అస్తిత్వంకోసం పెనుగులాడుతున్నై. వాటిల్లో కన్నడ భాష పరిస్థితి కూడా...ఛీ ఛీ... చెప్పడానికే సిగ్గుగా వుంది. ఓసారి "ఈ ఇంగ్లీషు మోజు వదలండి' అని ఘాటుగా ఉపన్యసించాను. పర్యవసానం? ఇదిగో చూడు. కన్పిస్తున్నదా? నా నొసట గాయం గుర్తు. ఇంగ్లీషు భాషా వారసులు ప్రదానం చేసిన స్వర్ణపతకం. సరి...నేనేమో నా కథంతా వివరించాను. నువ్వు మంచి కిలాడిలాగా వున్నావు...నాయాలు..నీ గురించి చెప్పనే లేదు" అన్నాడు.

నేను నా పేరు చెప్పాను. వివరాలు విప్పాను.

"ఓహూ అలాగా! అయితే నువ్వేనా ఆ కథలూ గితలూ రాసే రచయితవి. మరి యింతవర్షంలో ఈ బస్టాండులో వున్నావెందుకు? ఈ దేశ చరిత్ర, గిరిత్ర అంటూ పురాణం రాస్తావా ఏమిటి? అక్కడక్కడ కన్నడభాష గురించీ, కవిత్వం గురించీ ఉపన్యాసాలు యిస్తున్నావు కదూ! స్థానిక పత్రికల్లో చదువుతున్నాను."

ఆయనే మళ్ళీ "నీకు బుద్ధి లేనట్లున్నది. ఇలా ఉపన్యాసాలు యిస్తూ, రచనలూ చేస్తూ పోతే నువ్వు కూడా కొన్నాళ్ళలో బిచ్చమెత్తుకోవాల్సి వుంటుంది."

"అంటే నీ దుస్థితే నాక్కూడా వస్తుందంటావా?" అని నేను మాట ముగించేలోపే గబుక్కున నా కాలర్ దొరకబుచ్చుకున్నాడు. ఆయనిది మాంఛి ఉడుంపట్టు. నాకు ఊపిరి ఆడ్డమే కష్టంగా వుంది. అతి కష్టమ్మీద "దయచేసి విడిచిపెట్టు. నీ మనస్సుని నొప్పించినట్లయితే.."అంటూ తడబడ్డాను. వెంటనే వదిలేసాడు.

"మనస్సుని నొప్పించినట్లయితే...అంటున్నావా? ఆత్మగౌరవం నీ ఒక్కడి సొత్తే అనుకుంటున్నావా? ఎవ్వడూ పేదోళ్ళ ఆత్మగౌరవాన్ని హరింపచేయలేడు. ఈ సంగతి తెలియకే ఈ దేశానికి ఈ దుస్థితి దాపురించింది. ఓ సారా పాకెట్టుకి, ఇరవై నోటుకి, ఒక చీరకి ఎన్నికల్లో అమ్ముడుపోయే పరిస్థితి మీలాంటి మేధావుల వల్లే కలుగుతున్నది." అతను రొప్పుతూ మాట్లాడుతున్నాడు. అతని కళ్ళు చింత నిప్పుల్ని, చంద్ర నిప్పుల్ని చెరుగుతున్నాయి. మా చుట్టూ ఇరవైమంది దాకా జమ అయ్యారు. నాక్కొంచెం అదోలా అనిపించినా తమాయించుకున్నాను. నా మనస్సు ప్రశాంతంగా లేకపోయినా తడబడుతూ "నిన్ను నేనవమానపరిచానని అనుకుంటే క్షమించు. రా! నాకూ ఆకలి దంచుతున్నది. హోటళ్ళో ఏదైనా తింటూ ముచ్చటించుకుందాం. మన మిద్దరమూ ఈ

గడ్డ మీదే పుట్టి పెరిగిన బిడ్డలం. ఈ దేశవాసులం. ఈ నేలమీదే ఏదో ఒకరోజు కన్నుమూసే వాళ్ళం" అని మాటలు ముగించానో లేదో ఉన్నపళంగా కరెంటు పోయింది. వాతావరణం చీకట్లోకి జారుకున్నది.

"పోవయ్యా! నీ సానుభూతి ఎవడిక్కావాలి? మనిద్దరమేనా ఈ దేశంలో ఆకలి బాధితులం? కోటానుకోట్ల మంది ఆకలితో మలమల మరిగిపోతున్నారు. లక్షలాది మంది గుండెలు ఎండిపోయిన తల్లులు ఆకలితో నకనకలాడే తమ బిడ్డల్ని "లాలీ! లాలీ!!" అంటూ లాలిపాటలూ, జోలపాటలతో నిద్ర పుచ్చుతున్నారు. పిల్లలేమో ఏడ్చీఏడ్చీ నిద్రలోకి జారుకుంటారు. రోజూవారీ కష్టాలు మరిచిపోయేందుకు ఈ పేద ప్రజలు సారాకు దగ్గరవుతున్నారు. మీలాంటి వాళ్ళకు ఈ లోకంలో వున్న నిజమైన శోకం ఏం తెలుసు? ఈ నేల పురుటినొప్పులు పడుతున్నది. తెలుసా? తెలుసుకోండి, రాయండి, రాస్తూనే వుండండి. ఏదో ఒకటి పేదబతుకుల గురించి రాస్తూనే వుండండి. దొంగ నా కొడుకులు. ఈ నేలమీదే ఏదో ఒకరోజు కన్నుమూసే వాళ్ళమట!"అన్నాడు.

ఆ తర్వాత-

"ఇంకా విను, చెవులంటూ వుంటే శ్రద్ధగా విను. నేను మరణిస్తే నన్ను పూడ్చిపెట్టవద్దు. కాల్చిపారేయకూడదు. నా కళేబరాన్ని కావేరీ నదీ తీరమ్మీద ఉన్నదున్నట్లుగా విసిరేయండి. నా దేశపు కాకులూ, గద్దలూ, పక్షులూ, ప్రాణులూ కడుపార తిని సంతోషించాలి. నాకు ఆకలి బాధ తెలుసు. నా శవం ఊరక మట్టిలో కుళ్ళిపోయి కంపుగొట్టి నాశనం కారాదు. సార్థకం కావాలి. నిరర్థకం కావొద్దు" అంటూ పెనుచీకటి గర్భాల్ని చీల్చుతున్నట్లుగా అతని కంఠం దశదిశలా మారుమ్రోగింది.

- ప్రజాసాహితి - ఏప్రిల్ 2006

ఎర్రని కథ

కన్నడ మూలం : ఫకీర్ మహమ్మద్ కట్పాడి

ఓ వర్ధమాన కవి గులాబి పూల గురించి కవిత్వం రాయాలనిపించి, వాటికై అన్వేషణ సాగించాడు.

చుట్టుపక్కలంతా వెతికినా గులాబి మొక్కలు కన్పించలేదు. నగరానికి వెళ్ళితే కావలిసినన్ని కన్పించాయి. కాని అన్నీ ముళ్ళ కంచె, కాంపౌండ్ గోడల్లో బందీలుగా వున్నాయి. కొమ్మలూ రెమ్మలూ కత్తిరించబడి పొట్టిగా పూలతోటల్లో యజమానుల ఆజ్ఞానుసారం పెరిగి పుష్పిస్తున్నాయి.

ఓ ధనవంతుడి బంగళా కాంపౌండు గోడలో గులాబి మొక్కల్ని చూసి ఆకర్షితుడై వర్ధమాన కవి నిలబడిపోయాడు. గేటు మూయబడి అక్కడ ఓ బోర్డు వేలాడదీయబడి వుంది 'లోనికి ప్రవేశించరాదు' అని. కవికి లోనికి వెళ్ళకుండా వుంటానికీ, పూలని దగ్గర్నించి చూడకుండా వుంటానికీ, సాధ్యం కాలేదు. గేటు సందులోంచి అతి ప్రయాసతో దూరాడు.

ఎదురుగా పెద్ద బంగళా నోరు తెరిచి చూస్తోంది. దాని ముందు చిన్న చిన్న గులాబి మొక్కల తోట. గులాబి మొక్కలు తెలుపు, పసుపు, ఎరుపు రంగుల పూలతో చల్లగాలికి తలలూపుతున్నాయి. ముందుకు నడుస్తూ కవి సంతోష స్వాంతుడై చూస్తున్నాడు. ఈలోగా 'కవిగారు వచ్చారు. కవి గారు వచ్చారు" అంటూ గులాబి మొక్కలు ఆనందంతో అరిచాయి.

మొక్కల మొదళ్ళలో పురుగుల్ని ఏరుకు తింటోన్న పిచ్చుక ఈ మాటలు విని "ఎక్కడ...ఎక్కడ?" అంటూ కొమ్మ మీది నించి మరో కొమ్మ మీదకి దూకింది. గులాబి మొక్క "ఓ...అక్కడ...ఇటే వస్తున్నాడు. చూడు. పిచ్చుకా! పిచ్చుకా! నీవు మనందరి తరఫున స్వాగతం పలుకు" అంది. పిచ్చుక రివ్వున ఎగిరి కవిని ఆహ్వానించింది. "చివ్..చివ్..." అంటూ కవి చుట్టూ ప్రదక్షిణం చేసింది. "కవి గారికి స్వాగతం...కవి గారికి స్వాగతం..."అంది. కవి సంతోషించి ముందుకు నడిచాడు. ఒకటి, రెండు అడుగులు వేశాడో లేదో ధనవంతుని బంగళా కావలి కుక్క గోల చేస్తూ పరుగున వచ్చింది. "ఎవరు నీవు? ఇక్కడి కెందుకొచ్చావు? మా యజమాని ఇంటి వస్తువుల్ని దొంగిలించడానికా? వెళ్ళు. ఇక్కణ్నించి పోకపోతే నిన్ను కరిచి చీల్చి చెండాడుతాను" అంది. కవి కావలి కుక్క గోలతో అదిరిపోయాడు. అది బలిష్ఠమైన కుక్క. దాని కళ్ళల్లో నిప్పులు దూకుతున్నాయి. ధైర్యాన్ని కూడబలుక్కుని "నేను వెళ్తాను మహారాజా...ఇలా గొడవ చేయకు. వెళ్ళేముందు నా మాట విను. నేను ఓ కవిని..ఈ తోటలోని గులాబి పూల గురించి కవిత్వం రాయాలని వచ్చాను. నేను దొంగని కాను, మీ యజమాని వస్తువులేవీ నా కొద్దు" అన్నాడు కవి.

గులాబి మొక్కలూ శ్రుతి కలిసి "కుక్కా! కుక్కా! మన అభిమాన కవిగారు మన గురించి కవిత్వం రాస్తారట. మన యజమాని ఇంటి వస్తువేదీ ఆయనకు అవసరం లేదు. గొడవ చేయకు" అన్నాయి. కుక్క కిమ్మనకుండా కూచుంది. మళ్ళీ "ఏం చేస్తావో నేనిక్కడే వుండి చూస్తాను" అంది. కవి గులాబి మొక్కల్ని కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

ఓ తుమ్మెద "గుంయ్..." అంటూ ప్రణయగీతం ఆలపిస్తూ గులాబి మొక్క మీద కూచుని పువ్వుని ముద్దాడింది. మొక్క మొలక నవ్వులతో సిగ్గిల్లి "ఛీ".... సిగ్గులేని వారు. చూడండి! అదుగో కవి మన గురించి కవిత్వం రాయాలని వచ్చారు. అతని ముందే...ఇదంతా ఏమిటి?" అంది. తుమ్మెద కూడా లజ్జతో కుంచించుకు పోయి "క్షమించు, మళ్ళీ వస్తాను" అంటూ ఆకుల మాటున తల దాచుకొన్నాడు. కవికి ఈ సయ్యాట నవ్వు తెప్పించింది.

చల్లగాలికి తలలూపుతోన్న మొక్కల్నీ, వికసిస్తోన్న పూలనీ తదేకంగా చూస్తే...ఈ మొక్కల్లో ముందటి ఉత్సాహం కన్పించడం లేదు. "మీలో ఇప్పుడు మునుపటి ఉత్సాహమూ, మాధుర్యమూ గోచరించడం లేదు. అలసి చిక్కిపోయినట్లు కన్పిస్తున్నారు...ఏమైంది మీకు?" అని అడిగాడు కవి.

హృదయాన్ని చదవగల కవులతో తాము అనుభవించే వేదనల్నీ, బాధల్నీ దాచి పెట్టడంలో అర్థం లేదనుకొని ఓ గులాబి మొక్క కారణం చెప్పసాగింది.

"ఓ ఆపద్బాంధవా! ఈ నా స్థితికి కారణం నేనింకా బానిసత్వంలో బతుకునీడ్చడమే! స్వేచ్ఛగా నేల తల్లి ఒడిలో వేళ్ళని దించి జీవించడానికి ఈ జనం అనుమతించడం లేదు. నేను ఓ తొట్టిలో బందీనై యజమాని వేసే అన్నం కోసం ఎదురు చూస్తూ కూచోవాలి. ఎత్తుగా పెరగడానికీ స్వతంత్రురాలిని కాను. యజమాని కూతురి చేతికందేంత వరకే పెరగాలి. అంతకన్న ఏపుగా పెరిగితే కత్తెరతో తోటమాలి నిర్దయగా నా చేతుల్ని నరుకుతాడు. యజమాని కూతురి చేతి కందేట్టు పుష్పించి జీవిస్తున్నాను. ఇది నా బతుకు గొడవ" అంది.

గులాబి మొక్క బాధని తామూ పంచుకొంటూ పిచ్చుకా, కావలి కుక్కా వింటూనే కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాయి. కవి హృదయంలో తుఫాను రేగింది. మనస్సు అల్లకల్లోలమైంది. తన బాధని మిత్రులతో పంచుకొంటోన్న మొక్కని చల్లగా ప్రేమగా ఒళ్ళు నిమిరి ఓదార్చగానే...మొక్క ఉల్లాసంతో తేలిక పడింది...పులకితగాత్ర అయింది. తన లేత కొమ్మకి ఓ అందమైన పువ్వు వికసించింది.

"ప్రియమైన కవీ! నా వ్యధని నీతో చెప్పుకోడంతోనే నెన్నడూ అనుభవించని ఉల్లాసాన్ని పొందాను. నా బతుకులోని తియ్యని ఈ క్షణాల గుర్తు కోసం మీకు కానుకగా ఈ పువ్వును ఇస్తున్నాను. దయతో స్వీకరించండి" అంది గులాబి మొక్క. అంతలోపే యజమాని కూతురు కావలి కుక్కని వెదుకుతూ అక్కడికొచ్చింది. కుక్క కవిని మొక్కల్లో దాక్కోమని సలహా ఇచ్చింది. కవి మొక్కల్లో దాక్కొని తొంగి చూస్తున్నాడు.

"టామీ! నిన్ను ఎక్కడని వెదికానో తెలుసా? వెతికి వేసారి పోయాను. అక్కడ నీ కోసం బ్రెడ్ తెచ్చాను. ...." అంటూనే గులాబి మొక్కల్లో అంతకు ముందే దాచిన అపూర్వమైన పువ్వుని చూసి గంతులేసింది. "ఎంత అందమైన పువ్వు! నేనింతవరకూ ఇలాంటి పువ్వుని చూడనేలేదు" అంటూ పువ్వుని తుంచడానికి తయారైంది.

గులాబి మొక్క తల్లడిల్లుతూ "అలా చేయకు .....!" అంటూ అంగలార్చింది. ఆ అమ్మాయికి అది విన్పించనే లేదు. ముందు కదుగేయగానే కావలి కుక్క అడ్డంగా నించుంది.

"టామీ! నీవు తమాషా చేయకు. వెళ్ళి బ్రెడ్ తిను. నేను ఈ పువ్వుని తెంపుతాను. ఎంత అందమైన పువ్వు చూడు" అంటూ అమ్మాయి మళ్ళీ ముందుకు నడిచింది.

కుక్క కోపంతో "భౌ..భౌ...గుర్..." అంది. అమ్మాయి "ఈ కుక్కకి ఏమైంది? విడువు నన్ను టామీ!" అంది.

"చూడు. ఈ పువ్వుని తెంచవద్దు. అది కవికి సమర్పింపబడింది. దాన్ని ముట్టితే నిన్ను యజమాని కూతురని కూడా చూడను" అంది కుక్క. అమ్మాయికీ అర్థం కాలేదు. మళ్ళీ పువ్వుని తెంపబోయేలోగా ఛంగున దూకి అమ్మాయి చేతిని కరిచింది. మ్యాక్సీని చించి పోగులు పెట్టింది. అమ్మాయి "అయ్యో! నాన్నా! కుక్క...నన్ను చంపుతోంది, అయ్యో!" అంటూ మొత్తుకొంది.

బంగళాలోంచి యజమాని గొంతు విన్పించింది. ఆయన తుపాకీ బయటకి వచ్చింది. లిప్తపాటుతో అది "ధం..ధం.." అంటూ నిప్పులు చిమ్మింది.

కావలి కుక్క అల్లంత దూరంలో ఎగిరి పడింది. దాని ఎద గుండుతో గాయమై రక్తం జివ్వున చిమ్మి గులాబి మొక్క మొదట్లో రక్తం మడుగుకట్టింది.

కవి చూస్తూండగానే అపూర్వ సుందరమైన పువ్వు నెత్తుటి రంగు గులాబీలా మారిపోయింది. గులాబి మొక్క రక్తపు రంగు నీటిని చూసి విస్తుపోయింది. విషయం తెలిసి భోరున విలపించింది. దాని కొమ్మ కొమ్మకీ నెత్తుటి రంగు పూలు పూచాయి.

కవి హృదయంలో అగ్నిపర్వతం బద్దలైంది. కవిత్వపు లావా బయటికి చిమ్మింది. వర్ధమాన కవి గులాబి మొక్క నించి ఓ ముల్లు తెంచి రక్తంతో అద్ది తన కవితకి శీర్షిక నిర్ణయించాడు.

"రుధిర గీతం".

– *ఆంధ్రజ్యోతి వారపత్రిక 29-11-91*

గోదావరి

– *మలయాళ మూలం : వైశాఖన్*

డిసెంబర్ మాసం. ప్రభాత సమయం. చలి పెడుతోంది. అయినా లేయెండ నులివెచ్చదనం సోకుతోంది. రెండింటి అనుభవం తెలిసిన అతడు తెరిచిన పుస్తకం వైపు అలాగే చూస్తున్నాడు. కళ్ళద్దాలపై పడిన ఎండ అక్షరాలను కనిపించకుండా చేస్తోంది. అసలు సమస్య అది కాదు. కొంతసేపట్నించి అతడు ఊరికే పుస్తకంలోకి చూస్తూ కూచోవడం. కాసేపు చదివేసరికల్లా కళ్ళు అలిసిసొలసి పోయాయి. ఏకాగ్రతకు భంగం కలిగింది. అయినా అతడు పెద్దగా బాధ పడలేదు. కారణం తన శరీరం డిసెంబర్ నెల చలినీ, లేయెండ తాలూకు వెచ్చదనాన్నీ ఏకకాలంలో చదువుతోంది. చెవులు ఇంటి లోపలి వాతావరణాన్నీ, చప్పుళ్ళనీ చదువుతున్నాయి. వరండాలోని స్తంభపు నీడ క్రమంగా పొడుగవుతోంది. అది అతడి కుర్చీని మింగడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. ఇంటి లోపల్నించి వైవిధ్యభరితమైన చప్పుళ్ళు చెవులకు సోకుతున్నాయి. ప్రతి శబ్దమూ సంకేతాక్షరాల్లాగా వినవస్తోంది. చెవికి చేరిన చప్పుళ్ళను మనసు వివరంగా చదువుతోంది. కొడుకేమో పుస్తకాల దుమ్ము దులుపుతూ వాటిని ఒకచోట కట్టలు కట్టలుగా పెడుతున్నాడు. మనవడు మనూ పెద్ద సూట్‌కేసు లాక్కుంటూ వస్తున్నాడు. సుమతి వంటింట్లో ఆ పూట పచ్చడికి అవసరమైన కొబ్బరి మిక్సీలో వేసినట్లుంది.

"ఒరేయ్ మనూ! అది తెరవకూడదని చెప్పానా? మనూ!! అదక్కడ ఉంచు. అదుగో తాతయ్య వరండాలో ఉన్నాడు. వెళ్ళు. మంచి కథలు చెబుతాడు." ఆ మాటలన్నది కోడలు.

కొడుకు ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అసహనాన్ని సైతం అతడి మనస్సు స్పష్టంగా చదవగల్గుతోంది. సొంతంగా ఇల్లు కట్టుకున్నప్పటికీ, ఆ ఇంట్లోకి వెళ్ళడం కొడుక్కి ఏ మాత్రం ఇష్టం లేదు. తెల్లవారితే ఈ ఇల్లు ఖాళీ చేయాలి.

అతడి లోలోపల చిన్న నవ్వొకటి విరిసి మాయమైపోయింది. సొంత ఇంట్లో తన కొడుకు మనూకి తండ్రిగా ఉండడం కన్నా, ఈ కిరాయి ఇంట్లో పిల్లాడిలా గడపడంలోనే ఎక్కువ ఆనందం ఉన్నట్లుంది. ఎందుకంటే, ఈ ఇంటికీ, తన కొడుకు పుట్టడం, పెరగడం లాంటి బాల్యస్మృతులకీ దగ్గరి సంబంధాలున్నాయి.

మళ్ళీ అతగాడు పుస్తక పఠనంలోకి వెళ్ళాలనుకున్నాడు. పుస్తకంలోని ఇంగ్లీషు అక్షరాలపైన కాలం తాలూకు తీపిగుర్తుగా ఒక మాట రాసి వుంది. అది తాతయ్య.

ఆశ్చర్యంగా ఉంది. ఇప్పుడు మనవడు మనూకి తండ్రిగా మారిన తన కొడుకు నందన్‌ని నిన్ననే కదూ రాజమండ్రిలోని వీధులన్నీ చేయి పట్టుకుని తిప్పింది! కొడుకు వేసిన యక్ష ప్రశ్నలకు, లక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పీ చెప్పీ విసుగు వచ్చింది!! ఆశ్చర్యం! కాలమూ, జీవితమూ చాలా వేగంగా పరుగులు తీస్తున్నాయి. ఆ వేగం ఉధృతమైన నదీ ప్రవాహంలా ఉంది. తనేమో ఇంకా ఈ వరండాలో ఈ లేయెండలోనే కూచుని ఉన్నాడు. స్తంభపు నీడ తనను అతివేగంగా సమీపిస్తోంది. ఏదో తెలియని అసహాయత ఆవరించినట్లు అనిపించింది. మనసు మారు మూలల్లోంచి ఏదో ఒక మాట తనను ఆదుకునే మంత్రంలా వినిపించింది. వెంటనే ఇది కలా, నిజమా అనిపించింది.

గతవారం చదివిన అలక్సిస్ కార్రెల్ పుస్తకంలోని ఒక వాక్యం అతడికి స్ఫురణకు వచ్చింది. 'శరీరంలో వీర్యకణాల ఉత్పత్తి తగ్గిపోయినప్పుడు, తను తప్ప ఈ ప్రపంచంలోని అన్నింటికీ వేగం పెరిగినట్లు అనిపిస్తుందిట'! వయస్సుపై బడుతుంటే ఇలా అనిపించడం సహజమే!

దూరంగా పొలాలపైన కనిపిస్తున్న చెట్ల వరుసల మీది మంచు, నెరసిన వెంట్రుకల్ని గుర్తు చేస్తున్నది. ఎందుకో ఆ వైపు అతడలాగే చూస్తూ కూచున్నాడు. లేయెండ క్రమంగా ఎండగా ముదురుతున్నప్పుడు మంచు కరిగి మళ్ళీ ఆకాశ నీలిమ తేటగా కనిపించకతప్పదు.

"నాన్నా!" కొడుకు నందన్ పిలుపు అతణ్ణి ఈ లోకంలోకి తెచ్చిపడేసింది.

"సర్దుతున్న పుస్తకాల్లో ఈ ఉత్తరం కనిపించింది. తెలుగులోనో, కన్నడంలోనో రాసిన ఉత్తరంలా ఉంది" అంటూ అతణ్ణి సమీపించాడు.

అతడు పుస్తకాన్నీ, ఉత్తరాన్నీ చేతిలోకి తీసుకున్నాడు. అది నల్లని బైండింగ్‌తో ఉన్న పుస్తకం. స్టేషన్ మాస్టర్స్ హ్యాండ్ బుక్. మరి ఉత్తరం..?

"ఉత్తరం కావలిస్తే ఉంచేద్దాం నాన్నా! మీ అల్మారాలో భద్రపరుస్తాను" అన్నాడు నందన్. అతడు ఆ ఉత్తరం వైపే చూస్తున్నాడు.

"నందూ! వీటిని నేను భద్రపరుస్తాలే. నువ్వెళ్ళు" అన్నాడు.

నందన్ నవ్వుతూ "స్టేషన్ మాస్టర్లు రిటైరయ్యాక కూడా పాటించాల్సిన నియమాలు ఈ హ్యాండ్ బుక్‌లో ఉండి ఉంటాయి" అన్నాడు. కొడుకు వేసిన జోక్ విని అతడు నవ్వడానికి ప్రయత్నం చేశాడు. కానీ నవ్వలేకపోయాడు. నందన్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. అతడు ఆ పాత ఉత్తరంలోకి కళ్ళు సారించాడు. తెలుగులో వైలట్ పెన్సిల్‌తో రాసిన ఆ ఉత్తరాన్ని చూడగానే అతడికి పాత స్మృతులు గుర్తుకొచ్చాయి.

ఆ జ్ఞాపకాల పరంపర సమస్త ప్రపంచాన్నీ కదపగల్గిన, కుదపగల్గిన ఒక తుఫానులా అతడి మనస్సులో చెలరేగింది. చేతిలో ఉన్న ఉత్తరం కూడా వణక నారంభించింది.

అపరాధ భావంతో తలదించుకుని నిలుచున్న ఒక యువకుడు అతడి అంతరాంతరాళాల్లో ఈనాటికీ స్పష్టంగా కనిపిస్తున్నాడు. అతడికి ఆనందం కలిగింది. దాంతో పాటే ఆత్మన్యూనత కూడా కలిగింది.

హ్యాండ్ బుక్‌లోంచి ఉత్తరం తీసి తనకు తెలుగు అక్షరాలతో ఉన్న పరిచయాన్ని గుర్తుకు తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు.

ఆ అక్షరాలు తులసి రాసినవి.

మళ్ళీ అప్పటి పరిచయాన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి విశ్వప్రయత్నం చేశాడు. ఆశ్చర్యం! ముప్పయి ఏళ్ళ కిందట ఉత్తరంలోని విషయాలన్నీ పూర్తిగా గుర్తుకు తెచ్చుకోవడంలో అతడు సఫలీకృతమయ్యాడు.

పాత జ్ఞాపకాల నీలినీడలు మనస్సులో ప్రవేశిస్తున్నాయి. ఆ నీడలకు రక్తమాంసాలనిచ్చి సజీవ మూర్తులుగా మార్చడానికి ఎంతో శ్రమించాడు. వర్తమానంలోంచి అమాంతం మనస్సును గోదావరి తీరంలో ఉద్యోగం చేసిన నాటి ఒక చిన్న రైల్వే స్టేషన్ పరిసరాల్లోకి తీసుకుని వెళ్ళాడు.

వరండాల్లోని స్తంభపు నీడ మరింత పొడవై, కుర్చీతోపాటు అతణ్ణి కూడా మింగి తిరిగి విముక్తుణ్ణి చేయడం అతడు గమనించనేలేదు. గోదావరి విస్తారంలోకీ, దానిపై ఉన్న వంతెన మీద సాగిపోతున్న రైలులోకీ అతడి మనస్సు మళ్ళింది.

"ఏమైంది మీకు? ఉలుకూ, పలుకూ లేకుండా అలా ఉండిపోయారు?" భార్య ప్రశ్నకి అతడు "ఏమో...అదోలా ఉంది" అన్నాడు.

"పొద్దుటి పూట మంచు పడుతున్నప్పుడు లేయెండలో కూచోవడం మంచిది కాదు".

ఈ మాటలు పైకి మామూలుగానే ధ్వనించినా, సుమతి మనస్సులోని ఆందోళన అతడికి తెలియంది కాదు. అతడు లేచి తిండీ, తిప్పలు పూర్తి చేశాడు. కిటికీ దగ్గర పడక వేసుకుని కళ్ళు మూసుకున్నాడు.

ఇందాకటి రైలుబండి వంతెన దాటిపోయినా దాని ప్రతిధ్వని ఇంకా వినవస్తోంది. ఆ పరిసరాల్లో అది కొన్ని నిముషాల పాటు ధ్వని తరంగాలను కుమ్మరిస్తూ వెళుతోంది. తర్వాత అంతా నిశ్శబ్దం. పరిపూర్ణ నిశ్శబ్దం. మళ్ళీ క్రమంగా చిన్నా చితక చప్పుళ్ళు, ఒళ్ళు విరుచుకుంటున్నాయి.

చల్లని గాలి. పండు వెన్నెల. గోదావరి అలలపై చంద్రుడు ఈదుతూ ఉండడం స్టేషన్ వరకూ కనిపిస్తోంది. రాత్రి డ్యూటీకి వచ్చిన థామస్ మాస్టార్‌కు చార్జ్ ఇచ్చినప్పటికీ, అతడింకా కాసేపు అక్కడే వుండిపోయాడు.

థామస్ అక్కడ బాగా పాతబడిపోయిన మనిషి. అతడు డ్యూటీలో జాయినైన మర్నాడు థామస్ తాళం చెవులిస్తూ "ఇంద, ఇవి నా క్వార్టర్స్ తాళం చెవులు. నీకు క్వార్టర్సు అలాట్ కావాలంటే కొన్నాళ్ళు పడుతుంది. అందాకా ఏ లాడ్జిలోనో ఉండిపోవడం బావుండదు. ఇప్పుడు నేనొక్కణ్ణే. నా భార్యాపిల్లలు వెకేషన్లో మాత్రమే ఇక్కడికొస్తారు" అన్నాడు. అతడికి ఎంతో ఊరట కలిగిందా మాటలతో. ఇక్కడి విషయాలన్నీ అడిగి తెలుసుకోవచ్చు కదా అనుకున్నాడు.

ఇక్కడ మొట్టమొదట దాటవలసిన వైతరణి తెలుగు భాష. అది అతడికి రాదు. ముందు అత్యవసరమైన కొన్ని తెలుగు మాటలు నేర్చుకోవాలి. తెలుగు భాష గురించి తెలుసుకోవడానికి ముందుగానే థామస్ మాస్టర్ తూర్పు గోదావరి జిల్లా విశేషాలు కొన్ని వివరించాడు. ఆ తర్వాత రాజమండ్రి, కాకినాడ పట్టణాల గురించి చెప్పాడు. "ఏమండీ! బాగున్నారా?" "నాకు తెలుగు బాగా తెలియదు" ఇలాంటి చిన్న చిన్న వాక్యాలు కొన్ని నేర్పించాడు.

ఓ రోజు అతడికి తెలుగు భాషలోని ఒక మాట పదే పదే గుర్తుకొచ్చింది. అది 'వస్తావా?' అనేది. ఈ మాట మునుపెన్నడో అతడు విన్నదే! ఎప్పుడు? ఎక్కడ? అట్లాగే ఆలోచనల్లో కూరుకుపోయి డ్యూటీ నుంచి వస్తున్నాడు. సరిగ్గా రాత్రి పదకొండుగంటల సమయం. పరిసరాల్లో ఏ అలికిడీ లేదు. జనమూ లేరు. చల్లగాలి వీస్తున్నది. ప్లాట్‌ఫారం దాటి క్వార్టర్సు వైపు వెళుతున్నపుడు అతను మళ్ళీ తనకు తానే ప్రశ్నించుకున్నాడు. అసలు తెలుగులోని ఈ మాటకు ఎందుకంత ప్రత్యేకత? అతణ్ణి ఆశ్చర్యపరుస్తూ జ్ఞాపకాల సుదూర తీరాల్లోంచి మెరుపులా జవాబు స్ఫురించింది. ఎర్నాకుళం కాలేజీలో చదువుతున్నప్పుడు అతడితో పాటు మరికొందరు గొంతు కలిపి పాడిన పాట. "రామయ్య వస్తావయ్యా...రామయ్యా వస్తావయ్యా...మేరా దిల్ తుజ్‌కో దియా".

అయ్యో! మైనే దిల్ తుజ్‌కో దియా కదూ తర్వాత పాటలో ఉన్నది. ఈ పాటకు ఎలాంటి అర్థ తాత్పర్యాలు తెలియకుండా పాడిన కాలమది. ఇందాకటి "వస్తావా?" మాట ఆ పాటలో లేదూ! కాలేజ్ ఆడిటోరియంలో ఈలలూ గోలలూ లెక్కచేయకుండా తను పాడిన ఆ పాట కోరస్‌తో సహా థామస్ మాస్టర్ క్వార్టర్సు దాకా వస్తోంది. వీధికి అటువైపు క్వార్టర్సు. వీధి అంటే బావుండదేమో! అది రైల్వే వాళ్ళ దారి.

అవతలి వీధిలోని లైటు వెలుతుర్లో ఎవరో నిలుచున్నట్లున్నది. ఇప్పటివరకూ గుండె గొంతుకలో కొట్లాడినట్లున్న "రామయ్యా వస్తావయ్యా" పాట వెంటనే సన్నబడింది. మరికొంత దూరం వెళ్ళగానే మసక వెలుతురులో వున్న ఆకారం స్పష్టంగా కనబడింది. ఆమె లంగా ఓణీలతో ఉంది. నెత్తిమీద ముసుగు వేసుకుంది. అంత తక్కువ వెలుతురులోనూ చక్కగా కనిపించిన ఆమె శరీర సౌష్ఠవం అతడి మదిలో పెద్ద తుఫానుకు కారణమైంది. ఆ పిల్లను దాటి వెళుతూ అతడు అప్రయత్నంగానే 'వస్తావా?'అన్నాడు. ముందుకు సాగిపోయాడు. కొంత దూరం నడిచి వెనక్కి తిరిగి చూసేసరికి వెన్నులో వణుకు పుట్టింది. ఆ అమ్మాయి వెనుకగా నాలుగైదు అడుగుల దూరంలో అతణ్ణి అనుసరిస్తోంది.

"వస్తావా?" అని యథాలాపంగానే అన్నాడు. అంతే! మరిప్పుడు ఏం చెయ్యడం? చుట్టూ చూశాడు. రెండు క్వార్టర్లలో లైట్లు వెలుగుతున్నాయి. అది కూడా కాస్త దూరంలోనే! తన వెంట రావడం ఎందుకని అడిగితేనో? అట్లా అడిగేందుకు అవసరమైన తెలుగు అతడికి రాదు. అంతేకాదు, ఈ తంతు ఎవరైనా గమనిస్తే ఎట్లా?

అతడికి అంత చలిగాలిలోను ముచ్చెమటలు పట్టాయి. థామస్ మాస్టర్ క్వార్టర్సు చేరేసరికి ఆ అమ్మాయిని యాంత్రికంగా చూశాడోసారి. 'ఇక్కడే ఉండు' అని సైగ చేశాడు. క్వార్టర్సు పెరటి ద్వారం వైపు వెళ్ళాడు. తాళం తీసేందుకు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. లోపలికి వెళ్ళాడు. వెనకాల పెద్దగా ఎత్తయిన గోడలు. వెనక భాగంలో లైటు వేయకుండానే వీధి వైపున తలుపు మెల్లగా తెరిచాడు. ఆ పిల్ల నీడలాగా లోపలికి వచ్చింది. అతడు తలుపులు దడాలున బిడాయించాడు. గుండె దడ మామూలు స్థాయికి రావడానికి చాలాసేపు పట్టిందతడికి.

మసక వెలుతురులో తనకి ఎదురుగా నిలుచున్న ఆ అమ్మాయినే తదేకంగా చూస్తుండిపోయాడు. విశాలమైన కళ్ళు. చక్కని రూపం. అందమైన ముఖం. అరే.. ఈమెను ఇంతకుముందు ఎక్కడో చూసినట్లుందే! ఎక్కడ? ఎప్పుడు? కేరళలో..తను పుట్టి పెరిగిన ఊళ్ళో వున్న ఏ అమ్మాయితోనైనా ఈ అమ్మాయిని పోల్చవచ్చా? అక్కడి ఏ అమ్మాయి పోలికలైనా ఈ పిల్లలో ఉన్నాయా?

స్టేషన్ వదిలిపోతున్న ఏదో రైలుబండి కూతతో అతడు మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాడు. సాధ్యమైనంత త్వరగా ఈమెను పంపించేయాలి. పంపించడమా? ఇంత మంచి అవకాశాన్ని చేజార్చుకోవడమా? జీవితంలో ఇంతవరకు స్త్రీ అంటే ఏమిటో తెలీదు. ఒకవేళ ఆ విషయం ఆనోటా ఈనోటా పడి బయటకు పొక్కితే... ఉండడానికి చోటు కల్పించిన థామస్ మహానుభావుడి ఇంట్లోనే ఇంత పనా? ఛీ! బయటకు పంపించేయాలి. వణికిపోతున్న అతడి చేతులు జేబులోకి దూరి ఓ నోటు బయటకు తీశాయి. పదిరూపాయల నోటు. ఆమెకు ఇవ్వబోయాడు. మళ్ళీ సైగలతోనే "వెళ్ళు... వెళ్ళు..బయటకు వెళ్ళిపో" అంటూ బతిమాలుతున్న ధోరణిలో అన్నాడు.

ఆ పిల్ల విషాదంగా నవ్వుతూ "మీరు పిలిస్తేనే కదా నేనొచ్చింది?" అంది తమిళంలో. ఆ మాటలతో అతడికి కొంత ధైర్యం వచ్చింది. కారణం అతడికి తమిళం బాగా తెలుసు.

"నేనూరికినే వస్తావా? అని తమాషా చేశాను. ఇంద... ఈ పదిరూపాయలు తీసుకో..దయచేసి వెంటనే వెళ్ళిపో".

"చినబాబుగారూ! నేనలాంటిదాన్ని కాను. నా గురించి మీకు తెలీదు కదా! నేను పోలిగాని కూతుర్ని. పేరు తులసి".

పోలిగాడు అని అంతా పిలిచే పోలయ్య స్టేషన్‌లో స్వీపరుగా పని చేస్తాడు. అప్పుడప్పుడు పోలిగాడికి బదులుగా ప్లాట్‌ఫారం ఊడ్వడానికి ఈ పిల్ల వస్తూ ఉండేదని అప్పుడు గుర్తొచ్చిందతడికి.

"మరి ఇంత రాత్రిపూట?" ప్రశ్నించాడతను.

"ఇంట్లో గొడవపడి వచ్చేశాను" అంది.

"సరి..సరి...ఇంద...ఈ డబ్బులు తీసుకో...ఎవరైనా చూస్తారు. వెంటనే వెళ్ళిపో"

"డబ్బులొద్దు". మిలమిల మెరిసే తన కళ్లను ఆమె కిందికి దించుతూ అంది. ఒక నిముషం పాటు అలాగే ఉండి, ఆ తర్వాత మెల్లిగా తలుపులు తీసుకుని బయటకు నడిచింది.

మర్నాడు పొద్దుట డ్యూటీకి వెళ్ళేటప్పటికి తులసి ఫ్లాట్‌ఫారం ఊడుస్తోంది. ఆమె దగ్గర్నించే దాటిపోయాడు. నాలుగడుగులు ముందుకు పడ్డాయో లేదో, వెనకాల చీపురుశబ్దం ఆగిపోయింది. ఆమె తిరిగి ఊడవడం మొదలు పెట్టింది. సాధ్యమైనంత సహజంగా థామస్ మాస్టర్‌తో "ఆ అమ్మాయి ఎవరు?" అంటూ ప్రశ్నించాడతను.

"అదా? అది మన ఎస్.ఎస్.పి. పోలిగాడి మొదటి భార్య కూతురు. మొదటి భార్య చనిపోయాక రెండోదాన్ని చేసుకున్నాడు. ఈ అమ్మాయి పేరు తులసి. నిన్న రాత్రి ఈ పిల్ల ఇల్లు చేరలేదని పోలిగాడు ఆఘమేఘాల మీద ఇక్కడికొచ్చి అడిగాడు. లేదని చెప్పగానే, ఎంత వేగంగా వచ్చాడో, అంతే వేగంగా వెళ్ళిపోయాడు."

అతడి హృదయంలో అగ్ని పర్వతాలు బద్దలయ్యాయి. అదృష్టం బాగుండి దొరికిపోలేదు. థామస్ మాస్టర్ కాసేపయ్యాక వెళ్ళిపోయాడు. తులసి గురించి తెలిసిన మరికొన్ని విషయాలు అతడికి మరింత ఆశ్చర్యం కలిగించాయి.

బొగ్గు కాంట్రాక్టరూ, పెద్ద భూస్వామీ అయిన భాస్కర్ రెడ్డిగారికి తులసిని మొదటిసారి చూసినప్పట్నుంచీ కంటిమీద కునుకే కరువయిందట! అతడు వెంటనే పోలిగాని దగ్గరికెళ్లాట్ట. ప్రతి సంవత్సరం తులసికి నాలుగు పట్టు చీరలు, ఉగాది పండక్కి పంపడం మొదలైంది. పైగా ఆరు బస్తాల వడ్లు, దసరాకు మళ్లీ రెండు బస్తాలు, నెలనెలా ఖర్చులకు డబ్బులు. తులసిని ఉంచుకుంటాను అన్నాడట! అంటే ఉంపుడుగత్తె హోదా అన్నమాట. పోలిగానికి పూర్తి సమ్మతమైంది. భాస్కర్ రెడ్డి చిల్లర మల్లర మనిషి కాదు. రాత్రిళ్ళు గూడ్సు డ్రైవర్లకు సారాయో, ఆడాళ్ళనో సప్లై చేస్తూ వ్యాగన్లలోంచి

నాణ్యమైన బొగ్గును లారీల్లోకి దింపగలిగే సమర్థుడు. పై స్థాయిలో అతడికి పలుకుబడి కూడా ఉంది. అతడి నివాసమేమో 'టెన్నప్' అని ఊరివాళ్ళంతా పిలిచే బంగళాలో. భార్యకు కిలోల కొద్దీ బంగారముందట! చాన్నాళ్ళ కిందట ఎప్పుడో ఓ రాత్రిపూట టెన్ అప్ అనే ఎక్స్‌ప్రెస్సూ, ఒక గూడ్సు బండీ గుద్దుకున్నాయట. అది పెళ్ళిళ్ళ సీజన్. ఆడ ప్రయాణికుల మెడల్లో అన్నీ నగలే! సగం చచ్చీ సగం బతికీ సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్న స్త్రీల నగలూ, పర్సులూ, సూట్ కేసులూ...అన్నింటినీ భాస్కర్ రెడ్డి తన అనుచరులిద్దరితో కలిసి తస్కరించాడట. ఆ తర్వాత భాస్కర్ రెడ్డి కట్టిన ఈ బంగళాకు ఊరివాళ్లు టెన్నప్ అని నామకరణం చేసుకున్నారని వినికిడి.

తులసి, రెడ్డికి లొంగలేదట. రెడ్డి కూడా తర్వాత అటువైపు రాలేదట. తనకు ఏదో భయంకరమైన రోగం సోకిందన్న వార్త సృష్టించి, ఆ అమ్మాయి రెడ్డి నుండి ఎలాగోలా తప్పించుకోగలిగిందట. రెడ్డిగారి మాట వినలేదని పోలిగాడూ, వాడి రెండో పెళ్ళామూ బూతులు తిట్టడమే గాక బాగా కొట్టారట. థామస్ మాస్టర్ వెళ్ళిన వాడల్లా తిరిగొచ్చి "పాపం! ఆమె పారిపోకుండా మరేం చేయగల్గుతుంది? అయినా...మళ్లీ తిరిగి రావడమే నాకు ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు.

ఈసారి థామస్ వెళ్ళిపోయాడు. అతడు నీరసంగా కుర్చీలో కూలబడిపోయాడు. తర్వాత బ్లాక్ బెల్ కొట్టడం వినిపించి లేచాడు. అనివార్యమైన పని. ఓ గూడ్సుకు లైన్ క్లియర్ చేయాలి. చేశాడు. తిరిగొచ్చేసరికి ఎదురుగా అతణ్ణే రెప్ప వేయకుండా చూస్తున్న తులసి కనిపించింది. ఆ అమ్మాయి వెనకనుండి గోదావరి అలల మీంచి వస్తున్న మిలమిలలాడే సూర్య కిరణాలు అతడి కళ్ళల్లో గుచ్చుకున్నాయి.

"తులసీ! నిన్న రాత్రి నేను.." అంటూ నసిగాడు.

"నాకేమీ చెప్పక్కర్లేదు" అంది.

అతడు తల దించుకున్నాడు. ఆమె ఏమైనా మాట్లాడుతుందేమో అనుకున్నాడు. చిన్ననవ్వు ఒకటి గాల్లో తేలి వస్తున్నట్లు అనిపించింది. అతడు తలెత్తి చూసేసరికి అక్కడ తులసి లేదు. ఆ తర్వాత మూడు రోజుల వరకూ ఆమె గురించిన ఆలోచనలే! ఎడ తెరిపి లేని ఆలోచనలు. చాలా కష్టమ్మీద ఆలోచించడం మానుకున్నాడు. మనస్సు అల్లకల్లోలంగానే ఉంది. తులసి తనలో ఊపిరి కూడా సలపనివ్వని ఆలోచనగా మారిపోయింది. ఆమెను మరిచిపోయేందుకు అతడు తన పనిలో బిజీ అయిపోయాడు. రిజిస్టర్లన్నీ తిరగేశాడు. ఎంట్రీలు గట్రా పూర్తి చేశాడు.

ఒకనాటి రాత్రి డ్యూటీ ముగియబోతోంది. ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. అప్పుడే స్టేషన్ కొచ్చిన ప్యాసింజర్ బండిలో వచ్చిన తపాలా కవర్లు చించి ఉదాసీనంగా చదువుతున్నాడు. వాటిల్లో ఏవో రైలు ప్రమాదాల నివారణ చర్యలకు సంబంధించిన సర్క్యులర్లున్నాయి. ఒక కవర్లో మాత్రం ఆర్డర్ ఉంది. అది అతడికి సంబంధించినదే! విజయవాడలో స్పెషల్ డ్యూటీ నిమిత్తం నియమించిన వారిలో అతడి పేరు కూడా ఉంది. ఈ స్థానచలనం తాత్కాలికమే. రిలీవ్ చేయడానికొచ్చిన థామస్ మాస్టర్ "ఎందుకు బాధపడుతున్నావ్? ఇట్ విల్ బి ఏ గుడ్ ఎక్స్‌పీరియన్స్ ఫర్ యూ. భార్యా పిల్లలు లేని ఈ సమయంలోనే ఎంజాయ్ చేయాలోయ్" అన్నాడు.

ఇంకా విజయవాడ వెళ్లలేదు. ఒకరోజు రాత్రి డ్యూటీలో ఉన్నాడు. ఏమాత్రం విశ్రాంతి లేదు. పని ఒత్తిడి విపరీతంగా ఉంది. తిండి ఏదయినా లోపలికి తోస్తే తప్ప ఆత్మారాముడు శాంతించేట్టులేడు. గంటల తరబడి నిద్రిస్తే తప్ప శరీరం ఒక స్థాయికి వచ్చేట్టు లేదు. అతడు లేచి హోటల్ వైపు బయల్దేరాడు. ఆకాశం నల్లగా ఉంది. హోటల్‌కి వెళ్ళకుండానే క్వార్టర్సుకి వచ్చాడు. నిద్రపట్టక మంచమ్మీద పడి అటూ ఇటూ దొర్లాడు. తలుపు సందుల్లోంచి లోనికి వస్తున్న గాలి ఈలలు వేస్తున్నట్లుగా ఉంది. వర్షం వస్తుందేమో! లేచి వెనుక వరండాలో కొద్దిసేపు నించున్నాడు. గచ్చుమీద వాన చినుకులు పడి చెదిరి పోతున్నాయి. మరి కాసేపు నించున్నాడు. ఇంతలో తలుపు తడుతున్న చప్పుడయ్యింది. తలుపులు తెరిచాడు. వర్షంలో పూర్తిగా తడిసి ముద్దయి పోయిన తులసి లోపలికొచ్చింది. వస్తూనే తలుపులు వేసింది. ఆమె రొప్పుతూ రోజుతూ "ఎవరూ చూళ్ళేదు సార్" అంది. అతనికేం మాట్లాడాలో తోచలేదు. ఆమె కళ్లలోకి తన నిద్ర కళ్ళతో చూస్తూనే బొమ్మలా నుంచుండిపోయాడు. ఆమె తల మీదా, బుగ్గలమీదా వాన చినుకులు. ఆ చినుకులపై బయట నామమాత్రంగా ఉన్న వెలుతురు ప్రతిఫలిస్తోంది.

"చిన్న మాస్టర్ విజయవాడ వెళుతున్నారటగా!" అంది. నిజానికి ఆ మాటల్ని ఆమె కన్నీరు మున్నీరుగా రోదిస్తూ అంది. అతడు నిరుత్తరుడై ఆమె వైపు చూశాడు. అతడి తలంతా చెమటతో తడిసిపోయింది. ఆ శీతల వాతావరణంలో ఏవో సువాసనలు. ఆ సౌరభాలు అతణ్ణి మరులు గొల్పుతున్నాయి. ఇంకా నిరుత్తరుడిగానే ఉన్నాడు. ఒకవైపు వర్షం, మరొకవైపు పెరట్లోని సన్నజాజుల సుగంధం, ఎదురుగా తులసి.

ఇంక ఆలోచించలేక పోయాడు. అతడికి తెలియకుండానే అతడి చేతులు తులసి నడుమీ్మదికి వెళ్లాయి. మరుక్షణం ఆమె తల వెంట్రుకల్లో దూరాయి. అతడు ఆమెను ఎంత వీలయితే అంతగా ఊరడించాలనుకున్నాడు. ఆమె మాత్రం తన ఆపదలన్నింటికీ పెద్ద ప్రాపు దొరికినట్టుగా అతణ్ణి అతుక్కుపోయింది.

రోజులు దొర్లిపోతున్నాయి. అతడు విజయవాడలో జాయినయ్యాడు. నాలుగు నెళ్ళదాకా అక్కడే ఉండాల్సి వచ్చింది. ఈలోగా అతడి జీవితంలో అతి ముఖ్యమైన ఒక సంఘటన జరిగింది. అది అతడి పెళ్ళి. అదేపనిగా బలవంత పెట్టడంతో ఓ నెల సెలవు పెట్టి ఊరికెళ్ళాడు. అమ్మాయి సుమతి నచ్చింది.

ఆమె అతడికి అంతకు ముందే పరిచయం. ఒక వారం రోజుల్లో నిశ్చితార్థమూ, పెళ్ళి జరిగిపోయాయి. థామస్ మాస్టర్ పెళ్ళికి రాలేక పోయాడు. ఫ్యామిలీతో వచ్చేటప్పటికి అతడి కోసం ఒక క్వార్టరూ, అవసరమైన సామాగ్రీ సిద్ధం చేసి ఉంచుతానని ఉత్తరం రాశాడు.

సుమతి అతి తక్కువ కాలంలోనే అతడిలో అనూహ్యమైన భావ పరిణామాల్ని కల్గించింది. భార్యా సమేతంగా మళ్లీ ఉద్యోగ స్థలానికి వచ్చాడు. థామస్ మాస్టర్ ఇద్దరినీ బొకేలతో రిసీవ్ చేసుకున్నాడు. క్వార్టర్సుకు చేరుకోగానే ఆ చిన్న రైల్వే కాలనీలో ఉంటున్న జనమంతా మూగారు. పాయింట్స్ మ్యాన్ రాముడి ముసలి తల్లి హారతిచ్చి సుమతిని లోనికి తీసుకెళ్లింది. ఇంతమందిలో కాస్త దూరంగా ఉండి తులసి ఈ తతంగాన్ని గమనిస్తోంది. ఆ అమ్మాయి వాలకం ఆనందంగా వాళ్లిద్దరినీ ఆహ్వానిస్తున్నట్లుగా ఉంది.

కాస్తో కూస్తో మలయాళం తెలిసిన ఒకావిడ ఆ కాలనీలో ఉంది. ఆమె పోర్టర్ ముత్తుస్వామి భార్య. ఆమెను సుమతికి పరిచయం చేశాడు.

"సుమతీ! భయపడాల్సిందేమీ లేదు" అని చెప్పి స్టేషన్‌కు వెళ్లాడు.

"ఆ అమ్మాయి అప్పుడప్పుడు నీ క్షేమ సమాచారం తెలుసుకుంటోంది. ఏంటీ, నాకు తెలియకుండా కొంపదీసి ఆ పిల్లని నువ్వేమైనా....?" అన్నాడు థామస్.

అతడు "హేయ్" అంటూనే థామస్ మాటల్ని తోసిపుచ్చాడు. థామస్ మళ్ళీ "విన్నావా, భాస్కర్ రెడ్డి తులసిని వదిలిపెట్టలేదు. పోలిగాణ్ణి డబ్బులిచ్చి తన వశం చేసుకున్నాడు. తులసిని బలవంతంగా డాక్టర్‌కు చూపించాడు. ఆ పిల్లకెలాంటి

రోగమూ, రొష్టూ లేదని డాక్టర్ చెప్పాడు. రెడ్డి పోయిన ఉగాదికి తనివ్వాల్సిన చీరలూ, ధాన్యమూ ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చాడు. అతడి ఆనందానికి అవధులే లేవు. ఇప్పుడు తులసిని ఉంపుడుగత్తెగా చేసుకున్నాడు. ఇప్పుడివన్నీ ఎందుకులెండి. ఇంటికి వెళ్ళండి. అన్నట్టు...ఇంకా రెండ్రోజులు లీవుంది కదా!" అన్నాడు.

క్వార్టర్సుకు తిరిగొచ్చేసరికి ఆశ్చర్యపోవడం అతడి వంతయింది. అక్కడంతా సన్నజాజుల వాసన. సుమతి తలలో పూదండ. ఈ ప్రాంతపు ఆడవాళ్ళకు ఈ పూలంటే ప్రాణం.

"బాగుంది. అప్పుడే అచ్చం తెలుగమ్మాయిలా మారిపోయావే?" అన్నాడు.

"అంతా వెళ్ళిపోయాక ఓ అమ్మాయి నన్ను చూడడానికొచ్చింది. ఆమె చాలా అందమైన పిల్ల. ఈ దండ నా కోసం ప్రత్యేకించి అల్లిందట! ఆమె మాట్లాడిన తమిళం నాకు కొంచెం కొంచెంగా అర్థమైంది."

ఆ తర్వాత తులసి అటు వైపు రాలేదు.

మరో రెండు రోజులు గడిచాయి. ఒక రోజు డ్యూటీలో ఉన్నప్పుడు గుమ్మం దగ్గర ఎవరో తచ్చాడుతున్నట్లు చప్పుడైతే తలెత్తి చూశాడతడు. ఎవరూ కనిపించలేదు. అతనప్పుడు ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. విశాలంగా పరుచుకుని ఉన్న గోదావరిలో ఒక లాంచీ ముందుకు సాగుతోంది. అక్కణ్ణించి ఏదో పాట అస్పష్టంగా వినవస్తోంది. ఆ పాట గాయపడ్డ మృగం తాలూకు రోదనలా ఉంది. సరిగ్గా అప్పుడే టికెట్ కౌంటర్‌కు అటువైపు తులసి నుంచుని ఉండడం అతని దృష్టిలో పడింది. కౌంటర్‌లోంచి ఆమె ఓ ఉత్తరం లోపలికి దూర్చడం గమనించాడు. వెంటనే లేచి వెళ్ళాడు. కానీ, ఆమె అప్పటికే వెళ్ళిపోయింది. ఆమెతో 'ఏం మాట్లాడాలి' అని అతడు అనుకునేలోపు అంతర్థానమైంది. ఆమె తనతో ఎన్నో చెప్పుకోవాలని బహుశా ఇక్కడికి వచ్చి ఉంటుంది అని అనుకున్నాడు. అతడు ఉత్తరం తీసుకుని చూశాడు.

చిన్న వైలట్ పెన్సిల్‌తో రాసిన అక్షరాలు.

"చిన్న మాస్టర్‌గారికి, ఈ లోపు అన్ని విషయాలూ అర్థమై ఉంటాయి. అయినా నాకెలాంటి బాధా లేదు. జీవితంలో ఒకరయినా నా బాధను, మనస్సును అర్థం చేసుకున్నారు. అది చాలు. పైగా ఆ మనిషి నేను బాగా ఇష్టపడిన మనిషి. నా శరీరమే ఈ రెడ్డికి కావాల్సింది. ఇప్పట్నుంచి ఈ తలసి ఉత్త శరీరమే! చిన్న మాస్టర్‌గారికీ, అక్కగారికీ కోటి కోటి దండాలు".

ఆ తర్వాత తులసి శరీరం కూడా లేకుండా పోయింది. ఆ రోజు డ్యూటీలో థామస్ మాస్టర్ ఉన్నాడు. రాజమండ్రిలో ఏదో జాతర కొరకు వెళుతున్న జనాలతో ప్లాటుఫారం కిటకిటలాడుతోంది. అంత మందిలో పట్టు చీరలో తళతళా మెరిసిపోతున్న తులసీ, భాస్కర్ రెడ్డి...ఇద్దరూ ఉన్నారు. కొత్తగా వచ్చిన పిల్లతో బాహాటంగానే రాజమండ్రి ఉత్సవానికి వెళుతున్నట్లున్నాడు రెడ్డి. సరిగ్గా ఆ సమయంలోనే పరిసరాలను తట్టి లేపుతూ దడదడమంటూ ఓ గూడ్సు బండి దూసుకువస్తోంది. రెడ్డితో పాటు నడిచి వస్తున్న తులసి మాత్రం కాస్త వంగి, సాగిపోతున్న గూడ్సు కింద పడిపోయింది.

– విపుల (నవంబరు 2006)